కవిత్వ భాష

సాహిత్య వ్యాసాలు



బొల్లోజు బాబా

కవిత్వ భాష సాహిత్య వ్యాసాలు
బొల్లోజు బాబా

కవిత్వ భాష

(సాహిత్య వ్యాసాలు)

Dedicated to
"KAVISANGAMAM"
and to all the "POETS"
whose poetic lines are cited in this book

బొల్లోజు బాబా

కవిత్వ భాష

బొల్లోజు బాబా

సెప్టెంబరు 2018

వెల – ₹100/-

కాపీల కొరకు
బొల్లోజు బాబా
30-7-31
సూర్యనారాయణ పురం
కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్: 0884/2368189
9849320443
bollojubaba@gmail.com

కవర్ డిజైన్: ముమ్మిడి చిన్నారి

ముద్రణ: రాంషా ప్రెస్, సామర్లకోట

నవ్య నవనీత విమర్శ

– ఆర్. సీతారాం

'కవిత్వం భాష యొక్క భాష' అని వేగుంట మోహన ప్రసాద్ అంటారు. బొల్లోజు బాబా 'కవిత్వ భాష' అంటున్నాడు. మొదటిది కవిగా మో కవిత్వానికిచ్చిన నిర్వచనం. రెండోది విమర్శకుడిగా లేదా పరిశీలకుడిలా కాదంటే సహృదయ పాఠకుడిలా 'కవిత్వ భాష' ఎట్లా ఉంటుంది? ఏది కవిత్వ భాష, ఎందుకు కవిత్వ భాష సాధారణ భాషకాంటే భిన్నంగా ఉంటుంది? ఇంకా ఇట్లాంటి ప్రశ్నలకు సమాధానం లాంటి వివరణ ఈ వ్యాస సంపుటిలోని వ్యాసాలలో కనిపిస్తుంది.

నిజాయితీతో కూడిన విమర్శ, సున్నితమైన ప్రశంస కవి మీదకంటే కవిత్వం పైనే దృష్టి నిలుపుతుందని టి.ఎస్. ఇలియట్ అన్నట్లుగా విమర్శకులు పేర్కొంటూ ఉంటారు. బాబా వ్యాసాలలో ఈ రెండూ కనిపిస్తాయి. సాహిత్యానికి కూడా ఒక ethical reader అవసరం ఉంటుంది. మరి ethical reading ని promote చేయటం ఎట్లా ... ఇటువంటి సందేహాలు ఏవో బాబా మనసును తొలిచి ఉంటాయి. ప్రస్తుతం మన కేంద్ర ఎన్నికల సంఘం ఏ విధంగానైతే ethical voting గురించి ఎంతో చక్కగా ప్రచారం చేస్తున్నదో మనకు తెలుసు. ఎటువంటి ప్రలోభాలకు, ప్రభావాలకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకో, పరి రక్షించేందుకో ప్రతిపౌరుడు బాధ్యతాయుతంగా ఓటు వేయాలి అని చెపుతున్నట్లుగానే, ప్రతి పాఠకుడు తన పాఠకస్వామ్యాన్ని లేదా వాచక స్వామ్యాన్ని కాపాడుకునేందుకు బాధ్యతాయుత పఠనం అవసరం అని బాబా భావిస్తున్నాడనలేం గానీ, ఈ వ్యాసాలు చదివాక కవిత్వం చదవడానికి, కవిత్వాన్ని ఆస్వాదించడానికి కొంత ప్రాథమిక జ్ఞానం పాఠకుడికి అవసరమవుతుందని పాఠకుడే తెలుసు కుంటాడు.

పాఠకోపకారిగా బాబా వ్యాసాలు ఎంతో మేలు చేస్తున్నాయి. పాఠకుడికి ఇంద్రియ నైశిత్యం పెరగడానికి ఇవి దోహదం చేస్తాయి. అయితే బాబా వీటిని నెటిజన్ పాఠకుల సౌకర్యార్థం వెలువరించినా ఇవి నెటిజనేతర పామర సిటి

జనులకు బహుధా లబ్దిని చేకూర్చి పెడతాయి అనడంలో సందేహించాల్సిందేమీ లేదు. పాఠకుడు నిశితంగా, సున్నితంగా, నిజాయితీగా పఠించడానికి కావలసిన భావ భూమికను ఇవి అందించగలుగుతున్నాయి. ఈ ప్రయత్నం హర్షణీయం, అభినందనీయం అని అనాలని ఉంది కానీ, కొందరికిది హర్షణీయం కాకపోవచ్చు. ఆక్షేపణీయం కూడా కావొచ్చు. ఏందుకంటే బాబా ఈ వ్యాసాలలో ఇచ్చిన సమాచారం, జ్ఞానం, అవగాహన, వివరణ, విశ్లేషణల కంటే మెరుగైన సాహిత్య పఠన జ్ఞానశీలావగాహనలు పుష్కలంగా కలవారు కూడా ఉండి ఉండవచ్చు. అట్లాంటి వారి కంటికివి ఆనకపోనూ వచ్చు. ఆ దృష్ట్యా బొల్లోజు బాబా ఒక విధేయ ప్రయత్నం చేసాడని, అందులో కృతార్థుడయ్యాడని కూడా మనకు అర్ధమవుతుంది. ఇట్లాంటి ప్రయత్నాలు బహుముఖంగా, బహుళంగా, బహు పార్శ్వాలనుండి బహుళజన సందోహాలనుండి ఎంత విరివిగా వస్తే అంతగా సాహిత్యానికి మేలో కీడో తప్పకుండా జరుగుతుంది.

కవితలో కనిపించే లేదా వ్యక్తమయ్యే ఉద్వేగం కొన్ని సందర్భాలలో అందరికీ దొరకదు. అందరూ సమానంగా దానిని అందుకోనూ లేరు. దానికి అనేక కారణాలు ఉండి ఉండవచ్చు. నిజానికి అందిన మేరకు కవిత్వోద్వేగాన్ని పఠితలు ప్రశంసించాలి తప్ప కవి వ్యక్తిగత చరిత్రను కాదని పలు సందర్భాలలో ఎంతో మంది విమర్శకులు తెలిపి ఉన్నారు. అందుకే కవుల వ్యక్తిగత విషయాలలోకి తొంగిచూడకుండా 'కవిత్వ భాష'ను ఎంచుకొని కవిత్వంలోకే తొంగిచూస్తున్నాడు. 'కవిత్వ భాష' గా పేరు పెట్టినప్పటికీ వీటిలో భాషగురించి మాత్రమే వివరించలేదు. బాబా కు కవిగా కొన్ని నిశ్చిత సంవేదనలున్నాయి. పాఠకుడిగా కొన్ని ప్రతి స్పందనలున్నాయి. విశ్లేషకుడిగా కొన్ని అభిప్రాయాలు, ఆలోచనలు ఉన్నాయి. ఇవన్నీ ఆయా సందర్భాలను బట్టి వీటిల్లో క్రమానుగతంగా ప్రకటితమయ్యాయి.

సాహిత్య లేదా కవిత్వ విమర్శ సాహిత్యం లేదా కవిత్వంలోని కళాత్మకతను విశదీకరించడంతో పాటుగా సాహిత్యాభిరుచిని సరిదిద్దటం అనే ప్రాతిపదిక మీద ఏదో ఒక మేరకైనా నడుస్తూ ఉంటుంది. అర్ధం చేసుకోవటం, ఆస్వాదించటాన్ని ప్రోత్సహించటమే ప్రాతిపదికగా కూడా కొంతకాలం కొనసాగింది. తెలుగు కవితారంగంలో అన్నీ కలగలుపుగానే కొనసాగుతూ కనిపిస్తాయి. ఏది ఎక్కడ స్పష్టంగా అంతమై కొత్తది వచ్చి చేరిందో తేల్చి

చెప్పటం కొంచెం కష్టమైన పని. వివిధ వాదాలు, ఉద్యమాలు, ధోరణులు, సిద్ధాంత, దృక్పథాలకు సంబంధించి కొంత స్పష్టత ఉంటుందేమో కాని, మిగతా విషయాలకు సంబంధించి ఏదీ విస్పష్టంగా చెప్పటానికి లేదు. బాబా ఈ గొడవలోకి తలదూర్చాడని అనలేంఈ దూర్చలేదనీ చెప్పలేంఈ కవిత్వాన్ని ఆస్వాదించడానికి, ప్రశంసించడానికి అవసరమైన కనీస అవగాహనను, విమర్శ అందించాలనే ఆకాంక్ష ఉంది కనుక ఇంత వొద్దికగా ఈ వ్యాసాలు రాసాడు.

ఈ పనిని సమర్థంగా చేసే క్రమంలో నవ్య విమర్శ, ప్రాక్టికల్ క్రిటిసిజం, నిర్మాణవాద విమర్శ, భాషా శాస్త్రం–విమర్శ, పాఠక ప్రతిక్రియ, పోస్ట్ మాడర్నిజం, భారతీయ కావ్య సౌందర్య శాస్త్ర పరిచయం తదితరాలను ఒక క్రమ పద్ధతిలో తన అవసరం మేరకు అధ్యయనం చేసి, అవి అందించిన పనిముట్లను, పరికరాలను, పరిభాషను తెలుగు కవిత్వానికి అను ప్రయుక్త పరిచే ప్రయత్నం చేసాడు. తన లక్ష్యం ఆంగ్ల సాహిత్య విమర్శ వికాస పురోగతిని ప్రస్తావన కాదు కనుక తన పరిధి, పరిమితులను గుర్తెరిగి ఆయా విషయాలను తగురీతిలో ప్రస్తావించాడు.

'కవిత్వ భాష అర్థాంతర స్ఫూర్తినిస్తుంది' అని అంటాడు బాబా. ఈ అర్థాంతర స్ఫూర్తిని దీప్తి మంతం, తేజోవంతం చేసేవాటిని ట్రోప్ అంటారని, ఆంగ్ల విమర్శకులు ట్రోప్స్‌గా పేర్కొన్న కొన్ని విషయాలు, మన కావ్యాలంకార శాస్త్రంలోనూ ప్రసక్తమై ఉన్నాయని, ఈ రెంటి మధ్య సామ్య భేదాలను కొంతమేరకు సంగ్రహించి ఇమేజరీ నుంచి సంస్కృత అలంకారాలు VS ఇంగ్లీషు ట్రోప్స్ వరకు తన అవగాహనను వివరిస్తూ విశ్లేషణ చేశాడు బాబా. ఈ వ్యాసాలు కవిత్వ పాఠకులు శ్రద్ధగా చదివితే వారికొక సాధికారత వస్తుంది. ఇట్లాంటివి పఠితల సామర్థ్యాలను పెంపొందిస్తాయి.

మనమెందుకో కవిత్వ భాష అనడంలో వెసులుబాటు చూసుకున్నాం కాని, నవ్య విమర్శకు పాదులు తీసిన ఐ.ఏ. రిచర్డ్స్ వాడిన మాటల్లో ఎక్కడా 'Poetic' అని కనిపించదు. 'emotive' Language అంటాడు. అలాగే రిచర్డ్స్ అర్థం విషయంలో 'denotative', 'connotative' అనే విభజన కూడా చేశాడు. ఈ మాటలకు సాధారణార్థం/నైఘంటికార్థం గాను, రెండవదానికి విశేషార్థం/లక్ష్యార్థం గానూ అనువదించుకోవచ్చు. ఈ లక్ష్యార్థ సిద్ధి కోసమే కవులు విరివిగా ట్రోప్స్‌ను ఉపయోగిస్తారు. ఉపమా రూపకాది అలంకారాలతో

పాటుగా ఇంకా ఎన్నో రకాల కవిత్వ వ్యక్తీకరణ సాధనాలు, అభివ్యక్తి రూపాలు వచ్చాయి. బొల్లోజు బాబా ఈ Tropes ఏయే ప్రకార్యాలను నిర్వర్తిస్తూ వచ్చాయో విశ్లేషణాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశారు. మెటాఫర్ ను ఆయన సర్వాంతర్యామి సూత్రంగా భాష గూర్చి పేర్కొంటాడు. మెటాఫర్‌ను కేవలం అలంకారంగా మాత్రమే చూడొద్దని తెలుగు కవులలో మో ఎన్నోసార్లు పేర్కొన్నారు. బొల్లోజు పేర్కొన్నవి ఏవీ అలంకార మాత్రాలు కావు. భాషా స్వభావంలోనే ఇవి ఇమిడి ఉన్నాయి. కవి తన భావనా శక్తి ద్వారా వీటిని విశిష్టంగా ఆవిష్కరిస్తాడు. ఈ వ్యాసాలు అట్లా ఆవిష్కృతమైన భావోద్వేగాల సందర్భాలను కవిత్వభాష ఇదీ అని చూపుతున్నారు.

బాబా ఈ వ్యాసాలలో స్టేట్‌మెంట్స్ మీదా కూడా చక్కని వ్యాసం సమకూర్చాడు. భాషను ఉద్వేగపూరితంగా ప్రయోగించే క్రమంలోనే ఒక distortion జరుగుతుంది. కవిత్వంలో ఇటువంటి distortions అనేకం ఉంటాయి. ప్రతి కవిత్మాక ప్రకటన కూడా ఒక Pseudo-Statement అవుతుంది. కవిత్వం ఒక కపట ప్రకటనే తప్ప, అబద్దపు లేదా తప్పుడు ప్రకటన ఏంతమాత్రమూ కాదు.

ఎంతో విస్తృతీ, అర్థ, భావ గాంభీర్యమూ గల పలు విషయాలను ఈ కవితా హృదయుడు సద సద్వివేకముతో, సహృదయ సంభరితంగా నేను కొన్ని సంగతులు తెలపగలుగుతున్నాననే ఆనందంతో విశదమవుతున్నాడు. నిజమైన సాహిత్య ఆశక్తి అంటే మనిషి, సమాజం, నాగరికత పట్ల ఆసక్తిని కలిగి ఉండటం. ఆటువంటి ఆసక్తిని అభిరుచిని ఈ వ్యాసాలు పెంపొందింపచేస్తాయి. నవ్య విమర్శకులు తమ పూర్తి దృష్టిని కవిత్వ భాషమీదనే నిలిపి ఉంచుతారు. భాష, నిర్మాణం, అర్థం మొదలైన వాటిలో నవ్య విమర్శ తొణికిసలాడుతూ ఉంటుంది. క్లెయాంత్ బ్రూక్స్, రాబర్ట్ పెన్ వారెన్, అలెన్ టీటో, జాన్ క్రౌవె రాన్సమ్, విలియం ఎంప్సన్, ఆర్‌పి బ్లాక్‌మూర్, విలియమ్ కె విమ్‌సాటోలు ముఖ్యులు. వీరిలో బ్రూక్స్ కి 'పారడాక్స్', అలెన్ టీటో కి 'టెన్షన్', వారెన్ కి 'ఐరనీ', రాన్సమ్ కి 'టెక్చ్సర్', బ్లాక్ మూర్ కి 'జెశ్చర్', విలియమ్ ఎంప్సన్ కి 'యాంబిగ్యుటి' కొలబద్దలైనట్లుగా ఈ అన్నిటినీ సంలీన పరచుకొని 'కవిత్వ భాష'ను తను కవిత్వ కొలమానంగా అందిస్తున్నాడు. బాబా కు హృదయపూర్వక స్వాగతం.

– ఆర్. సీతారాం

కృతజ్ఞతలు

ఈ పుస్తకానికి ముందుమాట వ్రాసి ఎంతో ప్రేమతో ఆశీర్వదించిన
శ్రీ రెంటాల వెంకటేశ్వర రావు గారికి

ఈ వ్యాసాలకు చక్కని వేదిక నిచ్చిన 'కవిసంగమం' యాకూబ్ అన్నకు

వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడుపుతూన్న నా సాహితీగురువు
శ్రీ శిఖామణి గారికి

నాకు ప్రేరణగా నిలిచి, స్ఫూర్తి నిచ్చే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి,
శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మిదేవి గారికి

అందమైన ముఖచిత్రాన్ని ఇచ్చిన బాల్య మిత్రుడు ముమ్మిడి చిన్నారికి-

ఇంకా

శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, శ్రీ జి. లక్ష్మినరసయ్య, శ్రీ సీతారాం,
శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్, శ్రీ అఫ్సర్, డా. శైలజ కాళ్ళకూరి, శ్రీ పి.ఆర్.ఎల్.
స్వామి, శ్రీ గనార, శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీ మార్ని జానకిరామ్ చౌదరి,
శ్రీ జోశ్యుల కృష్ణబాబు, శ్రీవత్స రామకృష్ణ, శ్రీ అవధానుల మణిబాబు,
శ్రీ చెల్లి రాం, శ్రీ మధునాపంతుల, శ్రీ అనిల్ డాని, శ్రీ సుంకర గోపాల్,
డా. హరి రామ్ ప్రసాద్, ఫణి, సారథి, ప్రభాకరరావు, శ్రీ అశోక్ కుమార్,
శ్రీ కలిదిండి వర్మ, శ్రీ పుప్పాల శ్రీరాం .... అంతర్జాలంలో
నా రచనలను చదివి ప్రోత్సహించే పెద్దలకూ, మిత్రులందరకూ....

భవదీయుడు
బొల్లోజు బాబా

అనుక్రమణిక

ముందుమాట

చాన్నాళ్ళ క్రితం భారతీయ అలంకారాలను సమకాలీన ఉదాహరణలతో వ్యాసం వ్రాయటానికి నోట్స్ వ్రాసుకొన్నాను. ఒక్క ఉపమాలంకారాలలోనే పాతికకు పైగా వైవిధ్యాలు ఉండటం చూసి అన్నింటికి సరిపడే ఉదాహరణలు తేలేననిపించి విరమించుకొన్నాను. ఆ తరువాత వికిపిడియాలో పాశ్చాత్య అలంకారాలపై ఒక వ్యాసాన్ని చదివాకా సమకాలీన కవిత్వంలో పాశ్చాత్య అలంకారాల అన్వేషణలో పడ్డాను. అదే సమయంలో శ్రీ యాకూబ్, "కవిసంగమం" గ్రూప్‌కు ఒక కాలమ్ వ్రాయమని అడిగారు. అలా ఈ వ్యాసాలు "కవిత్వ స్వరం" పేరిట కవిసంగమంలో సీరిస్ గా వచ్చాయి (2017లో). ఎంతో మంది మిత్రులు, పెద్దలు ప్రోత్సహించారు. వారు ఇచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా మార్పులు, చేర్పులు చేసి, అదనంగా మరికొన్ని వ్యాసాలను జతపరచి "కవిత్వ భాష" గా తీసుకు వస్తున్నాను.

ఈ వ్యాసాలు వ్రాయటంలో నా ఉద్దేశం పాశ్చాత్య అలంకారాలను పరిచయం చేయటం మాత్రమే అని భావిస్తున్నాను.

ఈ వ్యాసాలలో శ్రీశ్రీ నుంచి కాశిరాజువరకూ చాలా మందిని ఉదహరించాను. ఇంకా మంచి ఉదాహరణలుగా నిలిచే అనేకమంది వాక్యాలు ఉండ వచ్చు. వాటిని ఉటంకించలేక పోవటానికి కారణం నా పరిమిత జ్ఞానమే తప్ప మరొకటి కాదని అనుకొంటాను. దీనిని సహృదయులు అర్థం చేసుకొంటారని ఆశిస్తాను.

ఈ సీరిస్ వస్తున్న సమయంలో అలంకారశాస్త్రాన్ని తెలుసుకొంటే కవిత్వం వ్రాయవచ్చా అని ఒక మిత్రుడు అడిగినప్పుడు ఇలా సమాధానం ఇచ్చాను.

"అలంకార శాస్త్రం దేన్నైనా అది ఎందుకు కవిత్వమయ్యిందో విశ్లేషించగలదు తప్ప కవిత్వాన్ని తయారు చెయ్యటానికి పనికిరాదని నా అభిప్రాయం. కవిత్వాన్ని కవే సృష్టించాలి. దానికి పరిశీలన, ప్రతిభ, అభ్యాసం తప్ప వేరే దగ్గర దారులుండవు. కాని అలంకారాల పట్ల కవి ఎరుక కలిగి ఉండటం మంచిది"

భవదీయుడు
బొల్లోజు బాబా
24-08-2018

కవిత్వభాషని వింటూ...

శ్రీ రెంటాల శ్రీవెంకటేశ్వర రావు

బొల్లోజు బాబా కవి. కవిత్వానువాదకులు కూడా. ఆ పదాలకు మంచి అనే విశేషణం చేర్చడానికి మొహమాట పడక్కర్లేదు. 'వెలుతురు తెర' చదివాక ఆయన అభిమానినయ్యాను. ఆయన విశ్లేషణ వ్యాసాలు కూడా రాస్తున్నట్టు తెలుసుగాని పెద్దగా చదవడం పడలేదు.

ఆ మధ్య పుష్పరాజ్‌గారని ఒక సాహిత్యమిత్రుడితో మాట్లాడుతున్న సందర్భంలో 'బొల్లోజు బాబా ఎవరండీ?'అని అడిగారాయన. 'ఎందుకొచ్చిందీ ఆ ప్రశ్న?' అని నేను ఎదురడిగాను.' ఫేస్‌బుక్‌లో వారి రచనలు చదవడం మొదలుపెట్టి నిన్న రాత్రి పన్నెండింటి వరకూ మేలుకొని ఉండిపోయాను. బాగా రాస్తున్నారు' అన్నారు. ఇటువంటివి గుప్త అవార్డులు. పునాదుల్లా ఉంటాయి. భవనాల్లా పైకి కనబడకుండా. ఆ సందర్భంగా ఆయన విమర్శ వ్యాసాలు కూడా రాస్తున్నారని, బాగా రాస్తున్నారని నాకు అర్థమైంది.

ఇప్పుడు 'కవిత్వ భాష' అని ఈ పుస్తకంతో మన ముందుకు వస్తున్నారు. దీనికి అలంకార దర్శనం అనో, కవిత్వ అభివ్యక్తి పద్ధతులు అనో ఒక 'గాఢ నామం' తగిలించక కవిత్వభాష అని పేరు పెట్టారు పొందికగా. బాబాగారిని చూస్తున్నాను కదా ఆయన అన్ని పనులలోనూ ఈ పొందిక, క్లుప్తత కనిపిస్తాయి.

ఇటువంటి వాటిని ఆధునిక అలంకార శాస్త్ర పుస్తకాలు అనాలి. ఈ మాట అతిశయోక్తిగా అనిపిస్తుంది కానీకాదు. సులక్షణ సారం వంటి పుస్తకాలు

కొత్త విషయాలు ఏమీ ప్రతిపాదించకుండా అంతకు ముందు చెప్పిన ఛందోది విషయాలను ఒక చోట చేర్చి చెప్పి అంతమాత్రానే అలంకార శాస్త్ర గ్రంథాలు అనబడుతున్నప్పుడు దీన్ని అనడంలో తప్పులేదు. అయితే ఒక తేడా ఉంది. అవి నిర్దేశాత్మకాలు ఇది వివరణాత్మకం. ఆధునిక శాస్త్రాలన్నీ డిస్క్రిప్టివ్‌గానే ఉంటున్నాయి.

ఇలాంటి పుస్తకాలు రెండు రకాలుగా తయారవుతాయి. రచయిత తనకు అప్పటికే బాగా తెలిసిన విషయాలను పాఠకులతో పంచుకోవడానికి రాయడం ఒకటో రకం. తాను తెలుసుకోవడానికి, తెలుసుకుని జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నించే క్రమంలో రాయడం రెండో రకం. ఇది రెండో రకం రచన అని నాకు అనిపించింది. సాధారణంగా ఈ రెండో రకం రాతల్లో కొంత అస్పష్టత ఉంటుంది. కానీ ఈ పుస్తకంలో ఆ లక్షణం లేదు. పొరపాటు పడిన సందర్భాలున్నాయి తప్ప అస్పష్టత లేదు.

బాబాగారు పాశ్చాత్య అలంకార శాస్త్రం నుంచి కొన్ని అలంకారాలను అభివ్యక్తి పద్ధతులను తీసుకుని సోదాహరణంగా వివరించారు. ఇటువంటి రచనల్లో ఒక క్లేశం ఉంటుంది. తగిన ఉదాహరణలను ఎన్నుకోవడం అంత తేలిక కాదు. కొన్ని సందర్భాలలో ఆయన ఇచ్చిన ఉదాహరణలు చూశాక ఆ అవగాహనలోని ఖచ్చితత్వానికి (ప్రెసిషన్‌కి)నాకు ముచ్చటేసింది. ఆయన పఠన వైశాల్యానికి కూడా ముచ్చట పడ్డాను. చాలామంది కవుల్ని కోట్ చేశారు. విస్తృతంగా చదువుతున్నారు బాబాగారు.

ఈ అలంకార విశ్లేషణతో వదిలిపెట్టక ఆయన మరి కొన్ని విషయాలను ముచ్చటించారు. లినియేషన్ అని ఒకటి. వచనకవితలో పాదవిభజన ఎలా ఉండాలి అన్నది చర్చించారు ఒక వ్యాసంలో.

'కవిత్వంలో నిరలంకారత'అనే వ్యాసం నన్ను ప్రత్యేకించి ఆకట్టుకుంది.ఏ అలంకారాలూ లేకుండా కవిత్వం రాయొచ్చు అని గమనింప చెయ్యడం బావుంది. ఈ నిరలంకారత 'ఒక ప్రమాద కరమైన పొలిమేర' అని బాగా చెప్పారు. కానీ మంచి కవి చేరి తీరాల్సిన ప్రదేశం కూడా అది.

బాబాగారి ఇటువంటి కొన్నివాక్యాలు మనని ఆకర్షిస్తాయి. 'మానవ జాతికి రెండు చరిత్రలుంటాయి. ఒకటి యుద్ధాలతో తారీఖులతో రాజకీయాలతోను మరొకటి సాంస్కృతిక భావాలతోను నిండి ఉంటాయి. రెండో దాన్ని కవులు రచయితలు నిర్మిస్తారు' అన్నారొక చోట. మంచి గమనింపు.

అలాగే రచనభాషకి అలంకారాలు ఎందుకు అవసరం అవుతాయో చెబుతూ ఉచ్ఛరించే వేళ పదాలకి ఉచ్చారణ, స్వర విశేషాలవల్ల జతపడే ఉద్వేగాలు లిఖిత రూపంలో కనబడవు కాబట్టి కూడా అలంకారం అవసరం అవుతుంది అని ఒక కారణం చెప్పారు. ఇది కూడా మంచి గమనింపు.

కొప్పర్తి చిత్రలిపి అని ఒక మంచికవిత రాశారు. దాన్ని ఉదాహరిస్తూ 'తెలుపుకూ నలుపుకూ తేడా లేకుండా పోతుంది' అన్న చివరి వాక్యాన్ని ఇలా వ్యాఖ్యానించారు బాబా. 'తెలుపుకు నలుపుకు తేడా లేకపోవడం అంటే బ్రిటిష్ పాలనకు,స్వపరిపాలనకు తేడా లేదని అదే దోపిడీ, అదే అవినీతి, అదే అణచివేత ఇంకా కొనసాగుతున్నా యని చెప్పటం' అని. ఆ కవిత చదివినప్పుడు నాకు ఈ విషయం ఎందుకో తట్టనే లేదు.

ఈ గ్రంథంలో నేను విభేదించే విషయాలు కొన్ని ఉన్నాయి. ఇటువంటి పుస్తకం నేను రాసినా ఇతరులు –ఎవరో ఎందుకు బాబాగారే –నావి కొన్ని పొరపాట్లని తేల్చవచ్చు. అంటే ఈ రచనల స్వభావం అటువంటిది. అయినప్పటికీ ఈ ముందుమాటలో కొంత చోటు వాటిలో కొన్నిటి కోసం కేటాయించడం అనుచితం కాదనీ పైగా అవసరమనీ భావించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే ఊరికే ఆమోదించేయడం కాకుండా ఈ పుస్తకాన్ని పాఠకులు క్రిటికల్‌గా చదువుతారని. ఆ వంకన సాహిత్యవిమర్శా నిఘంటువు నొకదాన్ని తెరిచి చూస్తారని. అసలు ఈ పారిభాషికపదాలన్నీ ఖచ్చితమైన సరిహద్దురేఖలు గియ్యడానికి కాదు. కొన్ని భావనలను గుర్తింపచెయ్యడానికి అని నేను అనుకుంటాను. తద్వారా కవులకు రచన వేళ కొన్ని అభివ్యక్తి వ్యూహాలు స్ఫురించేటట్టు చేస్తాయి ఇవి.

కవిత్వంలో స్టేట్ మెంట్స్ అని ఒక వ్యాసం. అందులో అతిశయోక్తిని అండర్ స్టేట్‌మెంటుని తీసుకుని వివరించారు. అండర్‌స్టేట్‌మెంట్ అన్నది

బాబాగారికి సరిగా అవగతం కాలేదని నాకు అనిపించింది. 'రాయినైనా కాక పోతిని రామపాదము సోకగా, బోయనైనా కాకపోతిని పుణ్య చరితము పాడగా' అనే పాటలో అండర్ స్టేట్‌మెంటు ఉందంటారు. ఎందుకనిట. ఆ స్త్రీ తనని రాయి బోయ వంటి 'కింది'స్థాయి వస్తువులతో వ్యక్తులతో పోల్చుకున్నందువల్లనట. అండర్ స్టేట్‌మెంటు లక్షణం అదికాదు. అండర్ స్టేట్‌మెంట్ అంటే 60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ఎడారిలో ఉండి 'ఇవాళ కొంచెం వెచ్చగా ఉంది'అనడం లాంటిది. ఉన్న స్థితిని తగ్గించి చెప్పడం అది మంచికానీ చెడు కానీ . అతిశయోక్తికి సరిగ్గా వ్యతిరేకం అంటే ఇలా. ప్రి ఓన్‌డ్ కార్స్ అనే మాటలో ఉన్నది అండర్‌స్టేట్ మెంట్ కాదు. సెకండ్ హాండ్ కార్స్ అనడంలో ఉన్న తక్కువదనాన్ని తొలగించి కాస్త మర్యాదగా చెప్పడం ఉంది. యూఫిమిజం అంటామే అది ఉంది.

82 వ పేజీలో ఐరనీకిచ్చిన ఉదాహరణ సరైనది కాదు . చంద్రునిలో మచ్చలున్నాయి కనుక సరిపోయింది. లేకపోతే ప్రతి ఒక్కడూ ఆమె ముఖాన్ని చంద్రబింబంతో పోల్చేవారే అనే వాక్యాలలో ఐరనీ లేదు. వెర్బల్ ఐరనీ అంటే ఉద్దేశించిన అర్థానికి వ్యతిరేకమైన అర్థాన్నిచ్చే పదాలు వాడడం. బుద్ధిహీనుణ్ణి పట్టుకుని బృహస్పతి అన్నట్టు. ఇటువంటి తేడాలు ఇంకా కొన్ని ఉన్నాయి.

అనువాద సాహిత్యం అనే వ్యాసం ఈ పుస్తకంలో ఇముడదు. బాబా కవిత్వానువాదం కూడా రాసిన వారు కనక అనువాదంమీద ఉన్న ప్రత్యేకప్రీతి కొద్దీ దీన్ని చేర్చి ఉంటారు. కవిత్వేతర అనువాదాల ప్రసక్తి ఎక్కువ కావడం వల్ల ఇక్కడ అనవసరం అంటున్నాను. కవిత్వానువాదంలో భాషరీత్యా వ్యక్తీకరణ రీత్యా వచ్చిపడే సమస్యల్ని వాటి పరిష్కరణ రీతుల్ని – తన అనువాద రచనానుభవజన్యమైన విషయాలతో చర్చించి ఉంటే బావుండేది.

ఏదో ఒక్కలోపమయినా లేని రచన ఏదీ ఉండదు.ఏ పనయినా నిర్దుష్టత వల్ల కాక గుణ బాహుళ్యం వల్ల మంచిదనిపించుకుంటుంది.కాబట్టి ఇది అభినందించదగ్గ మంచి ప్రయత్నం.

కవిత్వ భాష

ఒక ఆలోచననో, ఉద్వేగాన్నో, అనుభవాన్నో లేక ఈ మూడింటినీ కలగలిపో కళాత్మకంగా చెప్పిన భాషారూపమే కవిత్వం. అందుకనే కవిత్వాన్ని బహుముఖాలు కలిగిన భాషగా నిర్వచిస్తారు. మామూలు భాషలో సమాచారం మాత్రమే ఉంటుంది, కవిత్వ భాషలో ఉండే అనుభూతి, ఉద్వేగం, ఊహాశాలిత, ప్రజ్ఞల వల్ల పాఠకుడు అనిర్వచనీయమైన అనుభవానికి లోనవుతాడు.

"కవిత్వం ఆహ్లాదంతో మొదలై వివేకంతో ముగియాలి" అంటాడు రాబర్ట్ ఫ్రాస్ట్. అభినవగుప్తుని దృష్టిలో "ఆనందోపదేశములు" కావ్యప్రయోజనాలు. ఈ రెండు నిర్వచనాలను బట్టి కవిత్వానికి రెండు బాధ్యతలు ఉన్నట్లు చెప్పుకోవచ్చు.

1. హృదయానికి ప్రీతిని కలిగించటము 2. వివేకంతో కూడిన ఉపదేశాన్నివ్వటం. ఏది ఎక్కువ ముఖ్యం అనే చర్చలు అనాదిగా ఉన్నవే. కళకళ కొరకే, కళసామాజిక ప్రయోజనం కొరకు అనే రెండు పాయలు ప్రవహిస్తూనే ఉంటాయి.

హృదయాన్ని రంజింపచేయటమే కవిత్వ బాధ్యతగా ఉండేది ఒకప్పుడు. దీనినే అలంకారికులు రససిద్ధి అన్నారు.

ఆధునిక కాలానికి వచ్చేసరికి సంఘశ్రేయస్సు, అభ్యుదయభావనలు, సామాజిక స్పృహ, అస్తిత్వవాదం వంటి అదనపు బాధ్యతలు కవిత్వంలోకి వచ్చి చేరాయి. ఈ ధోరణిని నిరసిస్తూ- నీతిబోధలు మిడిమిడి జ్ఞానము కలవారికి అవసరం తప్ప, కవిత్వాన్ని ఆస్వాదించే ప్రతిభావంతులకు కాదు అని ఆస్కార్ వైల్డ్ అభిప్రాయపడ్డాడు.

ఒకానొక దశలో సామాజిక స్పృహకలిగిన కవిత్వమే నిజమైన కవిత్వమనీ, మిగిలినదంతా ఆత్మాశ్రయ కవిత్వమని, చెట్టూ పుట్టా కవిత్వమనే వాదనలు కూడా వచ్చాయి. ఇలాంటి వాదనలను "కవిత్వం జీవితపు సామస్త్యాన్ని ప్రతిబింబించాలని జీవితంలో రాజకీయాలు ఒక భాగమే తప్ప అవే జీవితం కావని" శేషేంద్రశర్మ – "వివిధ వాదాలతో కవిత్వం వ్రాయటం అంటే తిరగళ్ళు కాళ్ళకు కట్టుకొని నడవటం వంటిదని" ఇస్మాయిల్ వంటి ప్రముఖులు ఖండించారు.

ఒకప్పుడు కవిత్వం బౌద్ధికమైన ప్రక్రియ, నేడది సామాజికంగా పరిణామం చెంది డెమొక్రటైజ్ అయింది. ఇదొక కాలమార్పు. దీనివల్ల కవిత్వంలో వస్తువిస్తృతి పెరిగి, మానవజీవిత సమస్తకోణాలూ ఆవిష్కరింపబడుతున్నాయి. మనము అనుభవించని, సుదూరంగానైనా ఊహించలేని అనేక జీవనోద్వేగాల్ని కవిత్వంలో అనుభూతి చెందగలుగుతున్నాం. ఇదొక మంచి పరిణామంగానే భావించాలి.

***

వచనాన్ని కవిత్వాన్ని వేరు చేసేది భాషే. వచనంలో చెప్పే విషయమే ప్రధానం కానీ చెప్పే పద్ధతి కాదు. కవిత్వానికి వచ్చేసరికి విషయంతో పాటూ దానిని ఎంత ఉద్వేగభరితంగా చెపుతున్నామనేది కూడా ప్రధానమే. సాధారణ భాషకు అర్ధస్ఫూర్తి నివ్వటం ఒక్కటే పని. అంటే తాను చెప్పదలచుకొన్న విషయాన్ని చెప్పటంతో దాని బాధ్యత తీరిపోతుంది. కవిత్వ భాష అర్థాంతర స్ఫూర్తినిస్తుంది. అంటే చెపుతున్న విషయంతో పాటు చెప్పని విషయాన్ని కూడా ధ్వనింపచేయటం. దీన్నే ధ్వని, వక్రోక్తి, వ్యంగ్యం లేదా ఌఘ్వత్ జశీత్వత్ అంటూ వివిధ పేర్లతో అలంకారికులు పిలిచారు.

వచనంలోని భాషకు, కవిత్వభాషకు ఉండే తేడాను తెలుసుకోవటానికి ఒక ఉదాహరణ.

1. Alphabet

ABCDE

FGHIJ

KLMNO

PQRSTU

VWXYZ

2. Suicide

ABCDE

FGHIJ

KLMNO

PQRSTU

VWXYZ

మొదటి దాంట్లో ఎబిసిడిలను ఆల్ఫాబెట్స్ అని చెప్తున్నట్లు అర్థమౌతుంది. అంతటితో ఆ వాక్యం పూర్తయింది ఇక దానినుంచి ఏ రకమైన అదనపు అర్థాలు పొందలేము.

రెండవ దాంట్లో కవి ఒక కొత్త విషయాన్ని చెపుతున్నాడు. అక్షరమాలను ఆత్మహత్య అంటున్నాడు. (ఆ విషయం మనం ఒప్పుకోవచ్చు ఒప్పుకోకపోవచ్చు అది వేరే విషయం). వెంటనే మన ఆలోచనలు పరిపరివిధాలుగా విస్తరిస్తాయి. ఆల్ఫాబెట్స్‌కు నాగరికత అని అర్థం చెప్పుకొంటే నాగరికతను ఆత్మహత్యగా కవి చెప్తున్నట్లు భావించాలి. ఆత్మహత్య చేసుకొన్నది మనిషి కావచ్చు, మానవత్వం, అమాయకత్వం, స్వచ్ఛత ఏమైనా కావొచ్చు. మన ఆలోచన పరిధిని బట్టి అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. కానీ ఇన్ని విషయాలనూ కవి నేరుగా చెప్పటం లేదు, ఇవన్నీ కవి చెప్పని విషయాలు. చెపుతున్న విషయాలే కాక చెప్పని విషయాలను కూడా ధ్వనింపచేయటం అంటే ఇదే. ఇక్కడ కవి తనకు కలిగిన భావాన్ని మనలోకి ప్రవేశపెట్టాడు. అది కూడా భిన్న కోణాలలో ఆవిష్కరింపబడేలా. పైది వచనమైతే క్రిందది కవిత్వం.

కవిత్వంలో ఏం చెప్పాలి ఎలా చెప్పాలి అనేవి రెండు ముఖ్యమైన అంశాలు.

ఏం చెప్పాలనేది కవి స్వేచ్ఛకు, జీవితంపై అతని అవగాహనకు సంబంధించింది. రోజూ చూసే అనేకాంశాలను, అనుభవాలను వాటిలోని వైరుధ్యాలను కవి వస్తువుగా తీసుకొంటాడు. వస్తువును చెప్పే విధానాన్ని శిల్పం అంటారు.

ఒక దృశ్యమో, ఊహో నేరుగా కవిత్వంగా మారదు. దానిని కవిత్వభాషలోకి మార్చాలి. మామూలు భాషను కవిత్వభాషగా మార్చేందుకు, సింబల్, మెటనిమీ, పెర్సొనిఫికేషన్, అల్లిగొరి, మెటాఫర్, పారడాక్స్ వంటి వివిధ కవిత్వనిర్మాణ పద్ధతులు తోడ్పడతాయి. పైన చెప్పిన ఆల్ఫాబెట్స్ ఉదాహరణలో 'పారడాక్స్' ప్రక్రియ ఉంది. కవిత్వభాష శిల్పాన్ని నిర్దేశిస్తుంది. "సాహిత్యానికి సాహిత్య లక్షణాన్ని ఇచ్చేది శిల్పమే తప్ప వస్తువు కాదు" అంటారు బాలగోపాల్. ఈ కవిత్వ భాషనే ప్రముఖ కవి సచ్చిదానందన్ "సమాంతర బాష" అన్నాడు.

మనం రోజూ చూసే దృశ్యాలు, ఎదుర్కొనే సంఘటనలు, చేసే ఊహలు కవిత్వంగా మారటానికి కవిత్వభాషగా మారటానికి వివిధ కవిత్వనిర్మాణ సాధనాలు సహాయపడతాయి.

ఇంటిపనుల్లో అలసిపోయిన ఒక స్త్రీ ఆదమరచి నిదురపోయే దృశ్యం ఎంతో అపురూపంగా అనిపిస్తుంది. ఆమెకు నిద్రాభంగం కలగకూడదని ఇంట్లో వాళ్లు అనుకోవటం కూడా సహజమే. ఇది చాలా మామూలుగా ప్రతీ ఇంట్లో జరిగే విషయమే. దాన్ని కవితావస్తువుగా తీసుకొని శివారెడ్డి గారు వ్రాసిన "ఆమె ఎవరైతే మాత్రం" అన్న కవిత ఒక సాదాసీదా దృశ్యాన్ని గొప్ప కవిత్వంలా ఎలా మలచవచ్చో అనటానికి మంచి ఉదాహరణగా నిలుస్తుంది.

"నా భార్యో, పక్కింటావిడో,
పిల్లలతల్లి, తెల్లని పిల్లో" ఎవరైనా కావొచ్చు
ఆమె అస్పష్టంగా, ముకుళిత పుష్పంలా ముడుచుకు పడుకుంది//

కరుగుతున్న మంచుముక్కలా ఆమె పడుకుంటే
కదులుతున్న నీటిబొట్టులా ఆమె పడుకుంటే
కంట్లో బంధింపబడ్డ గొప్ప దృశ్యంలా ఆమె పడుకుంటే
రాత్రంతా ముకుళించి రేపొద్దున్న

వికసించే అద్భుత పుష్పంలా
ఆమె పడుకుంటే పడుకోనీ" (ఆమె ఎవరైతే మాత్రం – శివారెడ్డి)

పై కవితా వాక్యాలలో నిదురించే ఆ స్త్రీ రూపాన్ని మంచుముక్క, నీటిబొట్టు, దృశ్యం, పుష్పం అనే వివిధ వర్ణణలతో పోలుస్తాడు కవి. ఇందులో కవి ఉ పయోగించుకొన్న టెక్నిక్‌ను Simily అంటారు.

ఎండాకాలంలో నదులు ఎండి స్తబ్దంగా పడిఉంటాయి. ఏవిధమైన సందోహాన్ని కలిగిఉండవు. వానలు వచ్చాకా నదులు నిండి, సుళ్ళుతిరుగుతూ ప్రవహిస్తాయి. ఎర్రనినీళ్లతో కదిలే నది ఒక ఉత్సవాన్ని మోసుకువెళుతున్నట్లు అనిపిస్తుంది. నదితో అనుబంధం ఉన్నవారెవరికైనా ఇది ఒక సాధారణ అనుభవమే. ఆ దృశ్యాన్ని దేవీప్రియ ఇలా వర్ణిస్తారు.

//భూమి వయెలిన్ మీద
వదులొదులుగా పడుకున్న నది తీగలని
లాగి బిగించి శ్రుతి చెయ్యడానికొస్తుంది
వానాకాలం// (కిమ్ కాలం – దేవీప్రియ)

భూమిమీద పడుకున్న నది అన్నప్పుడు లేని లోతు– "భూమి వయెలిన్, నది తీగలు" అనటం ద్వారా వచ్చింది. అలా అనటంలో మెటాఫర్ (వీఝ్షు– జూప్త్రశీతీ) అనే టెక్నిక్ దాగి ఉంది.

సొంతఊర్లను వదిలి పొరుగూర్లలో నివసించవలసి రావటం ఆధునిక జీవనవిధానంగా మారింది. అద్దె ఇళ్ళలో నివసించటం తప్పనిసరైంది. ఇది నేటికాలపు జీవనశైలి. చాలామంది మధ్యతరగతి జీవులు ఎప్పుడో ఒకప్పుడు ఇల్లు ఖాళీ చేసే ఉంటారు. ఇల్లు ఖాళీ చేసినపుడు ప్రతిఒక్కరూ తమకు ఆ ఇంటితోగల అనుభవాలను తల్చుకొని ఉద్వేగపడటం సహజం. కవి వాటిని అక్షరాలలోకి తీసుకొస్తాడు. ఆ అనుభవానికి ఉద్వేగాల్ని అద్ది చక్కని కవిత్వంగా మనకు అందిస్తాడు. అలాంటి సందర్భానికి కొండేపూడి నిర్మల వ్రాసిన ఒక కవిత ఇది

ఉనికి తాలూకు ఆనవాళ్ళన్నీ

చెరిగిపోతాయి
పెట్టేబేడా సర్దేయగానే
ఒకట్రెండు బాధగా వొంగిన
మేకులు మినహా
పెద్దగా మార్పేమీ ఉండదు.//

అద్దంలేని గోడ
తలమాసిందని చెప్పదు
సబ్బులేని స్నానాలగది కిటికీ
పరిమళాన్ని పావురంలా ఎగరేయదు
(ఇల్లు ఖాళీ చేసినపుడు – కొండేపూడి నిర్మల)

పై వాక్యాలలో మేకులకు, అద్దానికి, స్నానాల గదికి మానవలక్షణాలు ఆరోపించటం ద్వారా మామూలు సందర్భంలోని ఉద్వేగం ఎన్నోరెట్లు హెచ్చింపబడింది. మేకులే బాధతో వొంగాయంటే ఇక మానవహృదయం ఎంత? అనే భావన కలిగిస్తారు కవయిత్రి. దీనంతటికీ కారణం సమర్థవంతంగా వాడబడిన పెర్సొనిఫికేషన్ (Personification) టెక్నిక్.

ప్రతిమనిషి జీవితంలో అప్పుడప్పుడూ దిగులు సందర్భాలు ఎదురవుతూంటాయి. హృదయం బాధతో మూలుగుతూంటుంది. అలాంటప్పుడు ఒక్కోసారి మన జీవితంలో ఆనందంగా గడిపిన క్షణాలను గుర్తుకుతెచ్చుకొని మనకు మనమే మళ్ళీ ఉత్సాహపడతాం. మళ్ళీ దైనందిన కార్యక్రమాలలోకి తేలుతూ సాగిపోతాం. చాలామందికి ఇది అనుభవైకవేద్యమే. దాన్ని ఈ కవి ఇలా అంటున్నాడు

గదినిండా చీకట్లు మాత్రమే పొర్లి,
పొంగుతున్నప్పుడు
అవును, కచ్చితంగా అప్పుడే
కాసింత సంతోషంగా వున్నప్పటి
వొకానొక పూర్వ క్షణపు దీపాన్ని మళ్ళీ వెలిగించు. (కాసింత సంతోషం – అఫ్సర్)

పై వాక్యాలలో దిగులుకు బదులుగా చీకట్లు అనే పదాన్ని, తీపిజ్ఞాపకానికి బదులుగా దీపం అన్న పదాన్ని కవి వాడటం గమనించవచ్చు. అందువల్లే ఒక చక్కని ఊహ చిక్కని కవిత్వంగా మారింది. అలా మార్చటానికి కవి ఇక్కడ ఎంచుకొన్న టెక్నిక్‌ను మెటనొమీ (Metonymy) అంటారు.

*****

చలం రచనలు, రావిశాస్త్రి, కథలు, బుచ్చిబాబు రచనలు, కొన్ని సామెతలు వచన ఫార్మెట్‌లో ఉన్నప్పటికీ గొప్పకవిత్వాన్ని కలిగిఉంటాయి. దీనికి కారణం వచనాన్ని వచనభాషలో కాక కవిత్వభాషలో వ్రాసారని అర్థం చేసుకోవాలి.

కవిత్వ ఫార్మెట్ లో వ్రాసిందంతా కవిత్వం కానట్లే వచనం రూపంలో వ్రాసిందంతా వచనమూ కాదు. ఈ రెంటి మధ్యా సరిహద్దు రేఖ గీయటం అంత సులభం కాదు. ఉత్త సమాచారం కాక మరింకేదో అందించేదాన్ని కవిత్వంగా గుర్తించాలి.

ప్రముఖ కవి విమర్శకులు జి.లక్ష్మి నరసయ్య "కవిత్వం చర్చనీయాంశాలు" వ్యాస పరంపరలో ఒకచోట "కథ కథ కావటానికీ, నవల నవల కావటానికీ నిర్మాణం కారణమైనట్లు కవిత్వం కవిత్వమవటానికి కారణం కూడా నిర్మాణమే' ఆంటారు. మామూలు భాషకు కవిత్వనిర్మాణ సాధనాలు తోడయినప్పుడు అది కవిత్వభాషగా పరిణమిస్తుంది.

కవిత్వభాషలో మరొక ముఖ్యమైన అంశం లయ. ఆధునిక కవిత్వానికి యతి, ప్రాసలు వర్తించకపోయినప్పటికి పదాల మధ్య అనుప్రాస కవిత్వానికి అందాన్నిస్తుంది. దీనివల్ల ఆ వాక్యాలలో ఒక అంతర్లయ అనుభవానికి వచ్చి చదువుతున్నప్పుడు హాయిని కలిగిస్తుంది.

కవి తనకు కలిగిన అనుభవాన్ని పదాల సహాయంతో భాషలోకి తీసుకొస్తాడు. వివిధ కవిత్వనిర్మాణ టెక్నిక్‌లు మామూలు భాషను కవిత్వభాషగా మారుస్తాయి. ప్రతిభ కలిగిన కవి తాను చెప్పదలచుకొన్న అంశానికి తగిన టెక్నిక్‌లను వాడుకొని తన ఉద్వేగాన్ని యథాతథంగా చదువరిలో ప్రవేశ పెట్టగలుగుతాడు. అప్పుడు మాత్రమే అతను వ్రాసింది కవిత్వమౌతుంది. లేకపోతే పేలవమైన వచనంగా మిగిలిపోతుంది.

ఇమేజెరీ (Imagery)

కవిత్వంలో ఇమేజ్ అంటే పదాలతో నిర్మించిన ఒక చిత్రం. ఆ పదాలను చదువుకొన్నప్పుడు మనసులో ఒక దృశ్యం ఊహకు వస్తుంది.

‘‘వెన్నెల ష్మ
మబ్బుల మెట్లమీదుగా
నేలకు దిగే సమయాన’’ (మేఘనా – శిఖామణి)

అనే వాక్యంలో రాత్రి చిక్కబడుతూండగా వెన్నెల మెల్లమెల్లగా బయటపడుతున్న ఒక దృశ్యం ఆవిష్కృతమౌతుంది. ఇక్కడ కవి ఒక ఆహ్లాదకరమైన ఎ సందర్భాన్ని సౌందర్యాత్మకంగా కవిత్వీకరించాడు.

ఒక ఆలోచననో, దృశ్యాన్నో, ఉద్వేగాన్నో చెప్పేటపుడు ఒకటికంటే ఎక్కువ ఇమేజెస్ అవసరపడొచ్చు. అనేక ఇమేజెస్ కలిసి ఒక భావాన్ని వ్యక్తీకరించినపుడు ఆ ఇమేజ్‌ల సముదాయాన్ని ఇమేజెరీ అంటారు. ఒక కవితలో అనేక ఇమేజెరీలు ఉండొచ్చు.

మన అనుభూతులన్నింటినీ ఇంద్రియాల ద్వారానే మనం పొందుతాం. వానవెలసిన ఒక సాయింకాలం పూట – మబ్బుల మధ్యతొంగిచూస్తోన్న నీలాకాశం, చెంపలకు తాకే చల్లని గాలి, ముక్కుపుటాలను ఆగాగి తాకే చిత్తడి వాసనా, పక్షులు తమ తడిచిన రెక్కలను తపతపలాడిస్తూ చేసే శబ్దాలు, గొంతులోకి జారే వేడివేడి చాయ్ రుచీ – అన్నీ హాయైన అనుభూతులను కలిగిస్తాయి. వాటిని మనసు సంశ్లేషించి ఆ ఆహ్లాదకర అనుభవాన్ని, ఒక అందమైన జ్ఞాపకంగా మలచుకొంటుంది. కవిత్వంలో ఇమేజెరీ కూడా ఇదే పని చేస్తుంది. ఋ

ఇంద్రియానుభవం ఇవ్వటం ద్వారా రససిద్ధి కలిగిస్తుంది.

'వేసవి గాడ్పులకి
దాహపు ఖర్జూరచెట్టు
యెడారి గొంతులో
అమ్ములపొదిలా
విచ్చుకొని
గరగరలాడుతోంది ' (దాహం– ఇస్మాయిల్)

పై ఖండికలో దాహమనే ఇంద్రియానుభవాన్ని అనేక ఇమేజెస్ ద్వారా చెపుతున్నాడు కవి . వివిధ మూర్త చిత్రాలను వరుసగా పేర్చుకొంటూ వెళ్లాడు. ఆ ఆరులైన్లు చదివేసరికి పాఠకునికి ఏదో ఎడారిలో మైళ్ళ దూరం నడిచి, దాహంతో గొంతు పిడచకట్టుకుపోయిన అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే 'దాహం అనే అమూర్త భావనను' – ఎడారి, ఖర్జూరచెట్టు, ముళ్ళగరగర వంటి మూర్తచిత్రాలు నేరుగా అనుభవంలోకి తీసుకొస్తాయి. ఇది ఇమేజెరీ గొప్పదనం.

కవిత్వాన్ని అబ్‌స్ట్రాక్ట్ నుంచి కాంక్రిట్‌కు నడిపించటంలో ఇమేజెరీ అతిముఖ్యమైన పాత్రవహిస్తుంది. ఇలా భావాలను దృశ్యరూపంలో చెప్పే పద్దతిని ఇమేజిజం అంటారు.

"వెన్నెల వెలుగుల్ని
మంచిగంధంలా
అరగదీసి రంగరించి
తెలుగింటి ముగ్గులా
బొటనవేలు....చూపుడువేలు సందున
శబ్దమై జారితే
కవిత్వమౌతుంది. (దోసిలిలో నది – శ్రీ దాట్ల దేవదానం రాజు)

పై ఇమేజరీలో – కవిత్వం అంటే మథించీ, రంగరించీ పొందాల్సిన |]Ÿe TøǂpÔayiTÔa yî Tú, eTq dŸdŸృత, సంప్రదాయాల్ని ప్రతిబింబించే ముంగిట కళాత్మక ముగ్గు అనీ, చేతి వేళ్ళ సందున జారే అక్షర సముదాయమనీ, లయాత్మక శబ్దమనీ రాజు గారు నిర్వచిస్తున్నారు. ఈ లక్షణాలన్నింటినీ వాచ్యంగా

చెప్పాలంటే పెద్ద వ్యాసమే వ్రాయవలసి ఉంటుంది. ఇంత క్లుప్తంగా, గుప్తంగా, అందంగా అనుభూతికి వచ్చేలా చెప్పటానికి ఇమేజరీ టెక్నిక్ దోహదపడింది.

ఇమేజరీ కవిత్వం అంటే చెట్టు పుట్టా కవిత్వమనే భావన కొంతమందిలో ఉంది. సామాజిక, రాజకీయ, కవిత్వాల శక్తివంతమైన నిర్మాణంలో కనిపించే ఇమేజరీ/ఇమేజ్‌లకు కొన్ని ఉదాహరణలు

"గుండెల్లో
మెత్తగా దిగబడే
కాగితపు కత్తి
కరెన్సీ నోటు"

అలిశెట్టి ప్రభాకర్ ఈ ఇరవై అక్షరాల కవిత మానవసంబంధాలన్నీ ఆర్థికసంబంధాలే అన్న మార్క్స్ మాటను గుర్తుకుతెస్తుంది. డబ్బునోట్లో తలపెట్టి ఇరుక్కుపోయిన మానవజాతి పరిణామక్రియను ప్రతిబింబిస్తుంది. గుండెలోకి ఆ అక్షరాలు పదునుగా దిగిన చప్పుడు ప్రతిధ్వనిస్తుంది. కవిత్వంలో ఇమేజరీ స్థానం ఎంతగొప్పదో చూపుతుందీ కవిత.

వాడెవడో మూర్ఖుడు
తల లేని మనిషి మొండేల్ని కుక్కినట్లు
లారీల్లో చెట్టు దుంగల్ని వేసుకెళ్తున్నాడు (అరణ్యకృష్ణ).

పచ్చని చెట్లను కొట్టేసి దుంగల్ని తరలిస్తున్న దృశ్యాన్ని తలలేని మొండాలను తీసుకెళ్ళటంగా పోల్చటం ద్వారా మన భవిష్యత్తు పట్ల భయాన్ని కలిగిస్తాడు కవి. రేపు నీ పరిస్థితి కూడా ఇదేనన్న హెచ్చరిక చేస్తాడు. ఒక బీభత్సాన్ని కళ్ళముందు నిలుపుతాయా వాక్యాలు. ఇదంతా ఒక్క "తలలేని మనిషి మొండెం" అన్న ఇమేజ్ ద్వారా సాధ్యపడింది.

కవిత్వం ఆర్భాటం కాదు
అది నగ్నంగా పడుకున్న
ఓ అపురూప సౌందర్యవతి దేహంతో
పసి పిల్లాడిలా.. పడుచు కుర్రాడిలా
ఏక కాలంలో ఆడుకునే

ఒకానొక అదృశ్య రసానంద రహస్యాత్మ (రసానందం – ప్రసాదమూర్తి).

కవిత్వం సూర్యుడిలా ఒక్కొక్కరికి ఒక్కో విధంగా దర్శనమిస్తుంది. ప్రసాదమూర్తి చిత్రించిన కవిత్వచిత్రం గాఢంగా ఉంటూ చదివినపుడు ఒక్కొక్కరికి ఒక్కోరకపు ఇంద్రియానుభవాన్ని ఎరుకకు తెస్తుంది.

అయ్యో
పాలింకి పోవడానికున్నట్లు
మనసింకిపోవడానికి
మాత్రలుంటే ఎంత బావుండు
(అబార్షన్ స్టేట్ మెంట్ – పాటిబండ్ల రజని).

స్త్రీల Reproductive rights పట్ల స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడకపూర్వమే వ్రాసిన గొప్ప కవిత ఇది. అబార్షన్ తరువాత lactation ను నిలుపుచేయటానికి మందులున్నట్లు, తన నిస్సహాయ స్థితివల్ల గాయపడిన మనసు సాంత్వన పొందటానికి మాత్రలు లేవు అన్న ఇమేజ్, స్త్రీవాద కోణంలో అత్యంత బలమైన అభివ్యక్తి.

ఏ రోడ్డు మీదో నా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా
నా బొటనవేలు గుప్పిట్లో దాక్కుంటుంది (ఆత్మకథ – ఎండ్లూరి సుధాకర్).

ఈ ఇమేజ్‌లో దళితచరిత్ర అంతా ఒదిగిపోయింది. ద్రోణుడు, ఏకలవ్యుడు జ్ఞప్తికి రాకమానరు. వేదాలు విన్నందుకు చెవుల్లో సీసం పోసిన చరిత్ర శకలాలు కన్పిస్తాయి. సాహిత్యంలో దళిత అస్థిత్వానికి ఒక స్థానం కోసం చేసిన ఉద్యమంలో చరిత్రనునిరాకరించే ప్రక్రియలో భాగం ఈ కవిత.

నేను పుట్టకముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై ఉంది నాపేరు (పుట్టుమచ్చ ఖాదర్ మొహిద్దిన్)

పై వాక్యాలు తెలుగుసాహిత్యాన్ని ఉలిక్కిపడేలా చేసాయి. 'పుట్టకముందే' అన్న పదంవల్ల ఈ ఇమేజ్‌కు గొప్ప లోతు, పదును వచ్చి తెలుగుసాహిత్యంలో ముస్లింవాదం ఒక బిగ్ బాంగ్ తో ప్రవేశించటానికి దోహదపడింది.

ఇమేజెరీ ద్వారా కవి శక్తివంతమైన కవిత్వాన్ని సృష్టించగలడు. బలమైన ఇమేజరీ అనేది కవి ప్రతిభ, వ్యుత్పత్తులపై ఆధారపడి ఉంటుంది. ఇమేజెరీలో ఇమేజెస్ లాజికల్ ఆర్డర్‌లో లేకపోతే గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉంది. ఉత్తమ కవిత్వానికి ఇమేజెరీ గీటురాయి.

పెర్సొనిఫికేషన్ (Personification)

మానవలక్షణాలను వస్తువులకో, జీవులకో లేక ఒక ఊహకో ఆరోపించి కవిత్వం చెప్పే పద్దతిని పెర్సొనిఫికేషన్ అంటారు.

కవిత్వం రాసే పద్దతులలో ఇది ఒక ముఖ్యమైన టెక్నిక్. దీనివల్ల ఒక విషయం పాఠకుని మనస్సులో లోతుగా నాటుకొంటుంది. మెటానొమీ లేదా సింబల్ లాంటి టెక్నిక్‌లతో పోల్చినపుడు పెర్సొనిఫికేషన్ చాలా సరళంగా ఉంటూ, పాఠకుడిని శ్రమపెట్టకుండానే కవిత్వానుభూతి కలిగిస్తుంది.

పెర్సొనిఫికేషన్ టెక్నిక్ దైనందిన సంభాషణలలో, కథలలో, వార్తా కథనాలలో కనిపిస్తూనే ఉంటుంది. "ఈ బండి పెట్రోలు పొదుపు చేస్తుంది" అంటాం. "సూర్యుడు నడినెత్తిన నిప్పులు చెరుగుతున్నాడు" అంటూ ఓ కథ మొదలవ్వొచ్చు. "ఆ పథకం అందరిజీవితాలలో వెలుగులు నింపింది" అన్న ఓ వార్తాంశం కావొచ్చు. అన్నీ పెర్సొనిఫికేషన్ కు చక్కని ఉదాహరణలే.

కవిత్వంలో పెర్సొనిఫికేషన్ కు ఒక ప్రత్యేక స్థానం ఉంది ఎందుకంటే పెర్సొనిఫికేషన్ ద్వారా పాఠకుని మనసులో ఒక బలమైన దృశ్యరూపం ఏర్పడుతుంది. కవితలోని మూడ్ లేదా కవిత చెప్పదలచుకొన్న అంశం ఈ టెక్నిక్ వల్ల మరింత స్పష్టంగా అర్ధమౌతుంది. కవిత్వనిర్మాణ పద్దతులలో చాలా సులువుగా అందుబాటులో ఉండే ప్రక్రియ ఇది.

నీడని పరుచుకుని
ఎండని కప్పుకుని
పడుకుంది రాలిన ఆకు – *ఇస్మాయిల్*

ఇస్మాయిల్ గారి కవిత్వంలో పెర్సొనిఫికేషన్ ప్రక్రియతో నిర్మించిన అనేక అద్భుతమైన ఇమెజెస్ కనిపిస్తాయి. పై ఉదాహరణలో ఒక రాలిన ఆకుకు

మానవలక్షణాలైన పక్క పరచుకొని, దుప్పటి కప్పుకొని పడుకోవటం అనే క్రియలను ఆరోపణ చేసి చిన్నచిన్న మాటలతో చక్కని సుందర దృశ్యాన్ని ఆవిష్కరిస్తారు ఇస్మాయిల్.

వర్షధారలనే పగ్గాలతో
నేలను పైకి లాక్కొందామనే
మబ్బుల ఆలోచన ఫలించకపోవటంతో
అవి ఎలా మూలుగుతున్నాయో చూడు
ఉరుముల శబ్దాలతో. *(గాథాసప్తశతి 436)*

రెండువేల ఏళ్ళక్రితం నాటి ఈ సప్తశతి గాథలో ఒక అందమైన ఊహ పెర్సొనిఫికేషన్ వల్ల మరింత అందంగా, సజీవంగా మారి, ఆ దృశ్యం మదిలో హృద్యంగా రూపు కడుతుంది. ఉరుములను విఫలయత్నం చేసి అలసిపోయిన మబ్బుల మూలుగులు అనటం గొప్పఊహ. పెర్సొనిఫికేషన్‌ను పరాకాష్టకు తీసుకెళ్ళిన పదచిత్రంగా దీన్ని భావించవచ్చు.

ఓయ్ పిల్లవాడా బయటకు వెళ్లకు.
చెరువు పక్కనున్న తాటి వరుసలు
తమ తలల్ని నింగిపై బాదుకొంటున్నాయి,
తూరుపు రేవులో పెంజీకట్లు సంచరిస్తున్నాయి. *(ద రైనీ డే-క్రిసెంట్ మూన్ -టాగోర్)*

తుఫాను వచ్చేలా ఉంది, బయట సంచరించవద్దు అంటూ ఒక తల్లి తన పిల్లవానికి చేసిన హెచ్చరికలో – తాటిచెట్లు తలల్ని నింగికి బాదుకోవటం, పెంజీకట్లు సంచరించటం వంటి పెర్సొనిఫికేషన్ వర్ణణల వల్ల ఒక భయానక వర్ష వాతావరణం/ మూడ్ అలవోకగా నిర్మింపబడింది పై వాక్యాలలో.

ఒక బైరాగిని వర్ణిస్తూ శ్రీ జి. వెంకట కృష్ణ వ్రాసిన ఈ వాక్యాలలోని ఊహాశాలిత ఆకట్టుకొంటుంది.

అప్పుడప్పుడూ అతని పెదవులు తాకి
పరవశించి పాడుతాయి వెదురు కన్నులు
ఆ పాటలు వినడానికి భూమిలో నుండీ
తొంగి చూస్తాయి వజ్రపు తునకలు (రవ్వల దీవి– జి. వెంకట కృష్ణ)

వెదురుకన్నులు పరవశించి పాడుతాయనటం, వజ్రపుతునకలు ఆ గానాన్ని వింటున్నాయనటం హృద్యమైన పెర్సొనిఫికేషన్ అభివ్యక్తి.

ఎవరూ నన్ను వినట్లేదని
దూరంగా ఓ పక్షి రోదిస్తూ ఎగిరిపోయింది
రక్తమోడుతున్న వీధులు
ముడుచుకున్న భవనాలపై
తన రోదన వస్త్రంలా కప్పబడిందని
అది చూడలేక పోయింది *(అలా వదిలేయండి – మెర్సి మార్గరెట్)*

పై కవితావాక్యాలలో పెర్సొనిఫికేషన్ టెక్నిక్ చాలా బలంగా వ్యక్తమయింది. మానవలక్షణాలైన రోదనను పక్షికి, రక్తమోడ్చటం వీధులకు, ముడుచుకుపోవటం భవనాలకు ప్రతిభావంతంగా ఆపాదించటంతో, ఆ వాక్యాలు శక్తివంతమైన కవిత్వంగా మారాయి. ప్రతి వర్ణణా చిక్కని స్పష్ట చిత్రంగా మనసుకి తెలుస్తుంది.

అలలగొంతుతో
నది పాడుతుంటుంది
ఏ సుదూరాన్నుంచో పక్షులు నదిపాట విని
కచేరి ముందు వీక్షకులు చేరినట్టు
నది వొడ్డున చేరుకుంటాయి *(నదిపాట – బాల సుధాకర్ మౌళి)*

నది పాడటం, ఆ పాటను విని పక్షులు నదివొడ్డుకు చేరటం పెర్సొనిఫికేషన్ క్రిందకు వస్తుంది. ఇక్కడ ఉత్త పెర్సొనిఫికేషన్ చేయటంలో మాత్రమే కాక దానికి సంబంధించిన ఒక వాతావరణాన్ని సృష్టించటంలో కవి పరిణతి కనిపిస్తుంది. నది అలలగొంతుతో పాడటం, కచేరిముందు వీక్షకులుగా పక్షులు చేరటం లాంటి వివరణలతో కవిత స్థాయి అనూహ్యామైన ఎత్తులకు చేరింది. ఇలాంటి

కవిత్వనిర్మాణంలోనే కవి ప్రతిభ నిరూపణ అవుతుంది.

మేఘాలూ నేలా
రాత్రి చుంబించుకొన్నట్లున్నాయి.
తెల్లవార్లూ వానకురుస్తానే ఉంది.
నల్లని మంచుగడ్డకరిగిపోయింది.
ప్రశాంతతరువుల్లోకి ప్రాత:కాలం
తడితడిగా ప్రవేసించింది.
వందగుమ్మాలతో వెదురు పొద
స్వాగతం పలికింది. *(ఆకుపచ్చని తడిగీతం)*

చుంబనం, ప్రవేశించటం, స్వాగతం పలకటం వంటి లక్షణాలను ప్రకృతికి ఆపాదించటం ద్వారా అందమైన ఇమేజెరీ ఆవిష్కృతమైంది. వెదురుపొదలో నిలువుగా సమాంతరంగా ఉండే వెదురు మొక్కలను గుమ్మాలుగా వర్ణించటం చక్కని ఊహాశాలిత.

వర్షానికి తడిచి
కృతజ్ఞతతో కొన్ని చినుకుల్ని ఆకుల్లో దాచిపెట్టి ,
గాలివీచినప్పుడల్లా రాలుస్తుంది
పిల్లలపై సంతోషంగా (చెట్టు – యాకూబ్)

ఒక అందమైన పదచిత్రమిది. వర్షం వెలిసిన తరువాత చెట్లు ఆకులమాటున నిలిచిన నీరు గాలికి చినుకుల్లా రాలటం ఒక సాధారణ దృశ్యం. కానీ పై కవితలో కృతజ్ఞత, సంతోషంగా అనే రెండు పదాల వల్ల పై వాక్యాలు ఉదాత్తతను సంతరించుకొన్నాయి. దీనికి పెర్సొనిఫికేషన్ ప్రక్రియ దోహదపడింది.

వాన కబుర్లు

తారురోడ్డు పై తడుస్తోన్న వానకు
ఏ వెహికలూ లిఫ్ట్ ఇవ్వడం లేదు
చివరకు గొడుగు కూడా

పొద్దునుంచి ఒకటే ముసురు

తట్టుకోవడం తనవల్ల కాదని
వాన ఓ పెగ్గేసింది

స్కూల్నుంచి వస్తూ పాప
వర్షంలో తడవడానికి జంకింది
పాపకు తనంటే ఇష్టమని తెలిసి
వాన ఎత్తుకుని మరీ ఇంటి వద్ద దింపింది

నాలుగు చినుకులు తరిమితే
బెదిరిన వానకు
కాకాహోటల్ టీ ఇచ్చి వెచ్చపరిచింది

జోరు వానలో...

మొక్కజొన్న పొత్తును తింటూ
జనాల పరుగును చూస్తూ
వర్షం ఎంజాయ్ చేస్తోంది

బాగా తడిసిన వాన
రహీమ్ మియా అంగడివద్ద
సిగరెట్టు వెలిగించింది

బస్టాపులో...
తడిసిన అమ్మాయిల పక్కన
నిలుచోలేక వాన ఒకటే వణుకుతోంది.

(తెలుగు వెంకటేష్ - కవిసంగమం)

పైకవితలో వానను పెర్సొనిఫై చేయటం చూడొచ్చు. వెంకటేష్ ప్రతిభ ఉన్న కవి కనుక 'వాన సూదులతో గుచ్చుతోంది' అనే స్థాయిలో కాక, ఈ పెర్సొనిఫికేషన్ను వేరే అనూహ్య డైమెన్షన్‌లోకి తీసుకెళ్ళగలిగాడు.

ముసురుపట్టిన రోజున జరిగిన ఒక్కో సంఘటనను ఒక్కో పదచిత్రంగా పేర్చుకు వెళతాడు కవి. చివరకు వచ్చేసరికి వానంటే వానకాదని–వానలోతడిచే

కవని, కవి హృదయమనీ అర్థంచేయిస్తాడు. వానరోజున కవి గడిపిన జీవితానికి వానను మెటొనిమీ చేస్తాడు గడుసుగా. గొప్ప శిల్ప చాతుర్యమిది.

***

పెర్సొనిఫికేషన్ అనేది కవిత్వనిర్మాణంలో ఒక ప్రాధమిక స్థాయి టెక్నిక్. దీనిద్వారా సూటిగా, స్పష్టంగా కవితావస్తువును ఆవిష్కరించవచ్చు. పెర్సొనిఫికేషన్ టెక్నిక్ ఇతర నిర్మాణ పద్దతులతో భాగంగా ఉంటూ వ్రాసిన కవితలు మరింత శక్తివంతంగా ఉంటాయి.

పెర్సొనిఫికేషన్ అనేది కవిత్వనిర్మాణంలో ఒక ప్రాధమిక స్థాయి టెక్నిక్. దీనిద్వారా సూటిగా, స్పష్టంగా కవితావస్తువును ఆవిష్కరించవచ్చు. పైన ఉదహరించిన కవితలలో ఉత్త పెర్సొనిఫికేషన్ టెక్నిక్ మాత్రమే కాక అది ఇతర నిర్మాణ పద్దతులతో భాగంగా ఉండటాన్ని గమనించవచ్చు. అలా వ్రాసిన కవితలు శక్తివంతంగా ఉంటాయి.

మెటఫర్ (Metaphor)

కవులు నిత్యం మెటఫర్ కొరకు అన్వేషిస్తుంటారు. కొత్త మెటఫర్‌ని కల్పన చేయటంలోనే కవి గొప్పతనం ఉంటుంది. కొత్త మెటఫర్‌ను సృష్టించటానికి ఎంతో ఊహాశక్తి, ప్రతిభ అవసరం. మెటఫర్ కవిత్వాన్ని దేదీప్యమానం చేసి ఎక్కువకాలం గుర్తుండి పోయేలా చేస్తుంది.

మెటఫర్ అంటే రెండు వేరు వేరు లక్షణాలు కలిగిన వస్తువులను పోల్చి చెప్పటం. ఇలా చేసినపుడు ఒక వస్తువును దేనితో అయితే పోల్చామో దాని లక్షణాలు పోల్చబడిన వస్తువుకు వచ్చి చేరతాయి. ఉదాహరణకు 'ఆమె మొఖం ఒక చంద్రబింబం' అన్నప్పుడు- చందమామ లక్షణాలైన గుండ్రంగా, చల్లనికాంతులతో, ప్రకాశవంతంగా ఉండటం అనే లక్షణాలు ఆమె మొఖానికి ఆరోపితమౌతాయి.

సిమిలీలో కూడా రెండు వస్తువులను పోలుస్తాం. సిమిలీలో మొదటివస్తువును రెండవ వస్తువుతో వలె/లాగ/రీతిగా/పోలె వంటి పదాలనుపయోగించి పోల్చటం జరుగుతుంది. మెటఫర్‌లో అలా ఉండదు. మొదటి వస్తువే రెండవ వస్తువు అని చెప్పబడుతుంది. సిమిలీ నేరుగా పోలికతీసుకొస్తుంది, మెటఫర్ కొంచెం నర్మగర్భితంగా ఉంటుంది.

పై ఉదాహరణననే తీసుకొంటే "ఆమె మొఖం చంద్రబింబంలా ఉంది" అనటం సిమిలీ. "ఆమె ముఖం ఒక చంద్రబింబం" అనటం మెటఫర్.

మెటఫర్‌ని వాడటం వల్ల కవితకు గొప్ప లోతు, సాంద్రత వస్తాయి. వచనంలో పేజీలకొద్దీ పట్టే భావనను ఒక్క మెటాఫర్ ద్వారా చెప్పవచ్చు.

'జీవితమొక కొవ్వొత్తి. చీకటిలో మొదలై చీకటిలో అంతమౌతుంది' (మాక్‌బెత్– షేక్స్పియర్).

పై వాక్యంలో జీవితాన్ని కొవ్వొత్తితో పోల్చినపుడు చాలా ఊహలు కలుగుతాయి– జీవితం వెలుగుతున్నంతసేపూ కాంతి ప్రసరిస్తుందనీ, క్రమక్రమంగా క్షీణిస్తుందనీ, ఏ క్షణమైనా ఉఫ్ అంటే ఆరిపోతుందనీ, మనం ఎక్కడినుంచి వచ్చామో తెలియనట్లుగానే ఎక్కడకు వెళతామో కూడా తెలిదనీ– అంటూ అనేక అర్థాలు ఆ వాక్యంలో తారాడుతాయి. ఇదంతా ఒక్క చిన్న మెటఫర్ సాధించింది. అదీ కవిత్వంలో మెటఫర్ స్థానం, గొప్పతనం.

కవిత్వంలో ఎప్పటినుంచో వాడబడుతూ, మామూలు మాటలుగా మారిపోయిన మెటఫర్‌లను 'డెడ్ మెటఫర్'లు అంటారు. చూపులబాణాలు, ఆకలి కేకలు, నిప్పులు వర్షించటం, కలల అలలు, కన్నీటికెరటాలు, ప్రేమగులాబీ, పుడమి పురిటినెప్పులు, నవ్వులపువ్వులు, మతంకంపు, బాల్యంనెమలీక, బాధలసుడిగుండాలు, కాంక్రీటువనం.... చెప్పుకొంటూ పోతే చాలా ఉంటాయి.

మంచికవి డెడ్ మెటఫర్లను వాడడు. ఎప్పటికప్పుడు కావలసిన మెటఫర్లను సృష్టించుకొంటాడు. అప్పుడే అతని కవిత్వం ఉత్తమ కవిత్వంగా నిలుస్తుంది. ఇలా పాతపోలికలను చెరిపేసి కొత్త కవిత్వభాషను నిర్మించటాన్ని ఇస్మాయిల్ గారు "భాషను శుభ్రపరచటం" అని అన్నారు.

సాయంత్రపు ఎర్రటి గాయంలోకి
సాగిపోతోంది రైలు.
రైల్లో కూచుని
ఆలోచనల రక్తంలో తడుస్తున్నాను.
ప్రపంచమంతా
పచ్చిపుండు.//

నాతో నేను ప్రయాణించక తప్పదని
ఇంతకాలానికి తెలుసుకొన్నాను.

(సహప్రయాణికుడు – ఇస్మాయిల్)

మెటఫర్ ని ఉపయోగించుకొని ఒక మూడ్‌ని కవితలోకి ప్రవేశపెట్టటాన్ని పై వాక్యాలలో చూడొచ్చు. రైలుప్రయాణం జీవితానికి ప్రతీకగా భావించాలి. ముసలితనం సమీపించే కొద్దీ పరిచయాలు, స్నేహాలు, సందోహాలు క్రమక్రమంగా తగ్గిపోతాయి. ఒంటరితనం జీవితంలోకి కొద్దికొద్దిగా ఎగబాకుతూంటుంది. అప్పుడు జ్ఞాపకాలలోనే భారంగా రోజులు వెళ్లదీయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇకపై మనతో మనమే ప్రయాణం చేయాల్సి ఉంటుందన్న భావన ఏర్పడుతుంది. అతి సున్నితమైన ఈ మానసికస్థితిని – సాయంత్రపు ఎర్రటిగాయం, ఆలోచనల రక్తం, ప్రపంచం ఒక పచ్చిపుండు అన్న మెటఫర్‌ల ద్వారా కవి ఆవిష్కరించగలిగారు. అనుభూతులను పోల్చటం వల్ల కవితనిండా ఒక రకమైన నిర్వేదం, నాస్టాల్జియా, నిస్సహాయత, ఏకాకితనంలతో కూడిన మూడ్ పరుచుకొని హృదయాన్ని కదిలిస్తుంది.

కవిత్వం నాకు
గుడిసె మీద పారే బీరతీగ
ముండ్లకంపపై పుష్పించిన కట్లపువ్వు
గంగడోలుకు కట్టిన గంట
గొంతులో ప్రవహించిన రాగం// *(చెలిమె – అన్నవరం దేవేందర్)*

ప్రతీకవి తన ఏదో ఓ కవితలో తన కవిత్వతత్వాన్ని నిర్వచించుకొంటాడు. అన్నవరం దేవేందర్ చెలిమె అనే కవితలో ఒక గ్రామీణ నేపథ్యంలోంచి కవిత్వాన్ని నిర్వచించాడు. ప్రతీ వాక్యంలోను ఒక్కో కొత్త మెటఫర్‌తో కవిత్వాన్ని పోల్చటం జరిగింది.

ఇప్పుడు ప్రతి గుండే ఒక చుండూరు,
రగిలే రాచపుండూరు
నేను జనసమూహాల గాయాన్ని
గాయాల సమూహాన్ని//

నేను బాధితుణ్ణి కాదు అమరుణ్ణి
ఎగిరే ధిక్కార పతాకాన్ని
(పిడికెడు ఆత్మగౌరవం కోసం– కలేకూరి ప్రసాద్)

దళితకవిత్వ వేగుచుక్క కలేకూరి ప్రసాద్. మెటఫర్‌ను ఒక శక్తివంతమైన

పనిముట్టుగా చేసుకొని ఉద్వేగభరితమైన కవిత్వం చెప్పినవారిలో కలేకూరి ఒకరు. ప్రతి గుండే చుండూరు అనటం ద్వారా చుండూరులో జరిగిన కులవివక్షా, తదనంతర దాష్టీకాన్ని స్ఫురణకు తెచ్చి ప్రతీ గుండే గాయపడింది అని స్పష్టపరుస్తాడు. కవి సమూహానికి ప్రతినిధి. ఇక్కడ నేను గాయపడ్డ సమూహన్ని, గాయాల సమూహాన్ని అంటూ ప్రకటించుకోవటం ద్వారా కవిగా తన బాధ్యత వహిస్తున్నాడు. ఎగిరే ధిక్కారపతాకం అన్న పదబంధంలోనే ఎంతో వీరత్వము, తెగింపూ కనిపిస్తాయి.

ఒకింత రాతిరి దుఃఖాన్ని కడుక్కొని
నిన్ను నువ్వే మేల్కొలుపుకొని
నీకు నీవే శక్తిని కూడదీసుకొని
లేమ్మా
గాయపడ్డ చనుబాలను
పుండైనకాయాన్ని
కాసిన్ని టీ నీళ్ళతో వెచ్చబర్చుకొని
ఈ లోకం ముఖంపై
ఎర్రగా ఉమ్మివేద్దువుగాని (గాయపడ్డ చనుబాలు – కె. క్యూబ్ వర్మ)

లైంగిక అత్యాచారం చేయబడ్డ ఒక మహిళగురించి వ్రాసిన కవిత ఇది. గాయపడ్డచనుబాలు, రాతిరిదుఃఖాన్ని కడుక్కోవటం, లోకంముఖంపై ఉమ్మటం వంటి మెటఫర్ లతో కవితను నడిపించిన తీరు విస్మయపరుస్తుంది. ఏదీ వాచ్యంగా చెప్పడు కవి. అంతా ధ్వన్యాత్మకమే. ఎరుపు అనే విశేషణం కూడా ఆ బాధిత స్త్రీ నడవాల్సిన మార్గాన్ని సూచిస్తుంది. మెటఫర్ లను అత్యంత ఒడుపుతో వాడుకోవటం వల్ల ఇది సాధ్యపడి, కవితకు గొప్ప బిగువు, చిక్కదనము వచ్చాయి.

ఈ వ్యాసాన్ని “కవిసంగమం” గ్రూపులో ప్రచురించినపుడు ప్రముఖ కవి, చిత్రకారుడు, అనువాదకులు శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు గారు “పాశ్చాత్య సాహిత్యం లో రినైజాన్సునుండి రొమాంటిసిజం దాకా అలిగరీ, రొమాంటిసిజం కాలంలో సింబల్స్ ముఖ్య పాత్రవహించగా, 1950ల తర్వాత మెటఫర్ ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. మెటఫర్ లను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు అవి

1) మూర్తవస్తువును మరొక మూర్త సాదృశ్యంతో పోల్చడం, 2) మూర్తవస్తువును మరొక అమూర్త సాదృశ్యంతో పోల్చడం, 3) అమూర్తవస్తువును మూర్తసాదృశ్యంతో పోల్చడం, 4) అమూర్తభావనను అమూర్త సాదృశ్యంతో పోల్చడం" అని కామెంట్ చేసారు

కవిత్వభాషలో మెటఫర్ అత్యంత ప్రధానమైన అంశం. రెండు వస్తువుల (అవిభౌతికమైనవి లేదా మానసికమైనవి కావొచ్చు) మధ్య ఇతరులు ఊహించలేని పోలికను తీసుకువచ్చినపుడే అది మంచి మెటఫర్ అవుతుంది. మంచి మెటఫర్ ఉన్న కవిత్వాన్ని ఏ భాషలోకి అనువదించినా భావం చెడదు. అమూర్తభావనలను మూర్తభావనలుగా మార్చటంలో మెటాఫర్ సహాయపడుతుంది. ఎక్స్టెండెడ్ మెటఫర ను కన్సీట్ అంటారు. మెటఫర్ ఇతర వర్ణణలతో కలిసినపుడు మంచి కవిత్వంగా మారుతుంది. అలా అన్ని అంగాలతో కూడిన మెటఫర్‌ను మన అలంకారికులు "సావయవ రూపకం" అన్నారు.

మెటానమి, సినక్డకి

కవిత్వంలో రెండువస్తువులను పోల్చుతున్నప్పుడు, ఒక వస్తువు బదులుగా దానికి సంబంధం ఉన్న మరొక వస్తువును పెట్టటాన్నే మెటానమి (Metonymy) అంటారు.

మెటఫర్ లో కూడా రెండు వస్తువులను పోల్చటం జరుగుతుంది. కానీ దానిలో రెండు వస్తువులు స్పష్టంగా తెలుస్తూంటాయి. మెటానమిలో ఒక వస్తువే చెప్పబడుతుంది రెండవ దానిని ఊహించుకోవాలి. దీనివల్ల మెటానొమీ కలిగిన వాక్యాలను అర్ధం చేసుకోవటానికి పాఠకుడు కొంత పరిశ్రమ చేయవలసి ఉ ంటుంది.

సినక్డకి (Synecdoche) కూడా మెటానమీ లాంటిదే కానీ ఇక్కడ ఒక వస్తువు బదులుగా దానికి సంబంధం ఉన్న మరొక వస్తువులోని “భాగం” తో (part) పోల్చటం జరుగుతుంది.

“మా ఆఫీసరు ఒక పెద్దపులి” –

అన్న వాక్యం మెటాఫర్ కు ఉదాహరణ. దీనిలో పోల్చబడిన రెండు వస్తువులు స్పష్టంగా ఉన్నాయి. వాటిలో పెద్దపులి లక్షణాలైన నిర్దయ, క్రౌర్యం, బలం వంటివి ఆఫీసరు అనే వ్యక్తికి చేరి అతని స్వభావాన్ని అర్ధం చేసుకోవటానికి దోహదపడతాయి.

“పెద్దపులి రివ్యూ మీటింగ్ పెట్టింది”

అన్న వాక్యం మెటానమికి ఉదాహరణ. ఇక్కడ ఆఫీసరు, పెద్దపులి అన్న

రెండు వస్తువులలో ఒకటే ప్రస్తావించబడింది. రివ్యూ మీటింగులు ఆఫీసరులే పెడతారు కనుక పెద్దపులి అన్న పదం ఆఫీసరుకి ప్రాతినిధ్యపదం అవుతుంది. ఆ ఆఫీసరు పెద్దపులిలా నిర్దయుడని, క్రూరుడని, బలవంతుడని అర్థం చేసుకోవాలి.

ఆయన "పంజా" విసిరి పదిమంది "పొట్ట" కొట్టాడు

పంజా అన్న పదం మనకు పులిని గుర్తుకు తెస్తుంది. పై వాక్యంలో పంజా, పొట్ట అన్న పదాలు "సినక్డకి" లకు ఉదాహరణలు. పంజా పులికి, పొట్ట మనిషికి చెందిన "భాగాలు" మాత్రమే, సంపూర్ణార్థాన్ని పాఠకుడు పూరించుకోవాలి. ఒక మనిషి తన పొట్ట నింపుకోవటానికి ఏదో ఉద్యోగం చేస్తాడు. పైవాక్యంలో ఉన్న సినక్డకి టెక్నిక్ వల్ల పెద్దపులి లాంటి ఒక దయలేని ఆఫీసరు పదిమందిని ఉద్యోగంలోంచి తీసేసాడు అన్న విస్తృతార్థం సిద్ధించింది.

మెటానమీ, సినక్డకి లు స్వప్న భాష లాంటివి. వీటిని అర్థం చేసుకోవటం అంటే స్వప్నాన్ని విశ్లేషించుకోవటం లాంటిది. నిద్రను, మెలకువను కలిపే బలమైన వారధి లేకపోతే స్వప్నాన్ని ఎలాగైతే విశ్లేషించలేమో, కవికి పాఠకునికి మధ్య ఏకచిత్తత లేకపోతే మెటానమీ సినక్డకిలు అర్థం కావు. ఈ ప్రక్రియలలో ఎక్కువగా నైరూప్య చిత్రణ కనిపిస్తుంది.

మెటానమి సినక్డకి టెక్నిక్‌లతో నిర్మించిన కవిత్వం గాఢత, గూఢత కలిగిఉండి కొన్ని సార్లు అస్పష్టతకు కూడా దారి తీస్తుంది. కవికి పాఠకుని ఆలోచనలమధ్య సామరస్యత లేనప్పుడు అలాంటి కవిత్వం పాషాణపాకంలా మిగిలిపోతుంది. కవి ఊహించి చేసిన ఒక మెటనొమికల్ అభివ్యక్తిని పాఠకుడు అందుకోలేకపోయినా కూడా అదే పరిస్థితి ఎదురవుతుంది. కనుక కవి ఈ టెక్నిక్ లను వాడినపుడు సాధ్యమైనంత మేరకు నలుగురిలో వెంటనే స్ఫురణలోకి వచ్చే పోలికలను తీసుకోవటం మంచిది.

'బ్రెయిన్ లో స్టెన్ గన్
స్పయినల్ కార్డులో స్పెయిన్'

ఒక ప్రముఖ కవి వ్రాసిన ఈ వాక్యాలలో స్టెన్ గన్, స్పెయిన్ పదాలు మెటానొమి అంశాలు. స్టెన్‌గన్ పదం వల్ల మెదడులో ఒక యుద్ధ వాతావరణం

ఉంది అన్న అర్థం స్ఫురిస్తుంది. ఇక స్పెయిన్ అన్న మాట మామూలు పాఠకులకు అందదు. కవిత నుండి డిస్కనక్ట్ అయిపోతారు. ఆ పెద్దాయన ఈ కవిత వ్రాసే సమయానికి స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరుగుతోన్నదట. స్పయినల్ కార్డులో అంతర్యుద్ధం అనే అర్థం ఇవ్వటానికి స్పెయిన్ అన్న పదం వాడారు. ఆ అర్థం ఈ రోజు అప్రస్తుతమైపోయి, స్పెయిన్ అంటే అందమైన సినిమా షూటింగుల ప్రదేశం అన్న అర్థం వెంటనే తోస్తుంది.

కనుక మెటానమికి చాలా జాగ్రత్త అవసరం. ఒక రకంగా అది కత్తిమీద సాములాంటిది. "అయినప్పటికీ మెటానమి, సినక్డకి లు గొప్ప కవిత్వానికి వెన్నెముకలాంటివి". మెటానమి, సినక్డకి టెక్నిక్ లను సింబల్స్ అని కూడా వ్యవహరిస్తారు.

నడిచే గాయాలు నువ్వెప్పుడైనా చూశావా?
నడవడమే కాదు
నవ్వుతాయ్
నగలు పెట్టుకొంటాయ్ *(నడిచే గాయాలు - కొండేపూడి నిర్మల)*

తొంభయ్యవ దశకంలో ఒక ఉత్తుంగ తరంగంలా వచ్చిన స్త్రీవాద సాహిత్యం తెలుగు కవిత్వంలో స్త్రీ ని చిత్రించే ధోరణిని సమూలంగా మార్చివేసింది. పై వాక్యాలలో నడిచే గాయాలు అన్న ప్రయోగం మెటానమి. ఈ పదం సమాజపు విషకోరలకు బలైపోయిన స్త్రీలను ప్రతిబింబిస్తుంది. అణచివేతకు గురయిన స్త్రీలు పైకి నవ్వుతూ ఉన్నట్లు కనిపించినా ప్రతి ఒక్కరి ఆత్మ గాయపడుతోన్నది. రక్తమోదుతున్నది అన్న అర్థాలు ఒక్క "నడిచేగాయాలు" అన్న మెటనొమికల్ అభివ్యక్తి ద్వారా కవయిత్రి సాధించారు.

అప్పటికప్పుడు వేళ్ల సందుల్లోంచి
సుద్ద మొక్కలు మొలుచుకొస్తాయి
వాటినుంచే కదా
ఓ అత్యంత దయామయుడైన ఉపాధ్యాయుడు
గుప్పెడు బీజాక్షరాలు కోసుకొస్తాడు (గది - నలిమెల భాస్కర్)

పై కవితా వాక్యాలలో "సుద్ద మొక్కలు" అనేది ఒక మెటానొమీ అభివ్యక్తి.

మానవజాతి “జ్ఞానసంపద” అనే అర్థాన్ని “సుద్దమొక్క” అన్న ప్రాతినిధ్యపదం ద్వారా ప్రవేశపెడతాడు కవి. ఇది భోధన చేయటానికి వాడే సుద్దముక్క అన్నపదానికి దగ్గరగా ఉండటం కవి చేసిన Pun. తరువాత వచ్చే “బీజాక్షరాలు” అన్నమాటతో సుద్ద మొక్కకు అర్ధ సమన్వయం ఏర్పరచి ఆ ఇమేజెరీని పరిపుష్టం చేస్తాడు.

పైట కొంగును చూస్తే
నా కెందుకో
పాతివ్రత్యం గుర్తొస్తుంది !
భుజాలనించి కిందికి వేలాడే
గుదిబండలా
అదెప్పుడూ నా స్వేఛ్ఛని హరిస్తూనే ఉంటుంది !//

నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి
పైటని తగలెయ్యాలి. *(పైటను తగలెయ్యాలి - జయప్రభ)*

స్త్రీ స్వేచ్ఛ, హక్కులను తరతరాలుగా హరిస్తున్న సంస్కృతి సంప్రదాయాలను “పైట” అనే పదంతో మెటానోమికాభివ్యక్తి చేసారు కవయిత్రి. స్త్రీల పట్ల కొనసాగుతున్న వివక్షను తగలెయ్యాలి అన్న అర్ధంలో పైటను తగలెయ్యాలి అన్న ప్రయోగం చేసారు.

ఇదే ఇతివృత్తంతో జూపాక సుభద్ర వ్రాసిన “కొంగు నా బొచ్చ మీద కావలుండే బొంత పేగ్గాదు” (పైట నా ఛాతీని కాపలా కాసే గుడ్డ కాదు) అన్న కవితలో– పైట నన్ను నియంత్రించదు, అది నా దైనందినజీవనంలో ఎన్నోరకాలుగా ఉపయోగపడుతుంది అంటూ దళితబహుజన దృక్కోణాన్ని వర్ణించారు. ఆ కవితలో వాడిన “కొంగు” కూడా మెటానొమీనే.

మీరు పొరబడ్డారు
శవపేటికలు మొత్తం
ఏదువందలా ఎనభైఆరు కాదు

***

అవును అన్నీ చిన్న చిన్న శవపేటికలే
పొడవు ఒకటిన్నర తుపాకులు
అడ్డం అరతుపాకీ కొలతలున్న చిన్ని చిన్ని శవపేటికలు//
అయినా సరే మీరు
మళ్ళీ లెక్క తప్పారు
శవపేటికలు మొత్తం
786 కాదు
కేవలం 145 మాత్రమే

– *(పిల్లలూ ... శవపేటికలూ – అనంతు)*

పాకిస్తాన్‌లో తాలిబన్లు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 145 మంది స్కూలు విద్యార్థులు చనిపోయిన సందర్భానికి వ్రాసిన కవిత లోని కొన్ని వాక్యాలివి. In the name of Allah అన్న అర్థాన్ని సూచించే 786 అనే సంఖ్య ముస్లిములకు పవిత్రమైనది. పిల్లల్ని చంపమని ఏ మతము ప్రవచించదు అని చెప్పటానికి 786 అన్న సంఖ్యను ప్రాతినిధ్యపదంగా కవి ఇక్కడ తీసుకొన్నాడు. తద్వారా కవితకు గొప్ప లోతు గాఢత వచ్చిచేరాయి.

చూపుడు వేలిమీద
వాలిన చందమామ
ఉన్నట్టుండి, హఠాత్తుగా
కుందేటి కొమ్ముతో
కసాల్న కడుపులో పొడిసేసి
నేను చెమటోడ్చి తెచ్చుకొన్న
నాలుగురాళ్ళు లాక్కుపోయింది
చందమామ నాడాల బూట్ల కవాతు
నీకు వినిపించడం లేదూ! *(శాంతి – వసీరా)*

చందమామను సౌందర్యానికి, ఆహ్లాదానికి ప్రతీకగా వాడుకొంటారు కవులు. కానీ వసీరా "శాంతి" అనే కవితలో చందమామను క్రౌర్యానికి, దౌష్ట్యానికి సింబల్ గా వాడటం ఒకింత ఆశ్చర్యం కలిగించక మానదు. చూపుడువేలి మీద వాలిన చందమామ రాత్రిని సూచించే గొప్ప ఇమేజ్. చంద్రునిపై పరిగెత్తుతున్న కుందేలు,

దానిపై మచ్చలుగా మనకు కనిపిస్తున్నాయి అని ఓ జానపద కథ చెపుతుంది. కుందేటి కొమ్ము మంత్రశక్తులిచ్చే ఒక వస్తువని మరో కథ వర్ణిస్తుంది. ఈ రెంటికి గొప్ప సమన్వయం కుదిర్చి, చందమామచే ఒక శ్రామికుని (విప్లవకారుడు ?) హత్యచేయిస్తాడు కవి బహుసౌందర్యాత్మకంగా.

కవిత చివరలో వచ్చిన "నాడాల బూట్ల కవాతు" అనటం సినక్డకి అభివ్యక్తి. నాడాల బూట్లు అనేవి సాయుధవ్యవస్థలో ఒక భాగం. ఆ ఒక్క పదం ద్వారా మొత్తం సాయుధవ్యవస్థను, దాన్ని కలిగిఉన్న రాజ్యాన్ని తీసుకొచ్చి దోషులుగా ప్రకటిస్తాడు కవి. ఒక శ్రామికుని (విప్లవకారుడు?) చంపటమే శాంతి అని చెప్పటం కూడా లోతైన తాత్వికతతో కూడిన శీర్షిక.

అలికిన నేలమీద కూర్చుంటే
అమ్మచేతులు అందంగా తాకుతుంటాయి
బద్దెమంచంమ్మీద పడుకొన్నప్పుడు
గోడలన్నీ నాన్నలా ప్రశాంతంగా కనిపిస్తాయి *(తాటాకిల్లు – కాశిరాజు)*

ఇటీవలి కవులలో కాశిరాజు కవిత్వం పల్లెనేపథ్యంతో ప్రత్యేకమైన గొంతును కలిగిఉంటుంది. పై కవితా వాక్యాలలో – నేల అలికిన అమ్మచేతి పనితనం/ ముద్రలు ఆ నేలపై కూర్చుంటే తాకుతున్నాయనటం, కుటుంబానికి రక్షణ కవచంలా ఉండే నాన్నరూపం గోడలలో కనిపిస్తుంది అనటంలో సినక్డకి టెక్నిక్ కనిపిస్తుంది.

//ఒకచూపుడువేలు చూపేకదా
బడుగుజీవికి మూడో కన్నును ఇచ్చింది!
హక్కులఖడ్గాలతో
తరతరాల చీకటిరాత్రుల గుండెల్ని చీల్చింది!// *(చూపుడువేలు – సరికొండ నరసింహరాజు)*

పై కవితా వాక్యాలలో డా.అంబేద్కర్‌ను 'చూపుడు వేలు' అనే పదంతో సినక్డకి చేసాడు కవి. బడుగులకు హక్కులు, వికాసం, అభివృద్ధిని కల్పించిన ఆ మహనీయుని, దారి చూపే 'చూపుడు వేలు' గా వ్యక్తీకరించటం లోతైన

సినక్టకల్ ప్రతీక.

పిల్లలూ!
జర పదిలం
దగ్గరికి తీసుకునే
చేతులకు మొలిచిన
నీలి గోళ్లను గమనించండి *('కాస్త టచ్‌లో ఉండండి - నిరంతర)*

చిత్తలూరి నిరంతర వ్రాసిన 'కాస్త టచ్‌లో ఉండండి కవితా వాక్యాలివి. పసిపిల్లలపై ఈ మధ్య పెచ్చరిల్లిన అత్యాచారాల నేపథ్యంలో వ్రాసిన కవిత అది. పిల్లను సంభోదిస్తూ "నీలి గోళ్ల" ను గమనించండి అంటాడు కవి. ఇక్కడ నీలి అనే వర్ణం ద్వారా బూతును ఉద్దేశిస్తున్నాడు కవి. నీలి అనే పదం బూతును సూచించటానికి వాడుకలో ఉన్న నీలి చిత్రాలు, నీలి కవిత్వం, టాలివుడ్‌పై నీలినీడలు లాంటి ప్రయోగాలు దోహదపడ్డాయి. రాక్షసులకు పెద్ద పెద్ద గోర్లు ఉంటాయనటం ఒక అనాది ప్రయోగం. 'నీలి గోళ్లు' అనే సినక్డకి వ్యక్తీకరణ ద్వారా 'కామం నిండిన దుర్మార్గులు' అనే అర్థం వచ్చి కవిత చిక్కబడింది.

****

మెటానమీ ద్వారా స్పష్టాస్పష్టంగా చెప్పిన "సారూప్యం లేని వస్తువుల మధ్య సంబంధాన్ని" పాఠకుడు గుర్తించినపుడు అతని మెదడుకు ×త్‌వశ్రీ-శ్రీవక్ష్‌ఖుశ్రీ హ్‌బటట అంది గొప్ప పఠనానుభం కలుగుతుంది.

చాలామంది కవుల ఐకానిక్ కవితలన్నీ మెటానొమికాభివ్యక్తి కలిగిన కవితలే కావటం గమనార్హం. ఇస్మాయిల్ - చిలకలువాలిన చెట్టు, ఖాదర్ మొహిద్దిన్- పుట్టుమచ్చ, శిఖామణి-కొయ్యకాలు, సతీష్ చందర్-కలవని కనుపాపలు, తిలక్- నీవులేవు నీ పాట ఉంది, జయప్రభ-పైటను తగలెయ్యాలి, కొండేపూడి నిర్మల- నడిచేగాయాలు, మెర్సి మార్గరెట్-ప్రశ్నలగది వంటివి కొన్ని ఉదాహరణలు.

"కవిత్వం మెటాఫర్ నుండి మెటానమీకి... ప్రయాణించాలి" అన్న వేగుంట మోహన్ ప్రసాద్ మాటలు కవిత్వంలో మెటానొమీకి కల స్థానాన్ని, స్థాయిని చెపుతాయి. మెటానొమీ పై పట్టుసాధించిన కవులు గొప్పకవులుగా నిలిచిపోతారు.

అల్యూజన్ (Allusion)

చరిత్రనుంచో, పూర్వసాహిత్యం నుంచో ఏదైనా ఒక ఉదంతాన్ని సూచించే పదాన్నో, వాక్యాన్నో కవితలో ఉదహరించటాన్ని అల్యూజన్ అంటారు.

అల్యూజన్ వల్ల, కవిత పరిధి పెరిగి సందర్భం విశాలమై అర్థం విస్తృతమౌతుంది. కవి ఉటంకించిన ఉదంతం పట్ల చదువరికి పూర్వజ్ఞానం లేకపోతే అల్యూజన్ అర్థం కాదు. కనుక అల్యూజన్ కలిగిన కవితలు వ్రాయటానికి, చదవటానికి కూడా చరిత్ర, పూర్వసాహిత్యాలపై కాస్త మౌలికమైన అవగాహన అవసరం.

అల్యూజన్ వల్ల కవితకు క్లుప్తత వస్తుంది. అప్పటికే స్థిరపడిన కొన్ని భావాలను, ఉద్వేగాలను ఉదహరించటం వల్ల తక్కువ మాటలలో ఎక్కువ అర్థాలను పలికించవచ్చు. *"రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా"* అన్న ఆరుద్ర వాక్యం – శాపంచే రాయిగా మారిన అహల్య, శ్రీరామచంద్రుని పాదం సోకి శాపవిమోచనం పొందిన ఘట్టం గుర్తుకు తెచ్చే ఒక అల్యూజన్. ప్రస్తుత సందర్భంలో కష్టాలలో ఉన్న ఒక స్త్రీ నేను రాయినైనా కాలేకపోయాను, నా కష్టాలన్నీ తీరిపోయేవి అని అనుకోవటంలోని ఔచిత్యం అర్థమౌతుంది. ఆ ఉదంతంలో ఉండే కరుణ, విముక్తి వంటి ఉద్వేగాలు ప్రస్తుత వాక్యాలలోకి వచ్చి చేరి సందర్భాన్ని ఉన్మీలనం చేస్తాయి. అహల్య ఉదంతం తెలియని వారికి ఆ వాక్యాలలోని అల్యూజన్ అర్థం కాదు. అల్యూజన్ బలము, బలహీనత అవే

మామూలు సంభాషణలలో – అతను "శకుని"వంటివాడు, మోజెస్ ఇతన్ని చూసి ఉంటే "పదకొండో కమాండ్‌మెంట్" ఉండేది, "నక్షత్రకుడిలా"

కాల్చుకుతినేస్తున్నాడు, ఆ అమ్మాయి "బాపుబొమ్మ" లా ఉంది, "రాజనాల నవ్వు" నవ్వాడు, చూసిరమ్మంటే కాల్చి వచ్చాడు వంటి అనేక అల్యూజన్స్ దొర్లుతుంటాయి.

****

హరప్పా శిథిలాలు వినపడీ వినపడనట్లు మాట్లాడుతాయి//
పురుషసూక్తం నుంచి జారిపడిన
భూమి పుత్రుడి మీదనుంచి
మూడు పాదాలు బలంగా నడిచివెళ్ళిన చిహ్నాలు కనిపిస్తాయి//
మహాయానం హీనయానమైన నేపథ్యంలో
అద్వైతం అద్వితీయమౌతుంది//
ఒక్కడు మాత్రం ప్రశ్నించి కోపించి దుఃఖించి శాసించి
పద్యాలల్లుకుంటూ దిశమొలతో సాగిపోతాడు//
సెయింట్ ఒకడు నడుచుకుంటూ వెళ్ళి
పిడికెడు సముద్ర స్ఫటికాల్ని గుప్పిట పడతాడు//
ఆస్తిపంపకాలు జరుగుతాయి
తెలుపుకూ నలుపుకూ తేడా లేకుండా పోతుంది//

(చిత్రలిపి – కొప్పర్తి)

వాక్యవాక్యానా అల్యూజన్ టెక్నిక్ నింపుతూ కొప్పర్తి వ్రాసిన "చిత్రలిపి" కవితలోని కొన్ని వాక్యాలివి. భారతదేశచరిత్ర మొత్తం ఒక కొల్లేజ్ చిత్రంలా ఈ కవితలో కనిపిస్తుంది.

ఈనాటికీ హరప్పా శిథిలాలు, చెపుతున్న వివరాలు కన్నా దాస్తున్న వివరాలే ఎక్కువ అన్న సంగతి మొదటి వాక్యంలో కనిపిస్తుంది.

వేదాలలోని పురుషసూక్తంలో వర్ణవిభజన ప్రస్తావించబడింది. అలా జరిగిన వర్ణవిభజన వల్ల భూమిపుత్రుడికి అన్యాయం జరిగిందని, వాడిని తొక్కుకుంటూ మూడు వేదాలు బలంగా నడచివెళ్ళాయని రెండో వాక్యంలో చెపుతాడు కవి.

బౌద్ధమతం క్షీణించి మరలా హిందూ మతం నిలదొక్కుకుందన్న చారిత్రిక సత్యం మూడో వాక్యంలో తెలుస్తుంది.

నాలుగో వాక్యం వేమన గురించి. వేమన సమాజంలో అప్పటికి ఉన్న అన్ని దురాచారాలను ప్రశ్నించాడు, పద్యాలల్లుకొంటూ దిశమొలతో సాగిపోయాడు.

కొప్పర్తికి గాంధీగారంటే ఎంతో గౌరవం. సమకాలీన తెలుగు కవులలో గాంధీపై ఎక్కువ కవితలు వ్రాసింది కొప్పర్తే. అయిదో వాక్యంలో గాంధీగారిని సెయింట్ అని అల్యూడ్ చేస్తారు.

ఆస్తిపంపకాలంటే దేశవిభజన. తెలుపుకు నలుపుకు తేడాలేకపోవటం అంటే, బ్రిటిష్ పాలనకు, స్వపరిపాలనకు తేడాలేదని, అదే దోపిడీ, అదే అవినీతి, అదే అణచివేత ఇంకా కొనసాగుతున్నాయని చెప్పటం.

శంబూకుడు పెదాలమీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును
గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరుపాదాలతో వామనుణ్ణి
పాతాళానికి తొక్కేస్తున్నాడు/
కాలం కసాయి కత్తిమీద నిలబడి
గర్జిస్తున్న చండాలుడు
ఆదిశంకరునిపై నాలుగు వేటకుక్కల్ని
ఉసిగొల్పుతున్నాడు *(నడుస్తున్న చరిత్ర – శివసాగర్)*

ఆధునిక కవిత్వప్రయాణంలో దళితకవిత్వం వేయిగొంతుకలతో పలికిన దశ చారిత్రాత్మకమైనది. ఈ దశలో దళితబహుజనులు తమ అస్థిత్వాన్ని ఎలుగెత్తి చాటారు. తరతరాలుగా తాము ఎదుర్కొంటున్న వివక్షకు మూలాలుగా ఉన్న పురాణాలను, మనుధర్మశాస్త్రాన్ని తిరస్కరించారు. వాటిని తమ పదునైన అభివ్యక్తి ద్వారా ఆక్షేపించారు. సాహిత్యపరంగా ధ్వంసం చేసారు. అప్పుడు చేసిన ఆ ఉద్యమ కారణంగా ఈరోజు కవిత్వం డెమొక్రటైజ్ అయ్యింది. ప్రతి ప్రయోగాన్ని నిశితంగా పరిశీలించుకొని చేయాల్సిన స్థితి వచ్చింది. కొన్ని వాదుకలపట్ల దళితేతర కవులు, రచయితలూ సెన్సిటైజ్ అయ్యారు.

పై కవితలో శివసాగర్ దళిత పురాణపాత్రలచే తమకు అన్యాయం

చేసినవారిపై తిరుగుబాటు చేయిస్తాడు. ఇది ఒక కొత్త ఉదయానికి సూచనగా చెపుతాడు. దీన్ని తమ చరిత్రను తామే లిఖించుకోవటానికి చేసిన ప్రయత్నంగా భావించాలి. ఈ విధంగా పురాణ ఉదంతాలను వాటి వ్యతిరేక అర్థంలో చెప్పటాన్ని Corrective Allusion అంటారు. పై కవితలో స్వీయ అస్తిత్వాన్ని ప్రకటించటం, పురాణాలను తిరస్కరించి చరిత్రను కొత్తగా నిర్వచించటం జరిగింది.

//'కన్యమేరీ' చీరకట్టుకున్నా కనికరించని చోట
కనికరించమని వేడుకున్నా
రెవరెండ్ సిస్టర్లకు మానభంగం కలిగినచోట
రక్తంతో తలంటు పోసుకున్న
పుష్యమిత్రుల వికృత కిరాతక అకృత్యాల నడుమ
నా జాతి మూలాలు
బాత్ టబ్లో ఆర్కిమెడిస్ లెక్కలై ముక్కలైనప్పుడు
వేలవత్సరాల ఒక మత చరిత్ర కల్లోలమై
మేము ముల్లాలమై
దిక్కుతోచని 'హల్లెలూయిల' వాలాలమై
ఆత్మల పోరాటంలో మ్లేచ్ఛులమై
తల్లీ! నీ పేరున మా రక్తమెంత చిందిందో తెలుసా! //
('ఆత్మ' లతో పోరాటం - తుల్లిమల్లి విల్సన్ సుధాకర్)

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ సమకాలీన కవులలో విశిష్టమైన శైలికలిగిన కవి. ఇతని కవిత్వబలం అల్యూజన్ అనటం అతిశయోక్తి కాదు. నిత్యం సమాజ గమనాన్ని పరిశీలించటం వల్ల చుట్టూ జరుగుతున్న విషయాలను అలవోకగా సుధాకర్ అల్యూడ్ చేస్తారు. "ఆత్మలతో పోరాటం" అనే కవితలోంచి తీసుకొన్న కొన్ని వాక్యాలివి. భారతదేశంలో చారిత్రాత్మకంగా అనేకమంది దళిత బహుజనులు క్రిస్టియానిటీ, ఇస్లామ్ మతాలను స్వీకరించారు. కానీ వారు ఈ రోజున మతపరమైన వివక్షకు గురయి దాడులను ఎదుర్కొంటున్నారు. వారిజీవన స్థితిగతులు మెరుగుపడాలంటే అంబేద్కరిజమే పరిష్కారం అంటూ ఒక నిబద్ధతతో కూడిన ప్రతిపాదన చేస్తారు పైకవితలో. ఈ క్రమంలో అనేకచోట్ల అల్యూజన్ టెక్నిక్ వాడి కవితకు మంచి బిగుతును, గొప్ప టోన్ ను కలిగిస్తారు.

కన్యమేరీ చీరకట్టుకోవటం– అన్న వాక్యంలో, క్రిస్టియానిటీ విదేశీమతమైనప్పటికీ ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా స్థానికీకరణ జరుపుకొంది అనే విషయం చెపుతున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేష్ లాంటి చోట్ల నన్స్ మానభంగం చేయబడ్డ ఉదంతాలు ఆ తరువాత వాక్యంలో అల్యూడ్ చేయబడ్డాయి.

పుష్యమిత్రుడు భారతదేశంలో బుద్దిజం విస్తరించకుండా చేసి, బ్రాహ్మనిజం వ్యాప్తికి దోహదపడిన రాజుగా చరిత్రకారులు పేర్కొంటారు. నేడు మతపరంగా జరుగుతున్న అనేక దాడులకు బ్రాహ్మనిజం కారణమన్న అభిప్రాయంతో– బ్రాహ్మనిజాన్ని ఆచరించే మతోన్మాదులను పుష్యమిత్రుడు అన్న పదంతో అల్యూడ్ చేయటాన్ని గమనించవచ్చు.

భూమిపుత్రులైన దళిత బహుజనులు వేల సంవత్సరాల కాలగతిలో, ముస్లిములు, క్రిష్టియన్లుగా మారారని అంటాడు కవి. అంతే కాక చరిత్రలో జరిగిన కుట్రలవల్ల వారు *మ్లేచ్ఛులు* అన్న బిరుదు పొందారని, వారి రక్తంతో చరిత్ర నిండిపోయింది అంటూ భరతమాతను ఎంతో ఆవేదనతో ప్రశ్నిస్తాడు. (*మ్లేచ్ఛుడు* అంటే– పరదేశీయుడు, నీచజాతివాడు, గోమాంసభక్షకుడు). ఆద్యంతమూ ఉన్న లోతైన అల్యూజన్ వల్ల కవితకు గొప్ప పటుత్వము, విస్తృతి వచ్చాయి.

కవికి మరణం లేదు
అక్షరం, భాష
బతికున్న వరకూ
ఇపుడు
పీతడెక్కల చంద్రుడ్ని
చేతులెత్తే సముద్రం
రాత్రి వచ్చిన రహస్యపు వానని
చెట్టు వేళ్ళూ
కవిని కవీ
భాషని భాషా బంధిస్తున్నాయి// *(అనంతం – ఆకెళ్ల రవి ప్రకాష్)*

ప్రముఖ కవి ఇస్మాయిల్ గారి మరణంపై ఆకెళ్ల రవిప్రకాష్ వ్రాసిన “అనంతం” అన్న కవితలోని కొన్ని వాక్యాలివి. కవి మరణం పట్ల సమాజం ఉ

దాసీనత చూపినప్పటికీ, అతను క్రమక్రమంగా భాషలోకి ఇంకుతాడని, అక్షరం, భాషా బతికున్నంతవరకూ అతనూ బ్రతికే ఉంటాడని రవిప్రకాష్ ఈ కవితలో చెపుతారు.

పై కవితలోని పీతడెక్కల చంద్రుడు, చేతులెత్తే సముద్రం, చెట్టువేళ్లూ అన్న పదాలు ఇస్మాయిల్ గారి వివిధ కవితలలోనివి. రాత్రివచ్చిన రహస్యపు వాన వారి కవిత్వసంపుటి పేరు. అంతే కాక ఒక వస్తువును మరొకటి బంధిస్తుంది అన్న ప్రయోగం కూడా ఇస్మాయిల్ గారు “స్వేచ్ఛాగానం” కవితలో చేసినదే. వీటన్నిటినీ అల్యూడ్ చేయటం ద్వారా ఇస్మాయిల్ గారి కవిత్వతత్వాన్ని తక్కువమాటలలో ఎక్కువగా చెప్పగలిగారు రవిప్రకాష్.

***

కవి సృజించిన అల్యూజన్ సాధారణంగా అతను పుట్టి, పెరిగిన సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. దాన్ని అర్థం చేసుకోవటం ద్వారా పాఠకునికి కవికి మధ్య సాంస్కృతిక ఏకత్వం దృఢపడుతుంది. కొన్ని సార్లు కవి పాత ఉదంతాలను వాటి అసలు అర్థాలలో కాక వ్యతిరేకార్థం ఇవ్వటానికి కూడా అల్యూడ్ చేయటం జరుగుతుంది. ఆధునిక కవిత్వంలో, ద్రోణుడు బొటనవేలు కోరటాన్ని, వామనుడు బలిచక్రవర్తిని చంపటం లాంటివి– వాటికి ఉద్దేశింపబడిన అర్థాలలో కాక ద్రోహానికి, మోసానికి ప్రతీకలుగా నిలపడాన్ని గమనించవచ్చు.

మంచి కవిత్వాన్ని సృష్టించటానికి అల్యూజన్ ఒక శక్తివంతమైన పనిముట్టు.

అల్లిగొరి (Alligory)

ఒక కవిత పైకి ఒక అర్ధాన్ని కలిగిఉండి అన్యాపదేశంగా మరో అర్ధాన్ని స్ఫురింపచేస్తున్నట్లయితే ఆ కవితలో ఉన్న టెక్నిక్ ను అల్లిగొరి అంటారు.

ఇమేజెరీ, సిమిలీ మెటఫర్, సింబల్, మెటనొమీ వంటి వివిధ కవిత్వభాషాంశాలు ఒకటి లేదా అనేకం కలిసి అల్లిగొరికల్ కవిత్వాన్ని నిర్మిస్తాయి. అల్లిగొరిని పొడిగింపబడిన మెటఫర్ అంటారు. మెటఫర్ అనేది ఒక పోలిక లేక ఓ వాక్యమో కాగా అల్లిగొరి వాక్యాల సమూహం లేదా కవిత మొత్తం కూడా కావొచ్చు.

ఒక నడిచే చందమామ
తన వెన్నెల చేతులతో
నిశ్చల తటాకముఖాన్ని
దగ్గరకు తీసుకొని
కలువ పెదవులను తీయగా చుంబించి
నిదుర కనులు తెరుచుకొనేలోగా
వేకువ వెల్లువలో కలిసి అదృశ్యమయ్యింది.

పై వాక్యాలలో ఒక తటాకంలోని కలువలను చందమామ వికసింపచేసి తెల్లారే సరికి మాయమయ్యింది అన్న ఒక సుందరమైన ప్రకృతి దృశ్యం ఆవిష్కృత మౌతుంది. ఇది పైకి కనిపించేది. “నడిచే” చందమామ అనే మెటఫర్ అందమైన స్త్రీ ని సూచిస్తుందని అనుకొంటే పై వాక్యాలలో “ఒక అందమైన అమ్మాయి నిద్రిస్తున్న యువకునికి ముద్దుపెట్టి పారిపోయిన దృశ్యం” కూడా కనిపిస్తుంది. ఇలా పైకి ఒక అర్ధము అన్యాపదేశంగా మరొక అర్ధముతో కవిత్వం చెప్పటమే

అల్లిగొరి. పై కవితను గమనిస్తే సింబల్, ఇమేజెరీ, మెటఫర్ వంటి వివిధ టెక్నిక్ లు కలగలసి ఆ కవితను నిర్మించాయి. నిర్మించాకా రెండు అర్థాలు వస్తున్నాయి కనుక దాన్ని అల్లిగొరి అంటున్నాము. ఆ అర్థాలు పరస్పర వ్యతిరేకం కావు కనుక ఇది ఐరనీ కాదు. ఏదో ఒక పదం మాత్రమె రెండు అర్ధాలను పలికించటం లేదు కనుక ఇది పన్ కాదు.

పై వాక్యాలనే “చందమామ/ తటాకంలోని కలువలను ముద్దాడి/ వికసింపచేసి అదృశ్యమైంది” అన్నప్పుడు కూడా అది కవితే. కానీ రెండర్థాలు లేవు. ప్రకృతి దృశ్యావిష్కరణ ఒకటే ఉంది కనుక అల్లిగొరి కాదు.

చాలా మట్టుకు అల్లెగొరీ కవితలలో అన్యాపదేశ అర్థాన్ని వెతుక్కొని అన్వయించుకోవాలసి ఉంటుంది. దానికి పాఠకుని పరిశ్రమ, ఊహించుకోగలిగే శక్తి, తెలుసుకోవాలనే జిజ్ఞాస అవసరం. అవి లేని పాఠకులకు ఇలాంటి కవితలు చప్పగా, క్లిష్టమైనవిగా లేదా అస్పష్ట కవితలుగా కనిపిస్తాయి. అయినప్పటికీ అల్లిగొరి అనేది కవిత్వభాషలో ముఖ్యమైన పనిముట్టు. కవిత్వానికి సాంద్రత, లోతు, విస్తృతిని కలిగించే ఒక సాధనం.

****

నల్లని దానను

నేను నల్లని దానను
నవ ధాన్యాల్లో నాలుగో దానను
నా పేరు మినుము
శక్తికి నేను ఇనుము//

హంసలమధ్య పికిలిపిట్టలా
బాహ్యాక అతికి నేను వికృతంగా వున్నా
కలకూజిత కంఠస్వరం
సొంతం చేసుకొన్న కోయిల పిట్టను.

నలుపు సౌందర్యాత్మకమే కాదు
జాత్యహంకారపు అభిజాత్యాలను
నిట్టనిలువునా దగ్ధం చేసే
నీలి మంటల ధిక్కారపు అగ్నిశిఖ
నా ధాతు శిలాజం
ఆఫ్రికా చీకటి ఖండం నుంచి
హరప్పా మొహంజోదారో నాగరికతల
చారిత్రక విభాత సంధ్యల వరకూ నిక్షిప్తమై ఉంది
ఇటు
వీరబాహుడు, మాల కన్నమనీడూ
వీర వల్లుడూ చండాలికా–
అటు
మార్టిన్ లూథర్ కింగ్ సొజర్నర్ ట్రూత్
నెల్సన్ మండేలా ఓలే సోయంకా
నా నల్ల నెత్తుటి అచ్చుపు వారసులు
చీకటి చరిత్ర మీద చెరగని వెలుగు పాదముద్రలు

గుండె కింది తడిలాంటి
ఇంతచెమ్మ నన్ను సోకితే చాలు
వొళ్లంతా కింజల్కపు పులకింతలతో
ఉబ్బితబ్బిబ్బైపోతాను
ఆపై నన్ను స్పృశిస్తే
శ్వేత ప్రపంచాన్ని తెల్ల మొగం వేయించి
ఉర్రూతలూగించిన

ఆటపాటల నెలరేడు
మైఖేల్ జాక్సన్ లా
తెల్లగా మిలమిలా మెరిపోతాను

అయినా నా వొంటి నలుపును
కడిగినంత సులభం కాదు

క

నా జాతి వర్ణ పంకిలాన్ని కడుక్కోవడం.

నేను నల్లనిదానను
చరిత్రగరాన్ని చీల్చుకొచ్చిన
వేయి రేకుల బాకుల నల్ల కలువను
వర్తమాన దళిత రణక్షేత్రంలో
సమతారథం శిఖరాగ్రంపై
రెపరెపలాడే గబ్బిలపు ధ్వజాన్ని *(నల్లని దానను – శిఖామణి)*

నవధాన్యాలపై జరిపిన రేడియో కవిసమ్మేళనానికి – "అప్పటికే వివిధ ధాన్యాలను ఇతర కవులు ఎంచుకొని ఉన్నారు, ఇక మిగిలింది 'మినువులు' మాత్రమే దానిపై కవిత వ్రాసుకొని రండి" అని శిఖామణి గారిని ఆహ్వానించినపుడు చదివిన కవిత ఇది. ఇటీవల వచ్చిన అల్లిగొరికల్ కవితలలో పై కవిత అద్వితీయమైనది.

నవధాన్యాలలో నాలుగవదానను, హంసలమధ్య పికిలిపిట్టను, చెమ్మసోకితే ఉబ్బిపోతాను, ఆపై స్పృశిస్తే తెల్లగా మెరిసిపోతాను వంటి పైపై పోలికలను బట్టి ఇది మినువులపై చెపుతున్న కవితగా అనిపించినా కవిత మొత్తం లోతైన దళితతాత్విక చింతనతో నడుస్తుంది.

మినువుకు ఉండే నలుపు రంగును తీసుకొని – జాత్యాహంకారాన్ని దహించే నీలి అగ్నిశిఖ, ఆఫ్రికానుండి మొహంజదారో వరకు నిక్షిప్తమైన నలుపు ధాతు శిలాజాలు, వీరబాహుడినుండి మండేలా వరకు సాగిన నల్లరక్తపు వెలిగే పాదముద్రలు, తెల్లజాతిని అబ్బురపరచిన నల్ల మైఖేల్ జాక్సన్ వంటి అనేక మెటఫర్‌ల ద్వారా ఒక వర్గదృక్పధాన్ని కవితలో అత్యంత ప్రతిభావంతంగా ప్రవేశపెడతాడు కవి. కవిత చివరలో మినువును నల్లకలువగా, సమతారథంపై ఎగురుతున్న గబ్బిలపు జండాగా పోల్చటంతో మొత్తం కవితలోని అల్లిగొరి టెక్నిక్ పతాకస్థాయికి చేరుకొని ఒక ఉదాత్త ముగింపును సంతరించుకొంది.

శిఖామణి కవిత్వంలో మానవతావాదం, సౌందర్యాత్మకత, దళితతత్వం సమపాళ్లలో కలగలిసి ఉంటాయి. పై కవితలో వాటి సమ్మేళనం గొప్ప కవిత్వానుభూతినిస్తుంది. ఆ అనుభూతిని అల్లిగొరి టెక్నిక్ ద్విగుణీకృతం చేసింది.

****

ఒకడు
మా వాడే – మహాగట్టివాడు – మకుటం లేని మహారాజయ్యేవాడు
కాని ముసలిదాన్ని, మసకమసక కన్నుల దాన్ని
మూల మూల ముడుచుకు కూర్చున్న దాన్ని
మనువు చేసుకోవాలన్న ఉబలాటంతో
మంచీ చెడ్డా మరచిపోయాడు, మర్యాదల్ని అతిక్రమించాడు
మరి పనికి రాడు

మరొకడు
మల్లెపూల మీద పరుంటాడు, మంచి గంధం రాసుకుంటాడు
మరి ఎందుకేడుస్తాడు?
మంచి పనివాడు, మాకు నచ్చినవాడు, మంత్రనగరానికి
వెళ్ళొచ్చినవాడు
మాతోపాటు నడుస్తానంటాడు, మరి నిజంగా వస్తాడా?

మూడోవాడు
అరె! వీడు చిచ్చర పిడుగు, ఎండలో నడిచే మనుష్యులకి గొడుగు
ముందుకు వేసిన అడుగు
మాకు చిన్నన్న, కానీ అన్నన్న! ఈ మధ్య విదేశాల చవకబారు
పానీయాలు సేవించి మత్తుగా పడుకున్నాడు
మరి యిప్పట్లో లేవడు -- (త్రిమూర్తులు - తిలక్)

త్రిమూర్తులు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని వాచ్యార్థం. పై కవితలో కవి అన్యాపదేశంగా మరెవరి గురించో చెపుతున్నట్లు తెలుస్తూంటుంది. వారు, వరుసగా విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ లని తెలుగు సాహిత్యరంగాన్ని దగ్గరగా పరిశీలించినవారికి అర్ధమౌతుంది. విశ్వనాథ వారు గట్టివాడయినా ఆయన చూపు సాంప్రదాయమైనదని–కృష్ణశాస్త్రి మంచి పనివాడయినా కాల్పనిక ప్రపంచంలో కూరుకుపోయాడని–శ్రీశ్రీ అభ్యుదయవాది అయినప్పటికీ విదేశీ భావజాల మోజులో మత్తుగా పడిఉన్నాడని (తిలక్ మానవతావాది), ఆ ముగ్గురి కవిత్వ తత్వాలను,

వారి నుంచి తెలుగు సాహిత్యం ఏమాశిస్తున్నదో స్పష్టంగా చెపుతాడు కవి. నిజానికి ఈ కవిత ఆ ముగ్గురి కవిత్వతత్వ విచారణ. వాచ్యార్థాన్ని మించిన గూఢార్థాన్ని పొదుగుకొన్న ఈ కవితలో ఆల్లిగొరి టెక్నిక్ కనిపిస్తుంది.

****

జీవించటమే.......

ఓ రోజు హఠాత్తుగా ఒకదారి తన గమ్యాన్ని మరచిపోయింది. గమ్యంలేని జీవితమేమిటని చాలా బెంగ పట్టుకొంది దానికి. తన గమ్యాన్ని వెతుక్కొంటూ ప్రయాణం కట్టిందా దారి. కనిపించిన ప్రతి ఒక్కరిని అడుగుతోంది.

పిట్టల్ని పెంచే కులవృత్తిని కోల్పోయి ఏదో ఫాక్టరీలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న ఓ ముసలి చెట్టును అడిగింది "నా గమ్యాన్ని ఎక్కడైనా చూసావా" అని. "తూర్పువైపున బోల్డన్ని గమ్యాలుంటాయని మా పూర్వీకులు చెప్పేవారు ఆ వైపు ప్రయత్నించు" అంది ఆ చెట్టు. అటుగా కదిలింది. పొద్దున్నుంచీ ఏమీ తినలేదేమో నిస్సత్తువ ఆవరిస్తోంది.

ఎదురుపడ్డ ఒక ఎఱ్ఱనత్తను అడిగితే "నన్ను అనుసరించు" అంటూ వెనుకకు నడవటం మొదలెట్టింది. దారికి దాని వాలకంపై అనుమానం వేసి ముందుకు సాగింది.

చీకటి పడింది. అడవి గుండా ప్రయాణం. ఏవేవో జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. దారికి భయం వేసింది. అయినా సరే గమ్యాన్ని కనుక్కోవాలన్న నిశ్చయం సడలలేదు. ఆకలి చలిలా కొరుకుతుంది.

కొందరు దారిదోపిడి దొంగలు పొదలమాటునుండి మీదపడి దారిని బంధించారు. ఓపికలేక ప్రతిఘటించలేకపోయింది. గమ్యం లేదని గమనించి ఒదిలేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

తెల్లారింది. నెమ్మదిగా అన్వేషణ కొనసాగించింది దారి. ఏదో ఊరు

కనిపించింది. పాత ఫ్లెక్సిలతో చేసిన గూళ్ళలో మనుషులు జీవిస్తున్నారు. వస్తూన్న ఒక వ్యక్తిని దాహం అడిగింది. నీళ్ళు తాగుతూ అతన్ని చూసింది. ఒక కాలు లేదు అతనికి. ఏమైంది అని ప్రశ్నించింది. “రైల్లో పల్లీలమ్ముతాను, ఓ రోజు ఆక్సిడెంట్ అయ్యింది” అన్నాడు. అతని లేని కాలును చేతిలోకి తీసుకొని తడిమింది. కన్నీళ్ళు వచ్చాయి. ఆకలి వల్ల ఎక్కువ బాధపడలేక పోయింది.

వెళ్ళిపోతున్న అతని వెనుక చేరి బుట్టలోంచి గుప్పెడు పల్లీలలను దొంగిలించి గబగబా నోట్లో కుక్కుకొంది. రైలుపట్టాలకు అంటుకొన్న రక్తం జ్ఞాపకాలు గొంతుకడ్డుపడ్డాయి. కుంటుకొంటూ పడమరవైపు వెళుతోన్న అతన్ని చూస్తుంటే అర్థమైంది గమ్యం అంటే ఏమిటో. ఇంకెప్పుడూ అది గమ్యం కొరకు అన్వేషించలేదు.
– (జీవించటమే....)

కథనాత్మకంగా సాగిన పై కవితలో కనిపించే దారి దారి కాదు, చెట్టు చెట్టూ కాదు, నత్త నత్తా కాదు. “జీవితానికి జీవించటమే గమ్యం తప్ప ఇతర గమ్యాలేవీ ఉండవు” అని అల్లిగొరికల్‌గా చెప్పబడింది. మిగిలిన వర్ణణలన్నీ ఆ మాట చెప్పటానికి ఏర్పరచిన బాక్ డ్రాప్.

****

అల్లిగొరి కలిగిన కవితలు ఎక్కువగా కథనాత్మకంగా ఉంటాయి. అల్లిగొరి వలన కవిత్వ గాఢత పెరిగి చాలా సందర్భాలలో డీకోడ్ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అది పాఠకుల బాధ్యత. అంతే కాక ఒక్కోసారి అదే కవిత ఒక్కొక్కరికి ఒక్కో అర్థంలో కనిపించినా ఆశ్చర్యపడక్కరలేదు. ఆధునిక కవిత్వంలో ఆరుద్ర, బైరాగి వంటి కవులు ఈ టెక్నిక్ ను ఎక్కువగా వాడుకొని గొప్ప కవిత్వం పండించారు. సమకాలీన కవులలో వాహెద్, ఎమ్మెస్ సూర్యనారాయణ వంటివారు ఈ ప్రక్రియలో మంచి కవితలు వ్రాసారు.

టోన్ (Tone)

ఒక కవితలో చెపుతున్న అంశం పట్ల కవికి ఉండే దృక్పథాన్ని టోన్ అంటారు. కవితలో కవి పలికించిన ఉద్వేగం (Mood) ఆ కవితలోని టోన్‌ని నిర్ణయిస్తుంది.

కవిత్వంలో టోన్ ని అర్థం చేసుకోవటానికి ప్రత్యేకమైన గుర్తులేమీ ఉండవు. కవితలో కనిపించే మెటఫర్, ఇమేజెరీ, సింబల్, మెటనమీ వంటి వివిధ కవిత్వభాషంశాలన్నీ కలిసి ఆ కవిత టోన్‌ను నిర్ణయిస్తాయి. కవితను పైపైన పరిశీలించితే టోన్‌ని పట్టుకోలేం. లోతుగా స్పృశించాలి. హృదయగతం చేసుకోవాలి.

టోన్ అంటే ఒక కవితలో కవి పలికించిన ఫీలింగు అని కూడా నిర్వచించుకొనవచ్చును. అది ఆనందం, ఉత్తేజం, కోపం, జాలి, ఉద్రేకం, జుగుప్స, కరుణ, వ్యంగ్యం, నైరాశ్యం, ఆశ్చర్యం ఏదైనా కావొచ్చు. కవిత్వాన్ని టోన్ వర్ణమయం చేస్తుంది. నిర్ధిష్టమైన టోన్ లేని కవితలు బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్లాంటివి.

ఒకే వస్తువుపై వ్రాసిన వివిధ కవితలను పరిశీలించినపుడు టోన్‌ని సులభంగా అర్థం చేసుకొనవచ్చును. వేశ్య అనే వస్తువుపై కొంతమంది కవులు వ్రాసిన కవితలు.

తాను శవమై
మరొకరి వశమై
తానుపుండై
మరుకరికి పండై

తాను ఎడారై
ఎందరికో ఒయాసిస్సై *(వేశ్య - అలిసెట్టి ప్రభాకర్)*

అలిసెట్టి కవిత్వం క్లుప్తత, గాఢతలకు చిరునామా. పై వాక్యాలలో నిజాయితీ కనిపిస్తుంది. అంత్యప్రాసలున్నా అభివ్యక్తి తీవ్రతవల్ల ఎబ్బెట్టుగా అనిపించదు. చెప్పదలచుకొన్న అంశాన్ని పదునుగా, నిప్పులాంటి స్పష్టతతో ఆవిష్కరిస్తాడు.

ఇప్పుడిది
ఎర్రజాబిళ్ళ ఎరీనా!
రండి బాబూ రండి
గంగా తీరే రాక్షసరతి సుఖసారే!
యమునా తీరే యమకూప విహారే!
తాజ్ మహల్ చలువ పలకలు
మీ తాపం తగ్గించవని
తాజాగా తల్లిపేగు తెంచిన
తడిబొడ్లను తట్టల్తో పేర్చాం!
దార్లెమ్మటి చలివేంద్రాలను
ధాబాలనే బలివేంద్రాలుగా మార్చి
పైటక్కర్లేని వయసుల పరోటాలు వడ్డించి
దాహానికి పాపకోలాలిస్తాం!//
రండి బాబూ రండి! // *(ఎర్రజాబిళ్ల ఎరీనా - పాటిబండ్ల రజని)*

భారతదేశం సెక్స్ టూరిజంకు కేంద్రంగా మారుతున్న సందర్భాన్ని నిరసిస్తూ వ్రాసిన కవిత ఇది. పై వాక్యాలలో వ్యంగ్యం, ఆవేశం కలగలసిన టోన్ కనిపిస్తుంది. జయదేవుని అష్టపదిని డిస్టార్ట్ చేసి వాడుకోవటం ద్వారా అనాదిగా ఇదే జరుగుతున్నది అన్న సూచనకూడా ధ్వనింపచేసారు. తడిబొడ్లను తట్టల్తో పేర్చాం, పైటక్కర్లేని వయసుల పరోటాలు, పాపకోలాలు అనటం అతిశయోక్తీకరించినట్లు అనిపించినా అది ఈ కర్కశ వ్యవస్థపై సంధించిన బలమైన వ్యంగ్యం.

//ఏ జుగుప్సకి పులకింతకి గురికాని ఆమె శరీరం
ఆమెది కాదు

ఎవడైనా బ్రహ్మజెముడు పొదలా మీదపడి
ఆమెని గోరింటాకులా రాసుకొని
కోర్కెపండిన తర్వాత
ఎండు గోరింటాకులా దులుపుకుంటాడు
ఆమె ఆకలినీ అవసరాన్నీ అలంకరణల్తో కలగలిపి
శరీరాన్ని మళ్ళీ తడి గోరింటాకు చేస్తుంది
బ్లాటింగ్ కాగితంలా మురికి రోగాల్ని పీల్చి పీల్చి
శాండ్ పేపర్ లా గరుకుగా ఎండిపోయి
పిడకలు రాలిన గోడలమీద మరకల్లాంటి మచ్చలతో
శరీరం శిధిలమైనప్పుడు
ఆమె పంజరం నుండి కూడా గెంటబడుతుంది/

–మెహబూబ్ కీ మెహెందీ (అరణ్య కృష్ణ)

అరణ్యకృష్ణ కవిత్వం మొఖంపై చెళ్లున చరిచినట్లుంటుంది. అత్యంత శక్తివంతమైన ఉద్వేగపూరిత పదచిత్రాలు ఎక్కడా తేలిపోకుండా కవిత ఆద్యంతం నిండి ఉంటాయి. పై కవిత టోన్ లో నిస్సహాయత, జాలి వంటి భావనలు కలిసి కవితావస్తువైన వేశ్య పట్ల సానుభూతి కలిగిస్తాయి. మరీ ముఖ్యంగా బ్లాటింగ్ కాగితం, సాండ్ పేపర్ అన్న ఇమేజెస్ ల మధ్య ఉండే కంట్రాస్ట్ హృదయాన్ని కలచివేస్తుంది.

//జీవితం లైంగికంగా వ్యాప్తిచెందే
అంటురోగమయిన చోట
కన్నెలు మల్లెలవుతాయి
మల్లెలు కత్తులవుతాయి.
ఇక్కడ స్త్రీ చర్మం గజాల్లెక్కనా
గంటల్లెక్కనా వ్యాపారం చేయబడుతుంది.
ఇక్కడ అసూర్యంపశ్యల మాంసం
దేహాల్లెక్కన వడ్డీకి తిప్పబడుతుంది.//

ప్రపంచ ప్రాచీన వృత్తి ఇక్కడి

వ్రణ యోనులకు జీవనాధారమై

అదే మృత్యుదాతై విరాజిల్లుతుంది. *(ఒకానొక రెడ్ లైట్ ఏరియా)*

పై కవితా వాక్యాలు కూడా వేశ్యల జీవితం గురించి వ్రాయబడినవే. జీవితమే ఒక అంటురోగం, గజాల్లెక్కన గంటల్లెక్కనా వ్యాపారం, వ్రణయోనులు, మృత్యుదాత వంటి పదాలలో కనిపించే బీభత్సత కవిత టోన్ ని నిర్దేశిస్తుంది. ఒక భీతావహ వాతావరణాన్ని ఆవిష్కరిస్తుంది.

//పళ్లమ్ముకొన్నట్టూ, మిఠాయిలమ్ముకున్నట్టూ
పైటలు తీసేసి, చప్పట్లు కొట్టి కవ్వించటం
రాత్రంతా అరుపులు
కబేళాకు తీసుకెళ్తున్న మూగజీవాల రోదనలా
వొళ్ళుతగలబడిపోతున్నప్పుడు చేసే ఆర్తనాదాల్లా
తుఫానులో కొట్టుకుపోతున్నప్పుడు వేసే కేకల్లా
దేశమంతా ప్రతిధ్వనించేలా ఆక్రందనలు
ఎటువైపుతిరిగినా వింతవాసన
నలిగిపోయిన నగ్న శరీరాల వాసన
కుళ్ళిపోయిన పూల వాసన.
ఎంత ఆకలి వెయ్యకపోతే
అంతటి దుర్గంధంలో కూడా
వాళ్లలా, కన్నీళ్లు వచ్చేటట్లు నవ్వగలుగుతున్నారూ?/

(పూలమ్ముకొనే బొంబాయి – ఆశారాజు)

ముంబాయి నగరపు రాత్రిని వర్ణించే ఒక కవితలో వేశ్యల గురించి ఉన్న కొన్ని వాక్యాలివి. పై వాక్యాలలోని టోన్‌లో కరుణ రసం చిప్పిల్లుతూంటుంది. వేశ్యల దుర్భరజీవితంలోని అరుపులు, రోదనలు, ఆర్తనాదాలు, ఆక్రందనలు కవి గమనించటం వారిపట్ల సహానుభూతివలననే సాధ్యపడుతుంది. “కుళ్ళిపోయిన పూలవాసన” అన్న ఒక్క ఇమేజ్ ద్వారా ఆ వ్యవస్థలో ఉండే దౌష్ట్యాన్ని కళ్ళకు కడతాడు కవి. ఇక చివరి వాక్యాలలో సంధించిన ప్రశ్న మనల్ని కలవరపెడుతుంది, కల్లోలపరుస్తుంది. ఏక్కడా ఏదీ కవి వచనంగా చెప్పడు. దుర్గంధం అంటే భౌతికమైన

దుర్గంధం కాదు, వ్యవస్థలోని/జీవితంలోని దుర్గంధం. ప్రతీదీ ఒక ఇమేజ్ ద్వారానో, సింబల్ తోనో ఆవిష్కరిస్తాడు. అది కవి ప్రతిభ. "కవిత్వానికి కరుణ ముఖ్యం" అని ఇస్మాయిల్ గారన్న మాటలకు పై వాక్యాలు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

***

ఈ దుఃఖం చేదు
సుఖం చేదు
చావురతి చేదు ఈ వేకువ చేదు
ఈ పూలూ బియ్యం
మందూ మాకులు కోడితొడలూ
వాటి హార్మోన్ పెదవుల ముద్దుల తడి
అంతా చేదు
ఆ..క్..థూ... (మొసాంబ్రం – సిద్ధార్థ)

సమకాలీన తెలుగుకవులలో పరాయీకరణను అత్యంత లాఘవంగా కవిత్వీకరించే కవులలో సిద్ధార్థ ఒకరు. పై వాక్యాలలో నైరాశ్యం, ఇదంతా మాయ అని తృణీకరించగలిగే తాత్వికతా కనిపిస్తాయి. ఇది పరాయీకరణలో ఒక భాగం. మనదికాని దాన్ని ధరించటం పట్ల, మూలాల్ని మరచిపోలేని కవి వేదనగా దాన్ని అర్థం చేసుకోవాలి. జీవితాన్ని యాక్ థూ అని తిరస్కరించటం గొప్ప వేదాంతి మాత్రమే చేయగలడు. ఈ కవితలో పలికే టోన్ లో యధాతథస్థితిపట్ల కోపం, నైరాశ్యం కలగలసి పలకటం గమనించవచ్చు.

ఆప్పుడెపుడో/ రాముడికీ రావణుడికీ/ యుద్ధం జరిగిందని తెలుసుకున్నాం కాని/ ఇప్పుడు సహనానికి అసహనానికి మధ్య/ యుద్ధం జరుగుతోందని మాత్రం అందరం తెలుసుకోవాల్సిన సమయం (అసహనం – కొమ్మవరపు విల్సన రావు) వాక్యాలలో ప్రస్తుతం దేశంలో నెలకొనిఉన్న అసహనాన్ని బలంగా పలికించారు. ఈ కవితలో ఉన్నది ధిక్కార స్వరం

సాధారణంగా ఒక కవి తాను నమ్మె సిద్ధాంతాలకు అనుగుణంగా అతని కవిత్వంలోని టోన్ ఉంటుంది. శ్రీశ్రీ కవిత్వంలో సామాజిక స్పృహ, కృష్ణశాస్త్రి కవిత్వంలో అనుభూతివాదం, జాషువా కవిత్వంలో దళిత తత్వం, ఇస్మాయిల్

కవిత్వంలో అనిబద్ధత వంటివి వారి కవిత్వపు టోన్ ని ప్రభావితం చేస్తాయి. ఒక కవితలోని ఒక వాక్యమో లేక ఖండికవల్ల టోన్ ను నిర్ధారించలేము. ఒక్కోసారి కవి నమ్మే భావజాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

లినియేషన్ (Lineation)

కవితలో ఒక లైన్ ముగిసి కొత్తలైన్ మొదలు పెట్టటాన్ని లైన్‌బ్రేక్ (పాదవిభజన) అని, కొన్ని లైన్లు అయ్యాక బ్రేక్ ఇచ్చి మళ్లీ కవితను కొనసాగించటాన్ని స్టాంజా బ్రేక్ అని అంటారు. ఇలా కవితను లైన్లుగా, స్టాంజాలు గా (ఖండికలు) విభజించటాన్ని లినియేషన్ అంటారు.

వచనం అవిచ్ఛిన్నంగాను, కవిత్వం లైన్ బ్రేక్స్ తోను రాసేపద్ధతి అనాదిగా స్థిరపడిపోయింది. పద్యాలకు యతి, గణాలను పరిగణలోకి తీసుకొని పాదవిభజన ఎక్కడ చేయాలనే దానికి కొన్ని చందస్సూత్రాలున్నాయి. వచన కవిత్వానికి ఏ నియమాలు లేవు.

పద్యపాదానికి అంతర్నిర్మాణమూ (Internal Structure) బాహ్యపరిమితి (External Limit) ఉండాలి అంటారు చేకూరి రామారావు. ప్రతీ లైన్‌లో ఉండే పదాలు ఒక స్పష్టమైన అర్థాన్ని, కవిత్వనిర్మాణాన్ని కలిగి ఉంటూ బాహ్యంగా అది పేజీకి కుడివైపు మార్జిన్‌ను పరిమితిగా కలిగి ఉండాలి అని దాని అర్థం.

కవితకు పాదవిభజన తప్పని సరిగా చేయాలా అన్న ప్రశ్నకు సమాధానం లభించదు. శేషేంద్రశర్మ “నాదేశం నా ప్రజలు” కావ్యాన్ని ఏ పాదవిభజన లేకుండానే పారగ్రాఫుల రూపంలో వ్రాసారు. ప్రతీ వాక్యంలో అద్భుతమైన కవిత్వముంటుంది. దాదాపు ప్రముఖ కవులందరూ ఒకటో రెండో కవితలను లైన్ బ్రేక్ లేకుండా వ్రాసిన సందర్భాలు కనిపిస్తాయి.

ఒక భావమో లేక భావాంశమో అక్కడకు పూర్తయిందని కవి భావించినపుడు కవితకు లైన్ బ్రేక్ ఇస్తాడు. కవితలోని విషయం పాఠకుని మనసులోకి ఇంకేందుకు

లైన్ బ్రేక్ దోహదపడుతుంది. లైన్ బ్రేక్ వద్ద చదువరికి కొంత విరామం చిక్కుతుంది, ఈ విరామసమయంలో చదువరి మెదడుపై ఆ భావాన్ని ఊహించుకొనే అవకాసం వస్తుంది.

కవితలో లైన్ బ్రేక్ చేయటం కవి ఇష్టం, స్వేచ్ఛ. ఒకరకంగా ఈ విషయంలో కవి పూర్తి నిరంకుశుడు. కవి ఇక్కడే ఎందుకు లైన్ బ్రేక్ చేసాడు అని ఆలోచించాలే తప్ప ఇక్కడ ఎందుకు చేసాడు అని అడిగే పరిస్థితి లేదు.

"వచన పద్యం: లక్షణ నిరూపణం" అన్న వ్యాసంలో కోవెల సంపత్కుమార గారు తిలక్ కవితలో లైన్‌బ్రేక్ ను విశ్లేషిస్తూ, భావప్రధానంగా పాదవిభజన ఉంటే ఎలా సుభోధకంగా ఉంటుందో చూపిస్తారు.

1. నిర్జనస్థలం, ఎవ్వరూ లేరు, చుట్టూ పరచుకున్న మైదానపు
2. నగ్నదేహాన్ని స్పృశించబోయే నిచుల శాఖాగ్రపు వ్యగ్రపు
3. తొందర నిశ్శబ్దం మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తోంది. ఆకాశం
4. మీద ఒక చుక్క మరో నక్షత్రంతో మాట్లాడే మాట మనసుకి
5. వినిపిస్తోంది. (రాత్రివేళ – తిలక్)

ఇది తిలక్ చేసిన లైన్ బ్రేక్. ఇందులో భావాలను పాదాలుగా అమర్చినట్లు కనిపించదు. దీనిలో మూడో లైన్ మొదట్లో "తొందర" చివరలో "ఆకాశం", నాల్గోపాదం చివరలో ఉన్న "మనసుకి" అనే పదాలు కవితను అర్ధం చేసుకోవటంలో అడ్డం పడతాయి. పాఠకుని మస్తిష్కంలో కవిత రూపుదిద్దుకొనే క్రమంలో తగిన వ్యవధినివ్వవు, కలగాబులగం చేస్తాయి. ఇది తిలక్ చేసిన దోషమో లేక అచ్చువేయటంలో పొరపాటు జరిగిందో తెలియదు అని చెపుతూ – పై వాక్యాలకు లైన్ బ్రేక్స్ ఇలా ఉండాలంటారు కోవెల సంపత్కుమార.

నిర్జన స్థలం
ఎవ్వరూ లేరు
చుట్టూ పరచుకున్న మైదానపు నగ్న దేహాన్ని
స్పృశించబోయే నిచుల శాఖాగ్రపు వ్యగ్రపు తొందర
నిశ్శబ్దం మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తోంది.

ఆకాశం మీద ఒక చుక్క మరో నక్షత్రంతో మాట్లాడే మాట
మనసుకి వినిపిస్తోంది.

లైన్ బ్రేక్ విషయంలో కవి సర్వస్వతంత్రుడు అయినప్పటికీ, పాదవిభజన పట్ల కవి శ్రద్ధ తీసుకోవాలని, లేకపోతే పాఠకునికి ఆ కవితను అర్థం చేసుకోవటం గహనమౌతుందని పై ఉదాహరణ నిరూపిస్తుంది. నిర్దిష్టమైన అంతర్నిర్మాణంతో ఒక లైనులో ఒక భావమో లేక భావాంశమో ఉండేలా కవి జాగ్రత్త పడినప్పుడు గందరగోళం కలుగదు

కవితలో ఒక వాక్యాన్నో లేక భావాన్నో పూర్తిచేసి లైన్ బ్రేక్ ఇవ్వటం ద్వారా కవిత సులభంగా అర్థమౌతుంది. ఇట్టి లైన్ బ్రేక్‌ను End-Stopped Line break అంటారు. ఏ పాదానికి ఆ పాదం సంపూర్ణ అర్ధాన్ని కలిగిఉంటుంది.

1. ఈ నదులు కొండలు ఈ దేశం ఎవరిది?
2. పనిచేసిన కూలిడబ్బులతో బ్రతుకుతున్న ప్రజలది
3. ఈ దేశపు వీధుల్లో నడిచే హక్కెవరిది?
4. స్వేదబిందువుల దండలు వేసుకున్న వారిది. (గుంటూరు శేషేంద్ర శర్మ)

పై కవితలో శర్మ గారు శ్రామికునికే ఈ దేశసంపద అనుభవించే అర్హత ఉందని, దండలువేయించుకు తిరిగే దోపిడీ వర్గాలకు లేదని చెపుతున్నారు. పై వాక్యాలలో ప్రతీ లైను దేనికదే ఒక పూర్ణ వాక్యం. ఒక వాక్యం పూర్తయ్యాక మరొక వాక్యాన్ని మొదలెట్టటం పాదవిభజన పద్ధతిలో ప్రాథమికమైనది

1. జాతరలో పిల్లలు తప్పిపోతారు
2. పరిక్ష ఫెయిలై పిల్లలు పారిపోతారు
3. ప్రేమ విఫలమై ప్రేమికులు మాయమవుతారు
4. ఇవేమీ లేకుండానే
5. మా వూరు మాయమైపోయింది
6. మా వూరి ఆనవాళ్లు చెపుతాను
7. మా ఊరిని వెతికి పెట్టడంలో నాకాస్త సహాయం చేయండి

(జింబో)

పై కవితలో నాలుగో పాదం తప్ప అన్ని పాదాలు End-Stopped వాక్యాలు. నాలుగో పాదం అన్ని పాదాలను భావరీత్యా కలుపటం వల్ల కవితకు ఒక తెలియని నాస్టాల్జిక్ ఉద్వేగం వచ్చి చేరింది.

కవితలో వాక్యం మధ్యలో లైన్ బ్రేక్ చేయటాన్ని Enjambment అంటారు. ఒక వాక్యం రెండు లైన్స్ గా చేయబడినప్పుడు, మొదటి వాక్యం పూర్తవగానే పాఠకునిలో కొంత ఉత్సుకత రేకెత్తుతుంది, తదుపరి వాక్యాలలో ఆ సస్పెన్స్ వీడి మంచి పఠనానుభవం కలుగుతుంది.

1. సాయంత్రానికి
2. నలుగురు కలిస్తే కాని
3. ఆరోజు బతికినట్టుండదు,
4. నట్టింట్లో పీట వేసి
5. నలుగురికి బువ్వ పెడితేగాని
6. అన్నం తిన్నట్టుండదు
7. కాపీ అయినా
8. నువ్వొక్కడివే ఎలా తాగుతావు
9. పెళ్ళామో, పిల్లలో
10. ఆఖరికి చెవులు వేలాడేసుకుని
11. నీ ఎదురుగా పడుకున్న కుక్కయినా లేకుండా– (సాయంత్రానికి – శివారెడ్డి)

పంచుకోవటమనేది ఒక మానవ విలువ. పంచుకోనితనం వల్ల ఎంతటి జీవరాహిత్యంలోకి మానవుడు కూలిపోతున్నాడో అద్భుతంగా వ్యక్తీకరిస్తారు శివారెడ్డి. ఒక పాత్రై సమూహంకి ప్రవహించటంలోని సౌందర్యాన్ని గొప్పగా ఆవిష్కరిస్తారు. "సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై"..... అనే ఉపనిషద్వాక్యానికి ఆధునిక రూపమీ కవిత. పై వాక్యాలలో 1,2,3–4,5,6 –7,8,9,10,11 పాదాలు Enjambed లైన్స్ కు చక్కని ఉదాహరణలుగా నిలుస్తాయి.

1. సూర్యుడు అస్తమించడు

2. మా ఎసరు కింద పొయ్యిగా మండుతాడు

3. మా గూట్లో దీపమై వెలుగుతాడు

4. ఇరుల తీగలపై

5. మిణుగురుల సంగీతాన్ని వాయిస్తాడు (డా. ఎన్. గోపి)

పై వాక్యాలలో ఒక సూర్యాస్తమయం అద్భుతమైన పదచిత్రాలుగా పోతపోసుకొంటుంది. 1,2,3 లు End stopped లైన్స్, 4, 5 లైన్లలో ఒక వాక్యం బ్రేక్ చేయబడింది కనుక అవి Enjambed లైన్స్.

1. *జీవితం దేనికీ వివరణ లివ్వదు*

2. *ఆకలితో దైన్యంగా స్తన్యంకోసం*

3. *పరితపించినప్పుడైనా*

4. *మృదువుగా పాలించదు, లాలించదు*

5. *ఆక్రోశంతో పేగు మెలితిరిగేలా ఎలుగెత్తి ఘోషించినా*

6. *ఉలకదు, పలకదు*

7. *కనికరించదు*

8. *జీవితం కలలో కూడా జాలిపాట పాడదు*

9. *కట్టెదుట కనిపించినట్టే కనిపించి*

10. *కనిపించకుండా పోయే*

11. *జీవితాన్ని ద్వేషించలేం .... ప్రేమించలేం* (ఎమ్మెస్ సూర్యనారాయణ)

1, 8, 11 లైన్లు పూర్ణ భావాలు. 2,3, 4 లైన్లలో చెప్పబడ్డ భిన్న భావాంశాలను కలుపుకొని చదువుకొంటే ఒక పూర్తివాక్యం ఏర్పడుతుంది. 5,6,7 లైన్లు కూడా అదే ధోరణిని అనుసరిస్తాయి. 7 వ లైన్లో "ఒక్క పదం" మాత్రమే ఉండటాన్ని గమనార్హం. 9,10, 11 లైన్లు కలిసి ఒక పూర్తి వాక్యాన్నేర్పరుస్తున్నాయి. పాలించదు, లాలించదు, ఉలకదు కనికరించదు అన్నక్రియలు మొదటి లైన్లో ఉన్న "జీవితం" కు సంబంధించినవి. కొన్ని లైన్లతో ఒక భావం పూర్తయిందనిపించినా భావధార మాత్రం కవిత ఆద్యంతం కొనసాగుతుంది.

కొన్ని సందర్భాలలో ఒక పదాన్ని కూడా బ్రేక్ చేయటం జరుగుతుంది. ఇది ముఖ్యంగా పద్యాలలో యతినియమం పాటించటం కొరకు తప్పనిసరి అవ్వవొచ్చు.

మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ
న్నేళ్ళకి పద్యాలు రాయుటిది యెట్లన్నన్
పళ్ళూడిన ముసిలిది కు
చ్చిళ్ళన్ సవరించినట్టు సిరిసిరిమువ్వా!" (శ్రీశ్రీ)

పై పద్యంలో ఇన్నేళ్ళకి, కుచ్చిళ్లన్ అన్న పదాలు యతికొరకు మధ్యలో విభజించబడ్డాయి. సమకాలీన వచన కవిత్వంలో ఇలాంటి ప్రయోగాలు అరుదు.

లైన్ బ్రేక్ అనేది చిన్న విరామం. కొన్ని లైన్లను కలిపి ఒక ఖండిక అనుకొంటే, ఖండికకు ఖండికకూ మధ్య బ్రేక్ ఇవ్వటం కొంచెం పెద్ద విరామంగా భావించాలి. ఆధునిక కవిత్వంలో సాధారణంగా ఒక ఇమేజెరీ పూర్తయ్యాకా స్టాంజా బ్రేక్ ఇవ్వటం గమనిస్తాము.

కీమో థెరపీ

1. ఇంట్లోకి ఇంకా అడుగుపెట్టనే లేదు
తల వెంట్రుకల చుట్ట
బండి చక్రంలా గాలికి
దొర్లుకొంటూ దొర్లుకొంటూ వచ్చి
గడప వద్ద ఆగింది

2. పెను దుఃఖం
ఒక ఆలింగనం
ఎడతెగని కన్నీరు

3. వెంట్రుకల్ని ఒక్కొక్కటీ
రాల్చుకొంటూన్న తరువు
మెల్లమెల్లగా
గతంలోకి కూరుకుపోతోంది.

4. కటిక రాత్రి
జుట్టుపట్టుకొని ఈడ్చుకుపోతూంటే
తెగిన చీకటి దారాల్లా వెంట్రుకలు
ఎల్లెడలా మృత్యుశైత్యం

5. ఒక వేదన
భయప్రవాహం
విచ్చుకొన్న ఓదార్పు తెరచాప

పై కవితలో అయిదు స్టాంజాలున్నాయి. కవి బంధువుకు ఎవరికో కాన్సర్ వచ్చిందని తెలిసి, వారి ఇంటికి వెళ్ళి పలకరించి ఓదార్చిన సందర్భాన్ని చెప్పే కవిత అది. మొదటి స్టాంజాలో ఇంటిలోకి అడుగుపెట్టటాన్ని, రెండవ స్టాంజాలో కౌగిలించుకొని ఏడవటాన్ని, మూడవ స్టాంజాలో ఆ పేషెంటు నాస్టాల్జియాలోకి జారిపోవటం గురించి, నాల్గవ స్టాంజాలో ఇంట్లో కనిపిస్తున్న మృత్యు వాతావరణాన్ని, చివర స్టాంజాలో కవి ఓదార్పు మాటలు చెప్పటం – వంటి భిన్న అంశాలు వ్యక్తీకరింపబడ్డాయి. 1,3,4 స్టాంజాలలో వచ్చే వెంట్రుకల ప్రసక్తి ద్వారా కీమోథెరపీ సైడ్ ఎఫెక్ట్ని ప్రస్తావిస్తాడు కవి.

ప్రతీ స్టాంజా ఒక కంపార్ట్ మెంట్ లాగ ఉండటాన్ని గమనించవచ్చు. దేనికదే ఒక స్వతంత్ర ఇమేజ్. వాటన్నింటినీ కలుపుకొంటేనే ఒక సంపూర్ణ చిత్రం ఏర్పడుతుంది. ఇలా స్టాంజాలుగా విడగొట్టినపుడు లభించే విరామంలో చదువరి మస్తిష్కం విడివిడిగా ఉండే ఇమేజెస్ ను సమన్వయపరచుకోగలుగుతుంది.

కవిత్వంలో లినియేషన్ ను చాలా అలవోకగా చేస్తారు కానీ దానికి కొన్ని జాగ్రత్తలు అవసరం, లేకపోతే కవిత అస్పష్టతలోకి జారిపోయే ప్రమాదం ఉంది. కవితలకు ఒక వాక్యం ముగిసాకో లేక మధ్యలోనో లైన్ బ్రేక్ చెస్తారు. లైన్ బ్రేక్ అనేది కవిత కవితకూ మారిపోవచ్చు. అతి క్లుప్తతతో వ్రాసే కొన్ని కవితలలో ఒక్క పదమే ఒక లైన్ గా ఉండొచ్చు. కవితా వాక్యాలను ఏదైనా వ్యాసంలో ఉటంకించాల్సి వచ్చినప్పుడు లైన్ బ్రేక్స్ ను "/" గుర్తుతోను, స్టాంజా బ్రేక్ ను "// " గుర్తుతోను వ్యవహరించాలి. మరీ పొడుగు లైన్లు, పొట్టి లైన్లతో కవితను నడిపించటం ఒక్కోసారి కవిత ఆకారాన్ని పాడుచేస్తుంది.

స్టేట్మెంట్స్

కవిత్వభాషలో ఓవర్ స్టేట్మెంట్, అండర్ స్టేట్మెంట్‌లు పటిష్ఠమైన కవితానిర్మాణానికి కవి ఎంచుకొనే పనిముట్లు. ఓవర్ స్టేట్మెంట్‌ను హైపర్‌బొలి అనికూడా అంటారు.

ఒక విషయాన్ని బలంగా చెప్పటం కోసం దాన్ని అతిశయోక్తీకరించటాన్ని హైపర్‌బొలి అంటారు. దీనివల్ల ఆ వస్తువు వర్ణన లోతుగా చదువరి మనసులో నాటుకొంటుంది. అలా అతిగా చెప్పటాన్ని వాచ్యార్థంతో తీసుకోరాదు. అది కవిత్వభాషలో ఒక అంశం. దీనివల్ల చెపుతున్న వస్తువు ఎంత ముఖ్యమైనదో, అందమైనదో, విస్మరింపరానిదో అర్ధమౌతుంది. హైపర్‌బొలి వర్ణణలు ఎక్కువగా సిమిలి, మెటాఫర్ ల ద్వారా పలికిస్తారు.

అతిశయోక్తీకరించటం మానవనైజం, కవిత్వానికి అందం. దైనందిన సంభాషణలలో హైపర్‌బొలి వాక్యాలు అలవోకగా దొర్లుతాయి. ఒక రంగంలో ఎక్కువ అనుభవం కలిగిన వ్యక్తినో లేక వయసురీత్యా పెద్దవాడినో "వాడు భూమిపుట్టక ముందు పుట్టాడు" అంటాం. తెల్లజుట్టుకు రంగు వేసుకొన్న వ్యక్తిని "వాడు మారువేషంలో తిరుగుతున్నాడు" అని ఆటపట్టిస్తాం. పై వాక్యాలలో హైపర్‌బొలి టెక్నిక్ వల్ల కనిపించే అర్ధాలు మాయమై విశిష్టార్ధాలు ధ్వనిస్తాయి.

హైపర్‌బొలి టెక్నిక్ ప్రాచీన కాలం నుంచి కవిత్వంలో కనిపిస్తుంది. హెూమర్ ఒక చోట "Mars god ఒక్కసారిగా పదివేల గొంతుకలతో గర్జించాడు" అంటాడు. రెండువేల సంవత్సరాలక్రితం వ్రాసిన గాథాసప్తశతిలో ఒక గాథాకారుడు చేసిన ఈ హైపర్‌బొలిక్ వర్ణణ "స్త్రీ మోము–చందమామ" పోలికలలో ప్రపంచసాహిత్యంలోనే అత్యుత్తమమైనదిగా నిలుస్తుంది.

ప్రతీ పౌర్ణమి రోజునా సృష్టికర్త
చందమామను ఒకసారి తీసి
నీ మోముతో పోల్చిచూసి
చిన్నచిన్న మార్పులు చేసి
మరలా పెడుతున్నాడు. *- 207*

అండర్ స్టేట్మెంట్ అనేది హైపర్‌బొలికి వ్యతిరేకం. ఇందులో ఒక విషయాన్ని చెప్పాల్సిన దానికన్నా తక్కువచేసి చెప్పటం జరుగుతుంది. చెప్పదలచుకొన్న విషయం నిజంగా ముఖ్యమైనది అయినప్పటికీ, దానికంత ప్రాధాన్యత ఇవ్వకుండా చెప్పటమే అండర్ స్టేట్మెంట్.

"నా ప్రియురాలు ఒక దేవత" అనటం హైపర్‌బొలి. ఇక్కడ ఒక స్త్రీని దేవతతో పోల్చటం అతిశయోక్తి అయినప్పటికీ ఆ స్టేట్మెంట్లో ఆమెపట్ల అతనికి ఉన్న ప్రేమ, అనురాగము, ఆరాధన ప్రకటితమౌతాయి. ఆ వాక్యం చదివినపుడు వారి ఇరువురి మధ్య ఒక ఉదాత్తమైన, అలౌకిక అనుబంధం ఉన్నట్లు అర్ధమౌతుంది.

"నా ప్రియురాలు ఒక మానవి" అనటం అండర్ స్టేట్మెంట్. మానవి అంటే స్త్రీ అని అర్ధం. ప్రియురాలు పదం స్త్రీ లింగమే. ప్రత్యేకించి ఆమెను ఒక స్త్రీ అని చెప్పక్కరలేదు. అంతే కాక అందమైన, తెలివైన, స్వాభిమాన వంటి విశేషణాలు కూడా ఏమీ లేవు. ఆమె ఉత్త స్త్రీ అని మాత్రమే చెప్పబడుతున్నది. కానీ కొంచెం ఆలోచించితే– ఆమెకు మానవ లక్షణాలైన సంస్కారము, సభ్యత, దయ, మర్యాద వంటి గుణాలు ఉన్నాయని చెపుతున్నట్లు అర్ధమౌతుంది. అలా వస్తువును తక్కువచేసి నర్మగర్భితంగా చెప్పటమే అండర్‌స్టేట్మెంట్.

Neighbours Envy-Owners Pride అనే ఒనిడా టివి ప్రకటన హైపర్‌బొలికి, పాతకార్లను Pre Owned Cars అనటం అండర్ స్టేట్మెంటుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

***

ప్రపంచీకరణ మహమ్మారి ఊపిరాడని బలవంతపు కౌగిలిలో
ఏదైతేనేం వాడు గిలగిలా కొట్టుకొని చనిపోయాడు

వాడు నేసిన తెల్లని వస్త్రం
వాడి శవం మీదే కప్పడం పెద్ద విషాదం
ఇప్పుడు నాకు బట్టలు కట్టుకొన్న ప్రతి మనిషీ
వాడి శవాన్ని మోస్తున్న ఉరికొయ్యలా కనిపిస్తున్నాడు (విరిగిన మగ్గం –భగ్వాన్)

చేనేత కార్మికుని ఆత్మహత్యపై వ్రాసిన కవిత ఇది. "ప్రతిమనిషీ ఉరికొయ్యలా" కనిపిస్తున్నాడు అనటం హైపర్‌బొలిక్ వర్ణణ. ప్రతి ఒక్కరిని ఉరికొయ్య అనటం అతిశయోక్తి అయినప్పటికీ ఆ మాటను కవి జస్టిఫై చేయగలిగాడు. ఆ వాక్యం మొత్తం కవితలోని విషాదాన్ని పతాకస్థాయికి చేర్చి, "అతని దుఃఖానికి అందరూ బాధ్యులే" అన్న సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ కవితను "ప్రతి మనిషీ ఈ చావుకు బాధ్యుడే" అని ముగించి ఉంటే, అంతటి శక్తివంతమైన, పదునైన, ఆలోచనాత్మకమైన ముగింపు వచ్చి ఉండేది కాదు. కవితకు ఒక ఉదాత్తమైన ముగింపు హైపర్‌బొలి వలననే సాధ్యపడింది.

నాకొ్కంచెం నమ్మకమివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టమాటోలాంటి సూర్యుడ్ని
ఆరిన అప్పడంలాంటి చంద్రుడ్ని
ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను
నాదగు బాహుబంధనంలో ఈ విశాల బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేస్తాను
నిస్సహాయ మానవీయుని నొసటివ్రాలు
ఒక్క కలంపోటుతోటి కొట్టేస్తాను
జీవిత సభా భవన ద్వారం నుండి
అన్యాయాన్ని, అక్రమాన్ని మెడబట్టి గెంటెస్తాను
ఇంకా ఎన్నో ఎన్నెన్నో చేసేస్తాను
కానీ ఒక్కటి
నాకొ్కంచెం నమ్మకమివ్వు (–ఆలూరి బైరాగి)

కొండల్ని పిండికొట్టటం, చంద్రుణ్ణి తరిమేయటం, నొసటి వ్రాతను మార్చటం లాంటి ఎన్నో మానవమాత్రులు చేయలేని పనుల్ని చేస్తాను అంటాడు బైరాగి పై కవితలో. ప్రతీ ఇమేజ్ ఒకచక్కని హైపర్‌బోల్. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ కవితకు బలాన్నిచ్చింది వరుసగా పేర్చుకొంటూ వచ్చిన ఓవర్‌స్టేట్‌మెంట్లు కాదు, "నాక్కొంచెం నమ్మకమివ్వు" అన్న కరుణపూరిత స్వరం. చాలామంది ఇదే శైలిలో అది చేస్తాను ఇది చేస్తాను అంటూ ఎన్ని కవితలు వ్రాసినా అవన్నీ కాలగర్భంలో కలిసిపోయి ఈ కవితమాత్రమే ఈనాటికీ నిలిచి ఉండటానికి ముఖ్య కారణం ఈ కవితలో "నమ్మకమివ్వు" అన్న పదంలో పలికిన ఉద్వేగం. ఇది గమనించాల్సిన అంశం.

'యీ సముద్రపునీరు
యింత ఉప్పగా ఉందేమిటి' అడిగాడతడు
గుక్కెడు నీళ్ళు పుక్కిలిస్తూ....
'అణుధూళి కమ్మి 'కొవ్వాడ' కన్నీరు
కడలిగా మారిపోయిందన్నారు వాళ్ళు
తుండుగుడ్డతో దుఃఖాన్ని ఒత్తుకుంటూ...

'తరగలెత్తే యీ జలసానువుల మీద
తెల్లగుడ్డెవరు కప్పార'న్నాడతడు తీరంమీద నడుస్తూ
'కుళ్ళిన కోడిగుడ్డు సొనలా పారే రసాయినాలకు
చచ్చి తేలిన మత్స్యసంపద'న్నారు వాళ్ళు
తీరానికి తలబాదుకుంటూ.... (మంట - సిరికి స్వామినాయుడు)

ఉత్తరాంధ్రలో అభివృద్ధిపేరిట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని అత్యద్భుతంగా అక్షరీకరించిన కవిత ఇది. కొవ్వాడ అణువిద్యుత్ పరిశ్రమ స్థాపనను స్థానికులు వ్యతిరేకిస్తూ తీవ్రమైన పోరాటం సాగిస్తున్న వైనం మొదటి ఖండికలో తెలుస్తుంది. "కొవ్వాడ కన్నీరు కడలిగా మారటం" అన్న ప్రయోగం హైపర్‌బొలి. సముద్రపు నీరు ఉప్పగా ఉంటుంది, కన్నీరూ ఉప్పగానే ఉంటుంది. కడలిగా మారిన కన్నీరు సముద్రపునీటికన్నా ఉప్పగా ఉందనటం ఒక వర్ణించలేని దుఃఖాన్ని వాక్యాలలో నింపటమే. సాధారణంగా ఎక్కువ సంఖ్యలో చేపలు చనిపోతే

నీటిపైతేలి మెరుస్తూ కనిపిస్తాయి. ఆ దృశ్యాన్ని "తెల్లగుడ్డ కప్పినట్లుంది" అంటూ చేసిన హైపర్ బోలిక్ వర్ణణ, శవంపై కప్పే తెల్లగుడ్డను స్ఫురణకు తెచ్చి ఆ విషాదాన్ని రెట్టింపు చేస్తుంది. పై వాక్యాలలో కనిపించే హైపర్‌బొలిక్ టెక్నిక్ ఇతర మెటఫర్, సిమిలీలతో కలిసి ఒక దుఃఖమయ వాతావరణాన్ని చాలా ఆర్ద్రంగా ఆవిష్కరిస్తుంది.

మా వూర్లో పెద్ద తుఫాను వచ్చింది అంటే 'పోనీలే మొక్కలకు నీళ్లు పొయ్యక్కర లేదు అని హాస్యమాడటం; పెద్ద విజయం సాధించిన వ్యక్తికి అభినందనలు చెప్పినపుడు 'ఏదో మీ దయ' అని వినమ్రంగా అనటం; చికాకు తెప్పిస్తున్నా సరే 'మీ పిల్లాడు భలే చలాకి' అని మర్యాద కొరకు అనటం; లాంటివి వివిధ సందర్భాలలో మనం వాడే అండర్ స్టేట్మెంట్లు.

రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా/
పడవనైనా కాకపోతిని స్వామికార్యము తీర్చగా
పాదుకైనా కాకపోతిని భక్తిరాజ్యము నేలగా
అడవిలోపల పక్షినైతే అతివ సీతను కాచనా /
కడలి గట్టున ఉడతనైతే బుడత సాయము చేయనా *(ఆరుద్ర)*

ఆరుద్ర రచించిన పై గీతంలో ప్రతీ వాక్యంలో అండర్‌స్టేట్మెంట్‌లు కరుణరసార్ధ్రభరితంగా ఒదిగిపోయి గొప్ప ఉద్వేగాన్ని కలిగించి హృదయాన్ని ద్రవింపచేస్తాయి. మానవజన్మ ఎత్తిన ఒక స్త్రీ తాను రాయినో, పడవనో, పాదుకనో ఉడతనో ఎందుకు కాలేకపోయాను అంటూ వినమ్రపూర్వకంగా తనని తాను తగ్గించుకోవటంలో అండర్‌స్టేట్మెంట్ టెక్నిక్ కనిపిస్తుంది. (పై వర్ణణలు రామాయణంలోని వివిధ ఘట్టాలకు అల్యూజన్‌ని కలిగిఉండటం వేరే కోణం.)

దేవుని చెక్కిళ్ల మీద దీనంగా జారే కన్నీటిని
దీపకాంతిలో చూసి చటుక్కున జాలితో లేచి
కౌగిలించి, ఊరడించి
కన్నీటిని తుడిచి
వెళ్ళిరమ్మని వీధి చివరిదాకా సాగనంపి వచ్చాను.
నాకు తెలుసు, నాకు తెలుసు

మానవుడే దానవుడై తిరగబడినప్పుడు
పాపం పెద్దవాడు... కన్నకడుపు– ఏంచేస్తాడని!

(నిన్న రాత్రి... తిలక్)

పై కవితలో తిలక్ దేవుడిని నిస్సహాయునిలా చిత్రిస్తాడు. ఈ లోకంలో జరుగుతున్న అన్యాయాలు, బాధలు, యుద్ధాల పట్ల ఏమీ చేయలేక కన్నీరు కార్చే కడుపుతీపి కలిగిన వృద్ధ తండ్రిలా దేవుడిని చూపటం ఆద్యంతం ఒక అండర్ స్టేట్‌మెంట్. దేవుడిని ఒక మామూలు మనిషి స్థాయికి తగ్గించటం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతి, అసమానతలు, ప్రభుత్వ విధానాలపట్ల అవగాహనను పాఠకునిలో బలంగా నాటుకొనేలా చేస్తాడు కవి.

"భగవంతుని వితంతువులం" అన్న శ్రీశ్రీ వాక్యం ఒక అండర్ స్టేట్ మెంట్ . భగవంతుడు మరణించాడని చెప్పడమే కవి అసలు వుద్దేశ్యం

హైపర్‌బొలి, అండర్ స్టేట్మెంట్లతో నిర్మించిన వాక్యాలు ఆ కవిత్వానికి సాంద్రత అదనపు సొగసులు అందిస్తాయి. అతి సునాయాసంగా అందరూ వాడగలిగేది హైపర్‌బొలి టెక్నిక్. అండర్ స్టేట్ మెంట్ కు బలమైన నేపథ్యం ఉ ంటే రక్తికడుతుంది. తెలుగు కవిత్వంలో దీని వాడుక అరుదుగా కనిపిస్తుంది.

ఐరనీ (Irony)

పైకి ఒక అర్థాన్ని అంతర్లీనంగా దానికి "వ్యతిరేక అర్థాన్ని" కలిగి ఉండేలా చెప్పటాన్ని ఐరనీ అంటారు.

కవిత్వంలో ఐరనీని ఉపయోగించి గొప్ప ధిక్కారాన్ని పలికించవచ్చు. చుట్టూ జరుగుతున్న అన్యాయాలకు, అవకతవకలకు కలిగే కోపంలోంచి ఐరనీ పుడుతుంది. మార్చలేని నిస్సహాయ స్థితిని ఐరనీ ద్వారా చాలా శక్తివంతంగా వ్యక్తీకరించవచ్చు.

//నువ్వొకప్పుడు ఇంగ్లాండవతారంలో మమ్మల్ని
కరుణించావ్
మూర్ఖులం నీ లీల గ్రహించలేక నిన్ను ద్వేషించాం
అయితే నేం
పాపుల్ని కరుణించే వరకూ నువ్ నిద్రపోవ్ కదా
నివ్విప్పుడు అమెరికావతారంలో సాక్షాత్కరించి
మా ద్వారాలు తెరిపించావ్
ఇప్పుడు మా మెదడూ–హృదయంలోనూ నీ
నామ స్మరణమే// – *(ప్రపంచీకరణ)*

ఇరవై ఏళ్ల క్రితం అద్దేపల్లి ప్రభు వ్రాసిన ఈ కవితలో వస్తువు ప్రపంచీకరణ. ప్రపంచీకరణ దుష్ప్రభావాలను ఇంకా పూర్తిగా అవగాహనకు రాని సమయంలోనే వ్రాసిన కవిత ఇది. ఇందులో ప్రపంచీకరణను దేవుని అవతారంగా చెపుతాడు కవి. ఒకప్పుడు ఇంగ్లాడు రూపంలో వచ్చింది, ఇప్పుడు అమెరికా రూపంలో

వస్తోంది అంటాడు. కరుణించటం, లీలగ్రహించటం, సాక్షాత్కరించటం, నామ స్మరణ వంటి ప్రయోగాలు మత పరిభాషగా అనిపించినా వాటి వాచ్యార్ధాలకు వ్యతిరేకార్ధలను ఇస్తాయి కవితలో. అదే ఐరనీ. ప్రపంచీకరణకు లొంగిపోవటం వల్ల విచ్ఛిన్నమౌతున్న మానవవిలువలు, పరాయీకరణల పట్ల కవికి కలిగిన కోపంలోంచి పుట్టుకొచ్చిన ఐరనీ ఇది. సమకాలీన సమాజపోకడపై సంధించిన గొప్ప వక్రోక్తి.

//వరదల్లో నిశానై తేలింది మా గుడెసె
ఉన్న రెండు సత్తు గిన్నెల్ని
తుఫాను జప్తు చేసుకుంది

అయ్యను వెతుకుతూ అమ్మ గుండె
తెప్పలా తేలిపోయింది నీటి మీద
నిలువెత్తు నీళ్లనించి
కట్టుబట్టలతో మళ్ళీ ఏ గట్టుకో పయనమవుతుంటే
అంచనా బృందమొకటి అమ్మను అడుగుతుంది
నష్టపరిహారానికేమో.
"మీకు ఏమైనా భూములున్నాయా' అని
"లేదు సముద్రముంది" అమ్మ అమాయకంగా

(గంగమ్మ - ఎం. వెంకట్)

భయంకరమైన తుఫానులో సర్వస్వంతో పాటూ భర్తను కూడా కోల్పోయిన, బెస్తకులానికి చెందిన ఒక తల్లి వేదనను అద్భుతంగా పట్టుకొన్న కవితలోని కొన్ని వాక్యాలవి.

పై కవితలో "లేదు సముద్రముంది" అన్న వాక్యం గొప్ప ఐరానికల్ వాక్యం. "సముద్రం ఉంది" అనటం ద్వారా "ఏమీ లేదు" అని చెపుతున్నాడు కవి. ఈ సందర్భంలో వాడిన ఐరనీలో వెటకారం లేదు, ధిక్కారం లేదు, కోపం లేదు.... ఉన్నదల్లా వరదై పొంగిన నిస్సహాయ స్థితి. తెలుగు సాహిత్యంలో నిస్సహాయ స్థితిని గొప్పగా ఆవిష్కరించిన వాక్యాలు ఓ పది ఎంచితే, ఎం. వెంకట్ వ్రాసిన పై వాక్యం ముందు వరుసలో ఉంటుంది. అంతటి పదునైన అభివ్యక్తికి

ఐరనీ టెక్నిక్ దోహదపడింది.

చెలీ! నిజం చెప్పు!
అందరికీ ఇలానే జరుగుతుందా?
మగడు దూరదేశమేగినపుడు
భార్య గాజులు పెద్దవవుతాయా? (453)

పై సప్తశతి గాథలో ఒక రమణీయమైన భావన ఐరనీ వల్ల మరింత చిక్కబడింది. భర్త దూరదేశం వెళ్ళినపుడు, అతని భార్య ప్రేమతో బెంగపెట్టుకొని చిక్కిపోవటాన్ని చమత్కారంగా చెప్పాడా ప్రాచీనకవి. పై గాథలో గాజులు పెద్దవి అయ్యాయి అని పైకి చెపుతున్నప్పటికీ, వాస్తవానికి ఆమె చేతులు చిక్కిపోయి సన్నబడ్డాయి అని అర్థం చేసుకోవాలి. పైకి ఒక భావము, అంతర్లీనంగా దానికి వ్యతిరేకభావాన్ని కలిగిఉండి పై గాధ ఐరనీకి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.

భయ్యా!…Diversity ఎక్కడ!!

జీవవైవిధ్య సదస్సు ముగిసింది.
ఇక కాగితాలపై అభయారణ్యాలు పెరుగుతాయి

ప్రపంచ ప్రతినిధులారా!
విమానాలెక్కండి.. సురక్షితం మీ ప్రయాణం
దేగల్లేవిక్కడ.. మాది దేగలేని దేశం

అంతర్జాతీయ జలచరాల్లారా!.. సీ హార్స్ లూ!!
ఆక్వేరియంల అద్దాల్లోంచి నేరుగా మీరు మా కడుపుల్లోకే.

ఔషద మొక్కలూ ఎదగాలి మీరు
విత్తన వ్యాపారమా!
సౌందర్య వర్తకమా ! వర్థిల్లు !వర్థిల్లు !// (యశస్వి సతీష్)

హైదరాబాద్‌లో అంతర్జాతీయ జీవ వైవిధ్యసదస్సు జరిగిన సందర్భంలో

వ్రాసిన కవిత ఇది. సదస్సు ముగిసింది వన్యప్రాణుల సంరక్షణ పేరుతో ఇకపై నాయకులు రెచ్చిపోయి కాగితాలపై నిధులు ఖర్చుచేస్తారు –మీ విమానాల ప్రొపెల్లరులో పడి ప్రమాదం కలిగించటానికి ఇక్కడ డేగలు ఉండవు (మేము వాటిని అంతరింపచేసేసాం) కనుక మీ ప్రయాణం సురక్షితం– ప్రదర్శనకు పెట్టిన జీవరాశులన్నీ సదస్సు అయిపోయింది కనుక ఆహారంగా మారతాయి–అరుదైన మొక్కల్లారా మీరు ఎదిగి మా వ్యాపారాలు పెంచండి – లాంటి వ్యక్తీకరణల్లో అద్భుతమైన ఐరనీ ఉంది.

కొన్ని అర్హతలేని పొగడ్తలలో ఒక్కోసారి ఐరనీ దాక్కొని ఉండొచ్చు. ఉదాహరణకు– తిరుపతి వెంకట కవులు వ్రాసిన కృష్ణరాయబార నాటకంలో శ్రీకృష్ణుడు దుర్యోధనుడితో పలికిన ఒక పద్యంలో "సంతోషమ్మున సంధి సేయుదురే" అని పదే పదే అనటంలో ఐరనీ దాగి ఉంది. ఇది షేక్స్పియర్ వ్రాసిన జూలియస్ సీజర్ నాటకంలో, మార్క్ ఆంటోని పదే పదే పలికిన క్లాసికల్ ఐరానికల్ వాక్యం "Brutus is an honourable man" తో పోల్చదగినది.

చాటువులలో ఎక్కువగా ఐరనీ ఉంటుంది. తనపై ఏదైనా ఒక పద్యం చెప్పమని తిరుమల రాయలు అడగగా రామకృష్ణ కవి ఈ పద్యం చెప్పాడట.

అన్నాతి గూడ హరుడవె
అన్నాతిని గూడనప్పుడసురగురుడవే!
అన్నా తిరుమలరాయా
కన్నొక్కటి కలదు కాని కౌరవపతివే!

పై చాటువులో ఆ రాజుని పొగుడుతున్నట్లు కనిపించినా అంతర్లీనంగా ఆ రాజుకు ఒక కన్ను మాత్రమే ఉన్న విషయాన్ని ఐరానికల్‌గా చెపుతున్నాడు కవి.

భార్యతో ఉన్నపుడు ముక్కంటి అయిన శివుడవు (ఇతని ఒక కన్ను, భార్య రెండు కళ్ళు కలిపి), భార్యతో లేనపుడు అసురగురుడవు (శుక్రాచార్యునికి ఒక కన్నే), కన్ను ఒకటి ఉండింది కానీ లేకపోతే ధృతరాష్ట్రుడివే (గుడ్డివాడు) – అన్న పోలికల ద్వారా గొప్ప ఐరనీ పలికిందీ పద్యంలో.

సార్కాజం (Sarcasm) సెటైర్ (Satire) లు ఐరనీకి దగ్గరగా ఉండే

భావాలు. ఐరనీలో రెండు పరస్పర వ్యతిరేక అర్థాలు కలిగిన భావాలు ఉంటాయి. సార్కాజం లేదా సెటైర్ లలో నేరుగా ఒకటే అర్థం ఉంటుంది అది వెటకారం లేదా హేళన. సార్కాజంలో తీవ్రమైన హేళన ఉంటుంది. సెటైర్‌లో అంత తీవ్రత ఉండదు. ఎత్తిపొడుపు మాత్రమే కనిపిస్తుంది. వీటిలో ఉండే హాస్యం, చమత్కారాల వల్ల ఎక్కువమందిని ఆకర్షిస్తాయి.

సార్కాజం కత్తివాదర వంటిది. లోతుగా తెగుతుంది. గాయపరుస్తుంది. కలహాలకు కూడా దారితీయవచ్చు.

సంపాదకుడంటే
నాకింపారగ భక్తిగలదు
ఎంచేతనగా సంపూర్ణ మనుజుడాతడు
చింపాంజీ కన్నా నయము సిరిసిరిమువ్వా *(శ్రీశ్రీ)*

ఎవరిని ఉద్దేశించి శ్రీశ్రీ పై పద్యం రాసారో తెలియదు కానీ సంపాదకులపై తనకున్న అక్కసునంతా భగభగలాడే సార్కాజంతో వెళ్లకక్కాడు. మూడో పాదం వరకూ మంచిగానే ఉంటుంది పై పద్యం. చివరి పాదంలో ఊహించని మలుపుతీసుకొని అర్థం మొత్తం మారిపోతుంది.

చలం రచనల్లో సార్కాజం చాలా విస్తారంగా కనిపిస్తుంది. మ్యూజింగ్స్ లో ఒక చోట "కొత్తగా వచ్చిన ఆఫీసరు మొఖాన్ని ఎక్కడో చూసినట్టే ఉంది, ఎక్కడ చూసానో గుర్తుకు రాక వారంరోజులుగా ఆలోచిస్తూంటే – రోడ్డుపై నడుస్తోన్న ఒంటెను చూడగానే హఠాత్తుగా స్ఫురించింది" అంటాడు. ఈ వాక్యాన్ని ఆ ఆఫీసరు చదువుకొని ఉంటే ఎంత కుమిలిపోయి ఉండేవాడో అనిపించక మానదు. సార్కాజం వాదర అది.

సార్కాజం లా గాయపరచకపోయినా సెటైర్ కూడా శక్తివంతమైన వ్యంగ్యమే.

బెర్నార్డ్ షా తన నాటకం యొక్క మొదటి ప్రదర్శన టిక్కట్లను విన్ స్టన్ చర్చిల్ కు పంపుతూ "నాటక ప్రదర్శనకు రెండు టికెట్లు పంపుతున్నాను – ఒకటి నీకు, రెండవది నీకు ఎవరైనా స్నేహితులుంటే వారికి" అన్నాట్ట

దానికి విన్ స్టన్ చర్చిల్ సమాధానమిస్తూ

"మొదటి ప్రదర్శనకు రాలేను, రెండో ప్రదర్శనకు వస్తాను –ఉంటే గింటే" అన్నాట్ట.

రెండు వాక్యాలు సెటైర్ కు గొప్ప ఉదాహరణలు. నీలాంటి వాడికి స్నేహితులంటూ ఎవరూ ఉండరు అంటూ బెర్జార్డ్ షా దెప్పిపొడవగా, నీ నాటకానికి రెండో ప్రదర్శనే ఉండదు అని చర్చిల్ వెటకారం ఆడటం చక్కని చతురత.

చిన్నమ్మా
వీళ్లందరూ తోకలు తెగిన ఎలుకలు
కలుగుల్లోంచి బయటకు రాలేరు
లోపల్లోపలే తిరుగుతారు
మౌఢ్యంవల్ల బలాఢ్యులు
అవివేకం వల్ల అవినాశులు
వీళ్ళందరూ మధ్య తరగతి ప్రజలు
సంఘపు కట్టుబాట్లకు రక్షక భటులు (నీడలు – తిలక్)

మధ్యతరగతి మనుషుల చేతకానితనాన్ని, ఎదిరించలేని తత్వాన్ని, వేదాంత ధోరణిని తిలక్ సెటైరికల్ గా కవిత్వీకరించాడు పై కవితలో. ఈ హేళన పాఠకుని ఈగోని గిచ్చుతుంది. అబ్బే అలాంటిదేం లేదు, సందర్భం వచ్చినపుడు నేను ఎదురుతిరుగుతాను అని సమాధాన పడేలా చేస్తుంది. కవికి కావలసింది అదే. అది సాధించటం కొరకే సెటైర్ అనే కవిత్వ పనిముట్టుని ఎంచుకొన్నాడు.

ఇన్నాళ్ళూ
ఎడ్లతో వెళ్లాం, నాగళ్ళతో వెళ్ళాం, కొడవళ్లతో వెళ్ళాం
ఎరువుల్తో విత్తనాల్తో మందుల్తో మట్టి చేతుల్తో వెళ్ళాం

ఇవాళ మాత్రం
తాళాల్తో వెళ్ళాం. గోడల్లేని మా పొలాలకు తాళాలేసి వొచ్చాం//
మా బతుకు తలుపులు ఒకటికటిగా మూసుకుపోతుంటే
పొలాలను మాత్రం ఎలా తెరిచిఉంచగలం?

(పొలాలకు తాళాలేసాం - దర్భశయనం శ్రీనివాసాచార్య)

గిట్టుబాటు కాని వ్యవసాయం, నెత్తి నోరు బాదుకొని మొరపెట్టుకొన్నా స్పందించని ప్రభుత్వం, ఆత్మహత్యలతో నిరసనలు తెలిపినా పట్టించుకోని వైనం –వంటి అంశాలను స్పృశిస్తూ వ్రాసిన కవిత ఇది.

మొత్తం కవితకు ఆయువుపట్టైన "పొలాలకు తాళాలెయ్యటం" అన్న వాక్యం, ఆ తరువాత వచ్చే లోతైన ప్రశ్న చక్కని సెటైర్, అద్భుతమైన ఎత్తిపొడుపు. ఒక నిస్సహాయ స్థితిని ని ఆవిష్కరించటానికి వ్యంగ్యాన్ని ఆశ్రయించాడు కవి. తద్వారా ఇకపై మేము వ్యవసాయం చేయం అన్న అర్థాన్ని ధ్వనింపచేసాడు. చాలా ఉ దాత్తమైన ప్రయోగం ఇది. సెటైర్ ద్వారా కవితకు అద్భుతమైన లోతు వచ్చింది.

దిగంబర కవిత్వంలో ఐరనీ, సెటైర్, సార్కాజం శతసహస్రబాహువులతో దర్శనమిస్తుంది. అందుకే ఎప్పుడు చదివినా ఉలిక్కిపడేలా చేస్తుంది.

అన్నా భయపడకు
కరువు భత్యం పెరుగుతుంది
కొండచిలువ నోట్లోకి ఈగ పిల్ల దూరుతుంది
నీ జీవితం చిరిగిపోయిన చొక్కాకి కొత్త మాసిక వేసుకోవచ్చు
అర్థాంగి కళ్లలో అరక్షణం కాంతులు నింపొచ్చు
ఒక్కసారి ప్రస్తుతాన్ని వదిలి భావికేసి ఆకాశంలో నక్షత్రాలకేసి
ఆశ కేసి
ఆశగా చూడొచ్చు// (కరువు బియ్యం - భైరవయ్య)

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వోద్యోగులకు కరువు భత్యం ప్రకటించి ఆ మేరకు జీతం పెంచుతుంది ప్రభుత్వం. అలా పెరిగే కరువు భత్యం పెరిగిన ధరలకు ఏ మాత్రం సరితూగదని – అది జీవితమనే కొండచిలువ నోట్లోకి దూరే ఈగ లాంటిదని, చొక్కాకి కొత్తమాసిక అని, నీలోని ఆశను చచ్చిపోకుండా బ్రతికించటానికి తప్ప ఎందుకూ పనికిరానిదని– సెటైరికల్‌గా చెప్తారు భైరవయ్య.

కోడిపుంజుల్ని
కోసుకు తినేశారు మా వూరి వాళ్ళు

ఇక తెల్లారకట్ట రైలు మిగిలింది (ఇస్మాయిల్-హైకూ)

నగరజీవనంపై వదిలిన పదునైన సార్కాజం ఇది. కోడికూతతో రోజు మొదలయిందనటం ఒకనాటి కవిసమయం. పట్టణాల్లో కోడిపుంజుల కూతలు ఉండవు. కోళ్లు పెరిగే జాగాయే ఉండదు పట్టణాల్లో. దాన్నే కొడిపుంజుల్ని కోసుకుతినటం అంటున్నాడు కవి. ఉదయమైందని చెప్పటానికి నగరానికి ఇక తెల్లారకట్ట రైలు మాత్రమే మిగిలుందట పాపం. ఇది నేటి కవిసమయం.

*****

కవిత్వంలో Situational Irony ఎక్కువగా కనిపిస్తుంది. కవిచెపుతున్న సందర్భంలోని ఉద్వేగాన్ని ఇది గాఢపరుస్తుంది. పాఠకుని ఊహను తారుమారు చేసి, కవితను ఊహించని మలుపు తిప్పుతుంది. రెండు పరస్పర విరుద్ధ అభిప్రాయాలను వ్యక్తీకరించటానికి ఐరనీ ఉపయోగపడుతుంది. ధిక్కారం వినిపించటానికి, దుఃఖభరిత సందర్భాలను సాంద్రపరచటానికి ఐరనీ ఒక సమర్థవంతమైన పనిముట్టు.

పారడాక్స్, ఆక్సిమొరాన్ Paradox, oxymoron

పరస్పరవ్యతిరేక అర్థాలు కలిగిన రెండు భావాల్ని కలిపి చెప్పటాన్ని పారడాక్స్ అంటారు. భయం తెలిసినవాడే నిజమైన వీరుడు, చనిపోవటం కొరకు బ్రతకితీరాలి, కనిపించనివాటిని చూసే కళే దృష్టి, విడిపోయి కలిసిఉందాం, భిన్నత్వంలో ఏకత్వం- వంటి వాక్యాలు పారడాక్స్‌కు కొన్ని ఉదాహరణలు.

పరస్పర వ్యతిరేక అర్థాలు కలిగిన రెండు పదాల్ని కలిపి చెప్పటాన్ని ఆక్సి మొరాన్ అంటారు. తెలివైన మూర్ఖుడు, బహిరంగ రహస్యం, ఒరిజినల్ కాపీ, శాంతి దళం, విషాదమోహనం, భయదసౌందర్యం మొదలైనవి కొన్ని ఉదాహరణలు. ఆక్సిమొరాన్ కూడా ఒకరకమైన పారడాక్సే. అందుకే దీనిని సంక్షిప్త పారడాక్స్ (compact Paradox) అనికూడా అంటారు.

వేమన ఆనాటి సమాజపోకడలను తన పద్యాలలో బంధించాడు. అతను సంధించిన కొన్ని ప్రశ్నలు నేటికీ ప్రాసంగితను కోల్పోలేదు. వేమనపద్యాలలోని సామాజికత అతని నిశితదృష్టికి, కుశాగ్ర బుద్ధికి నిదర్శనం. వేమన అనేక పద్యాలలో పారడాక్స్ ను చక్కగా ఉపయోగించుకొని సంధించిన ప్రశ్నలు మనల్ని కలవరపెట్టి ఆలోచింపచేస్తాయి.

విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి
సతి పతులను గూర్చి సమ్మతమున
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా ?

పై పద్యంలో, వేదమంత్రాల నడుమ, మంచి ముహూర్తములో పెండ్లి చేస్తే అంతా బాగుండాలి కానీ పెళ్ళికూతురికి వైధవ్యం ఎందుకొచ్చింది అంటూ రెండు

పరస్పరవైరుధ్య అంశాలను ప్రస్తావిస్తూ ప్రశ్నించటం ఒక పారడాక్స్.

చాన్నాళ్లక్రితం కాకినాడ, పి.జి. సెంటర్‌లో ప్రముఖ కవి శ్రీ గోదావరి శర్మ ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసేవారు. "గోదావరి గలగలలు" ఆయన కవిత్వసంపుటి పేరు. పిన్నవయసులోనే యాక్సిడెంటులో చనిపోయారు. ఒకరోజు ఆయన పాఠం చెపుతున్నప్పుడు, క్లాసంతా పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో ఉంది. ఉన్నట్టుండి ఒక కోయిల దూరంనుంచి "కూ" అంటూ కూయటంతో విద్యార్థులందరూ కిటికీ వైపు చూస్తూంటే, కొద్దిసేపు పాఠం నిలిపివేసి మరలా కొనసాగించారట ఆయన. ఇదే తంతు మళ్ళీ కాసేపటికే జరిగినపుడు ఆయన "స్వీట్ డిస్ట్రబెన్స్ కదూ" అన్నార్ట. డిస్ట్రబెన్స్ స్వీట్‌గా ఉండదు. చికాకు కలిగిస్తుంది. అదే విధంగా స్వీట్ గా ఉండేది ఇష్టమైనది అవుతుంది తప్ప డిస్ట్రబెన్స్ అవ్వదు. రెండు పదాలు పరస్పర వైరుద్యాలు. అయినప్పటికీ ఆ సందర్భంలో కోయిల గానం క్లాసును డిస్ట్రబ్ చేస్తున్నా ఆ ఇబ్బంది తీయగానే ఉంది అన్న ఒక కొత్త అర్ధం సంతరించుకొంది. ఇది ఆక్సిమోరాన్‌కు చక్కని ఉదాహరణ.

పారడాక్స్ లో తర్కం ఉంటుంది. ఆక్సిమోరాన్‌లో పదవిన్యాసం కనిపిస్తుంది. ఇవి పాఠకునికి విభ్రమ కలిగిస్తాయి. పారడాక్స్, ఆక్సిమోరాన్ లు సృష్టించటానికి పదునైన మేధ అవసరం. మామూలు ప్రయోగాలను విచ్ఛిన్నం చేస్తే కానీ వీటిని నిర్మించలేము. ఇవి చాలా శక్తివంతమైన కవిత్వనిర్మాణ పనిముట్లు.

ఒక ప్రత్యేకమైన సందర్భంలో ఉండే వైరుధ్య లక్షణాలను వ్యక్తీకరించటానికి కవి పారడాక్స్ ను ఎంచుకొంటాడు. ఆ సందర్భములోని సంక్లిష్టతను పాఠకుడు అర్ధం చేసుకోవటానికి పారడాక్స్ సహాయపడుతుంది.

"నా ప్రియురాలు తాను సత్యానికి మారు రూపమని ప్రమాణం చేసినపుడు, నేనామెను విశ్వసిస్తాను – ఆమె అసత్యమాడుతున్నదని తెలిసినప్పటికీ" అనే షేక్స్‌పియర్ వాక్యం చాలా ప్రసిద్ధిచెందిన పారడాక్సికల్ వాక్యం. ఆమె అబద్దమాడుతున్నదని తెలిసినప్పటికీ అతను నమ్మటానికి కారణం ఆమెపై కల ప్రేమ. ఆ ప్రేమ వల్ల అబద్దాలు, నిజాలకన్నా అందంగా కనిపిస్తాయని అర్ధం చేసుకోవాలి.

నాకామూల్య మపూర్వమానంద మొసగు
నిరుపమ నితాంత దుఃఖంపు నిధులు కలవు *(కృష్ణశాస్త్రి)*
ఆనందాన్నిచ్చే దుఃఖంపునిధులు అన్న భావనే అద్భుతమైన పారడాక్స్.

చేపను గాల్లోకి ఎగరేసుకుపోవటం
ఒక దయాపూరిత చర్య అని
భావిస్తోంది పక్షి. (124 రవీంద్రుని (స్ట్రే బర్డ్స్)

పై టాగోర్ కవితా వాక్యంలో చేపను చంపితినటాన్ని దయాపూరిత చర్య అనటం పారడాక్స్. ఇతర భారతీయ భాషా కవులలో తెలుగునాట స్థిరపడిన వారిలో రవీంద్రనాథ్ టాగోర్ ముందువరుసలో ఉంటారు. గీతాంజలికి 10 కు పైగా వివిధ కవుల తెలుగు అనువాదాలు ఉన్నాయంటే, మన ముందుతరపు కవుల చూపు ఎంత విశాలమో అర్థమౌతుంది.

ఈశ్వరా
ఈక్షణమే నాకు చావునిచ్చి
తిరిగి నన్నాతోటలో
ప్రియురాలి కౌగిట్లో
మేల్కొలపవా
అది ఏ యుగాంతానికైనా సరే!

(కాలేజి మధ్యాన్నాలు – వజీర్ రెహ్మాన్)

వజీర్ రెహ్మాన్ చలం అల్లుడు. మరో ప్రముఖకవి ఇస్మాయిల్ గారి తమ్ముడు. వ్రాసినవి రెండు కవిత్వ సంపుటులైనా తెలుగుసాహిత్యంలో అనుభూతి కవిగా, కవి తాత్వికునిగా మంచి స్థానాన్ని సంపాదించుకొన్నారు. చావుని ప్రసాదించి ప్రియురాలి కౌగిట్లో మేల్కొలపమని అడగటం పరస్పర వైరుధ్యాన్ని కలిగిఉన్న వాక్యం.

బహుశా వొక వ్యక్తి మరణించిన తర్వాతనే
అతనితో సంభాషించటం మొదలు పెడతాం
వొక వ్యక్తి అంతర్ధానమైన తర్వాతనే
ఆమెను అర్థం చేసుకోవటం మొదలు పెడతాం//
మరణించిన వారిని

బతికించుకోవటమూ మొదలుపెడతాం (వొక తర్వాత డా. కెయస్ రమణ)

డా. కె.యస్ రమణగారి పై వాక్యాలలో లోతైన వేదాంతం ఇమిడిఉంది. ఉన్నప్పుడు మనిషి విలువను గుర్తించం. పోయాక జ్ఞాపకాలలో ఆ వ్యక్తి సజీవంగా బతకటం మొదలౌతుంది. మనిషి జీవితంలో ఇదొక గొప్ప పారడాక్స్.

అప్పుడప్పుడు
కనుకొలుకుల్లో
నిప్పుకణిక ఉబుకుతుంది
ఎప్పుడూ
శరీరాన్ని చుట్టేస్తూ
జడివాన కాలుస్తుంటుంది" *(ఎదురుచూపు -నారాయణ స్వామి)*

సమకాలీన కవులలో నారాయణ స్వామి కవిత్వం మట్టిపరిమళాలను అద్దుకొని, ఆర్ద్రత నిండిన జీవనానుభవాలను కలిగిఉంటుంది. వాక్యం లలితంగా, భావం తాత్వికంగా, అనుభూతి గుండెను కదిలించేదిగా ఉండటం నారాయణ స్వామి కవిత్వరీతి.

'దిగంతానికి అవతలిపక్క నువ్వు ఇవతలి పక్కనేను// ఎండిన కన్నీటి గీతకు అటువైపునువ్వు ఇటువైపు నేను" అనే అత్యంతబలమైన ఇమేజెస్ తో నిర్మించిన "ఎదురుచూపు" అన్న కవితకు ప్రారంభవాక్యాలవి. సుదూరంగా ఉన్న నేస్తాన్ని తలచుకోవటం ఈ కవితా వస్తువు.

కనుకొలకుల్లో సాధారణంగా అశ్రుబిందువు ఉబుకుతుంది, కానీ కవి ఇక్కడ నిప్పుకణిక అంటున్నాడు ఇదొక పారడాక్స్. జడి వాన కాలుస్తుంది అంటున్నాడు ఇది మరో పారడాక్స్.

కవిత మొదట్లో వచ్చిన రెండు పారడాక్స్ లు మొత్తం కవితకు దిక్సూచిలా నిలుస్తాయి. నిన్నుతలచుకొన్నప్పుడు వచ్చే కన్నీరు నిప్పై జ్వలిస్తోంది అనటం తీవ్రమైన వేదనను సూచిస్తుంది. వానను ఆనందానికే కాక శైత్యానికి, ఒంటరితనానికి, విషాదానికి, కన్నీళ్లకు కూడా ప్రతీకగా వాడతారు. జడివాన కాలుస్తుందనటం ద్వారా కవిని దహిస్తున్న ఏకాకితనం, విషాదం అద్భుతంగా వ్యక్తీకరింపబడ్డాయి. విరహ సందర్భాన్ని ఉద్దీపింపచేయటానికి కవిఎంచుకొన్న

పారడాక్స్‌లు ఎంతో దోహదపడ్డాయి.

హెచ్చార్కె కవిత్వాన్ని నేను కవిత్వం చదవటం మొదలెట్టినప్పటినుంచి చదువుతూనే ఉన్నాను. దాంట్లో ఏదో వింతైన జీర ఆకట్టుకొనేది. మూడేళ్ళ క్రితం యూట్యూబ్ లో హెచ్చార్కె గారు మిత్రులతో చేసిన అనర్ఘళ సంభాషణను చూసాను. గొప్ప కవిత్వ పాఠంలా అనిపించిందా వీడియో. "మనం పరుల కోసమూ రాస్తున్నాం, మనకోసమూ రాసుకుంటున్నాం" అన్న వాక్యం భలే పట్టుకొంది నన్ను. హెచ్చార్కె కవిత్వంలో పారడాక్స్ లు సహజంగా ఒదిగిపోయి ఉంటాయి.

"కొండ దిగితే చేను. చేనిలో ఏమీ వుండదు.
ఏమీ లేకపోవడాన్నీ ఎవరు ఎత్తుకుపోతారోననీ
కాపలా కాస్తున్న ఒక కర్రల గేటు' *(ఎవరు ఎప్పుడు ఎందుకు ఎలా)*

చాలా సరళమైన వైరుధ్యభావాల వ్యక్తీకరణ అది. ఏమీ లేకపోవటాన్ని ఎత్తుకుపోవటమే ఒక వైరుధ్యమనుకొంటే, దానికి కాపలా కాయటమనే మరో పారడాక్స్ ని ముడి వేయటం కవి ప్రతిభ.

"చీకట్లో వెలుగులకు
వెలుగులో చీకట్లకు
వలలేసే జాలర్లం' (అహం కావ్యోస్మి)

పై వాక్యాలలోని పారడాక్స్ కూడా సరళంగా ఉంటూనే లోతైన భావనను వ్యక్తీకరిస్తుంది.

మృత్యువు తన అధరాలకు
అమృతం పూసుకుంటుందా?
అది ముద్దుపెట్టుకున్న మరుక్షణం
మరో కొత్త జన్మ (ప్రాణం చప్పుడు - రామకృష్ణ శ్రీవత్స)
మృత్యువు-అమృతం, మరణం-జన్మించటం లాంటి పరస్పర
వైరుధ్యభావాలను అల్పాక్షరాలలో పొదిగి అనంతమైన తాత్వికతను
పండించటంలో పారడాక్స్ ప్రక్రియ తోడ్పడింది.

త్రిపురనేని శ్రీనివాస్ ఆధునిక తెలుగుసాహిత్యంలో గొప్ప శబ్దంతో ఉరిమిన ఉరుం. రాసింది తక్కువే అయినా నేటికీ నిలిచిపోయాడంటే అతని కవిత్వంలో వాక్యవాక్యాన పొదిగిన "పారడాక్స్" కారణం అంటే ఆశ్చర్యపోనక్కరలేదు. పారడాక్స్‌ని అతి లాఘవంగా పలికించిన ఆధునిక కవుల్లో త్రిశ్రీది అద్వితీయ స్థానం. రహస్యోద్యమంలో ప్రతీ కవితలో కనిపించే పదునుకు పారడాక్స్ ఎంతో దోహదపడింది.

త్రిశ్రీ కవిత్వంలో కనిపించే కొన్ని పారడాక్స్ అభివ్యక్తిలు .....

మృత్యువును కౌగిలించుకునైనా మాట నిలబెట్టాలి//ఉరికంబాన్ని ఉగ్రూతలూగించి అయినా ప్రాణశక్తిని తేజోమయం చేయాలి (ఎన్ కౌంటర్)

భయం ముందు నిర్భయంగా చెలరేగిపోతాను. (రహస్యోద్యమం)

హతుడే హంతకుడైన చోట హత్య నేరం కాలేదు//హతుని చేతనే హత్యలు చేయిస్తే /హంతకుడు కూడ హతమైపోతాడు కదా (ఆత్మహత్యలన్నీ హత్యలే)

కొన్ని ఎండలు వానలకు తడిశాయి (సంధ్యార్ణవం)

ఈ దేశంలో మరణించిన ప్రతివాడూ అమరవీరుడే (సంధ్యార్ణవం)

తన చీకటిని తనే వెలిగించుకున్న మామూలు మనిషి డాలీ
(సాల్విడార్ డాలీ)

మంచుబిందువు గాజుగుండె జలపాతంలో అనలవేసవి (నిశ్శబ్దం సాకారమై శబ్దాన్ని పరిమళిస్తుంది)

****

బలమైన దృష్టి, పాత పడికట్టు ప్రయోగాలను తృణీకరించే స్వభావం, కొత్తగా చూడగలగటం, భావతీవ్రతా, అసమాన ప్రతిభ, వ్యుత్పత్తులు ఉంటే తప్ప ఒక ఆక్సిమొరాన్/పారడాక్స్ ను సృష్టించలేరు. పారడాక్సెస్ లో కనిపించే తర్కం వాదనకు నిలబడకపోవచ్చు, కానీ ఇవి క్రిటికల్ థింకింగ్ ని ప్రేరేపిస్తాయి. క్రిటికల్ థింకింగ్ అనేది intellectual gratification కి దగ్గరి దారి. బలమైన చిక్కని

కాంతిని కవిత్వంలో ప్రసరింపచేసే ప్రక్రియ పారడాక్స్.

కవిత్వం ఎక్కువగా పోలికలపై ఆధారపడి నడుస్తుంది. పారడాక్స్ మాత్రం వైరుధ్యాలను ఎంచుకొంటుంది. అందుకే పారడాక్స్ ఒక మేధాపరమైన విలక్షణ ప్రక్రియ. గొప్ప పారడాక్స్ ను సృష్టించగలిగే కవి మేధాకవిగా గుర్తింపు పొందగలడు.

సంస్కృత అలంకారాలు vs ఇంగ్లీష్ ట్రోప్స్

కవిత్వ లక్షణాలను నిర్వచిస్తూ మన లాక్షణికులు అనేక సిద్ధాంతాలను చేసారు. ఆ శాస్త్రాన్ని అలంకారశాస్త్రమని అంటారు. వీరిలో భరతుడు, భామహుడు, దండి, వామనుడు, ఆనంద వర్ధనుడు, కుంతకుడు, మమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుడు వంటి వారు ప్రముఖులు. భరతుడు రెండువేల అయిదువందల సంవత్సరాల క్రితం నాటివాడు కాగా జగన్నాథుడు పదిహేడవ శాతాబ్దానికి చెందిన వాడు. భారతీయ లాక్షణికులు, ఉపమ, రూపకం, ఉత్ప్రేక్ష, శ్లేష, అతిశయోక్తి లాంటి వందకు పైగా అలంకారాలను కవిత్వంలో గుర్తించి వాటి లక్షణాలను సూత్రీకరించారు.

క్రీ.పూ నాలుగో శతాబ్దానికి చెందిన ప్లేటో నుండి పదిహేడవ శతాబ్దానికి చెందిన జాన్ హోస్కిన్స్ వరకూ అనేక మంది పండితులు పాశ్చాత్య అలంకార శాస్త్రాన్ని నిర్మించుకొంటూ వచ్చారు. పాశ్చాత్య అలంకారికులు– మెటఫర్, సిమిలి, మెటానిమీ, సినగ్డోకి, పెర్సొనిఫికేషన్, హైపర్‌బొలి, పారడాక్స్, ఆక్సిమొరాన్ వంటి వివిధ అలంకారాలను కవిత్వంలో గుర్తించారు. వీటిని ట్రోప్స్ అన్నారు.

భారతీయ, పాశ్చాత్య అలంకారాలలో ఉమ్మడిగా ఉన్నవి నాలుగు మాత్రమేనని పరిశోధకులు నిర్ధారించారు. దీనికి కారణం భారతీయ అలంకారాలు కవిత్వంలోంచి, కవిత్వం కొరకు సృష్టించుకొన్నవి కాగా పాశ్చాత్య అలంకారాలు ఎక్కువగా భాషను నిర్మించుకోవటానికి పుట్టాయి. అందుకే వాటిలో కవిత్వానికి సంబంధించిన ట్రోప్స్ 19 మాత్రమే ఉండి, వ్యాకరణ, నైఘంటిక అవసరాలకొరకు ఏర్పడినవి వందకు పైగా ఉంటాయి. (వాటిని Schemes అంటారు).

ప్రాత్య, పాశ్చాత్య అలంకారాలలో కామన్ గా ఉన్న అలంకారాలు:

1. Simile/ ఉపమ 2. Metaphor / రూపక 3. Hyperbole / అతిశయోక్తి 4. Pun/ శ్లేష. (మొదటి మూడు రకాలు మునుపటి వ్యాసాలలో ఉన్నాయి)

Pun / శ్లేషాలంకారము: ఒక శబ్దము చేత రెండర్థములు చెప్పించుకొనుట శ్లేషము.

నేను
ఫోను పట్టుకొని నవ్వుతున్నప్పుడల్లా
మా అమ్మాయి అడుగుతుంటుంది
పద్మాకర్ గారు లైనులో ఉన్నారా డాడీ అని

ఆయనెప్పుడూ లైనుమీదే వుంటారమ్మా
నేనే
అప్పుడప్పుడూ లైన్ తప్పుతుంటానని చెప్తాను
తనకెంత నమ్మకమో గానీ
నా మాటలకు
తను చిన్న చిరునవ్వునవ్వుతుంది//

(నవ్వుల డాక్టర్ – రెడ్డి రామకృష్ణ)

పై కవితలో 'లైను' అనే ఒకే పదాన్ని ఫోన్ లైను, క్రమశిక్షణ కలిగిఉండటం (లైను మీద, లైను తప్పటం) అనే రెండు సందర్భాలకు సరిపోయేలా వాడటం గమనించవచ్చు. పై ప్రయోగం పన్‌కు చక్కని ఉదాహరణ.

ఒక పదానికి కల భిన్న అర్థాలను లేదా ఒకేలా పలికే భిన్న పదాలను వాడి చమత్కారాన్ని సృష్టించటాన్ని Pun అంటారు.

A Horse is a very "stable" kind of animal అనే వాక్యంలో "stable" అన్న పదానికి గుర్రపు శాల, నిలకడ అయిన అన్న రెండు అర్థాలు ఉండటంతో Pun ఏర్పడింది.

A bicycle can't stand on its own because it is two tired. ఇక్కడ Too tired (బాగా అలసిపోయింది) two tyred (రెండు టైర్లు కలిగి

ఉంది) అనే రెండు అర్థాలు వచ్చేలా two tired అనటం వల్ల మంచి Pun అయింది.

****

క్లుప్తంగా వివిధ సంస్కృత అలంకారాలు

ఉపమ: ఆమె ముఖము చంద్రబింబము వలె ఉన్నది.

రూపకము: ఆమె ముఖము చంద్రబింబము

ప్రదీప: చంద్రబింబమే ఆమె ముఖము వలె నున్నది

సందేహ: అది ఆమె ముఖమా లేక చంద్రబింబమా

అపహ్నవ: ఇది ఆమె ముఖము కాదు చంద్రబింబం

అనన్వయ: ఆమె ముఖముతో పోల్చదగినది ఆమె ముఖం మాత్రమే

స్మరణ: చంద్రబింబాన్ని చూడగానే ఆమె ముఖము స్మరణకు వచ్చింది

భ్రాంతిమద: ఆమె ముఖాన్ని చంద్రబింబమని భ్రమించి చకోర పక్షులు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి (చకోరపక్షులు వెన్నెలను త్రాగుతాయని పూర్వకవులు వర్ణించేవారు)

ఉల్లేఖ: ఆమె ముఖాన్ని చంద్రబింబమని చకోరాలు, పద్మమని తుమ్మెదలు తలచి ఆనందిస్తున్నాయి.

ఉత్ప్రేక్ష: ఆమె ముఖము చంద్రబింబము కదా!

తుల్యయోగిత: ఆమె ముఖము ముందు, చంద్రబింబము పద్మములు ఓడిపోయాయి

దీపక: ఆమె ముఖము, చంద్రబింబము రాత్రిపూట సంతోషపెడతాయి.

వ్యతిరేక: చంద్రబింబం రాత్రిపూట మాత్రమే ప్రకాశిస్తుంది, ఆమె ముఖము నిత్యం ప్రకాశిస్తూనే ఉంటుంది.

దృష్టాంత: దివిపై చంద్రబింబము, భువిపై నీ ముఖము

ప్రతివస్తూప: పద్మాలను తుమ్మెదలు ఆనందిస్తాయి, ఆమె ముఖాన్ని చూస్తూ నేను

ఆనందిస్తాను

నిదర్శన: చంద్రబింబపు అందాలన్నీ ఆమె ముఖములోనే ఉన్నాయి

అప్రస్తుత ప్రశంస: చంద్రుడు ఆమె ముఖము ముందు వెల వెల బోయాడు

పరిణామ: ఆమె చంద్రవదనం చేత మోహాగ్ని చల్లార్చబడింది

శ్లేష: అబ్జ వదనము చుట్టూ మగతుమ్మెదలు సంచరిస్తున్నాయి. (అబ్జ అంటే పద్మము/చంద్రుడు అన్న రెండర్థాలు ఉన్నాయి. దానితో పద్మము చుట్టూ తుమ్మెదలు తిరుగుతున్నాయి అని ఒక అర్థము, ఆ చంద్రవదన వైపే మగవాళ్ళు చూస్తున్నారనే మరొక అర్థము వచ్చాయి)

వివిధ ట్రోప్స్‌లో పై ఉదాహరణను ఈ విధంగా చెప్పుకోవచ్చు

Simily: ఆమె ముఖము చంద్రబింబము వలె ఉంది

Metaphor: ఆమె ముఖము చంద్రబింబము

Metonymy: చంద్రబింబం నడుచుకొంటూ వస్తున్నది

Synecdoche: ఆమె రాకతో గదంతా "వెన్నెలతో" నిండిపోయింది.

Personification: ఆమె వదనాన్ని చూసిన చంద్రబింబం "ఈర్ష్యతో "మబ్బుల చాటుకు వెళిపోయింది.

Hyperboly: ఆమె వదనాన్ని చూసాకా ఇక చందమామను చూసేవారేరి?

Paaradox: ఆమె ముఖము చంద్రబింబంకన్నా అందంగా ఉంటుంది... నిజమే.... ఆమెలా లేనివాళ్లందరూ చచ్చిపోవాలా ఏమిటి?

Oxymoran: ఆమె చూపులు "వెన్నెల మంటలు" రేపుతున్నవి.

Irony: చంద్రునిపై మచ్చలున్నాయి కనుక సరిపోయింది లేకపోతే ప్రతి ఒక్కడూ ఆమె మొఖాన్ని చంద్రబింబంతో పోల్చేవారే.

Imegery: పదాలతో నిర్మించిన చిత్రాన్ని ఇమేజ్ లేదా పదచిత్రమని అంటారు.

ఒక ఇమేజ్ ను సృష్టించటానికి కవి పైన చెప్పిన అన్ని ట్రోప్స్ ను వాడుకోవచ్చు.

అతడామెను
"నడిచే చందమామ" అనీ
"పరచుకొన్న వెన్నెలనీ"
నిలచిపోయిన వసంతమనీ
అని వర్ణించాడు.

ఆమె కళ్లను
బటర్ ఫ్లై విప్పారిన రెక్కల ద్వయమనీ
"రెండు పున్నమిలనీ"
మిగిలిన దేహమంతా
ఆ రెండు కళ్లకూ పొడిగింపనీ అన్నాడు. *(తెలుగు మొనాలిసా)*

****

భారతీయ సాహిత్య పరిణామాన్ని ప్రధానంగా ఆరు సంప్రదాయాలుగా గుర్తించవచ్చు. అవి...

1. *రస సంప్రదాయము:* కావ్యానికి రసము ప్రధానమని ప్రచారంలోకి తీసుకువచ్చినవాడు భరతుడు. రసమనేది కావ్యానికి ఆత్మ వంటిదంటూ, శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత వంటి ఎనిమిది రకాల రసాలను భరతుడు తన నాట్యశాస్త్ర గ్రంథంలో వివరించాడు. (అభినవగుప్తుడు శాంతరసాన్ని చేర్చాడు). రసాత్మకమైనదే సాహిత్యమని రస సిద్ధాంతం చెపుతుంది.

2. అలంకార సంప్రదాయం: కావ్యానికి అలంకారములు ప్రధానమని భామహుడు సిద్ధాంతీకరించాడు. కవిత్వం స్వభావోక్తి, వక్రోక్తి అనే రెండు పద్ధతులలో చెప్పబడుతుంది. స్వభావోక్తి అంటే నిరలంకారంగా చెప్పటం. వక్రోక్తి అంటే అలంకారయుతంగా చెప్పటం. సత్యాలను ఆవిష్కరించేటపుడు స్వభావోక్తిలో చెప్పవచ్చు కానీ మిగిలిన అన్నిసందర్భాలలో మాత్రం వక్రోక్తి ఉండాలని భామహుడు తన అలంకార సిద్ధాంతం ద్వారా ప్రతిపాదించాడు.

3. రీతి సంప్రదాయం: భామహుని అలంకార సిద్ధాంతానికి, గుణాలు అనే అంశాన్ని చేర్చి వామనుడు రీతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఒక యువతికి గుణములు శోభను, ఆభరణములు అతిశయమును ఇచ్చిన విధంగా గుణములు, అలంకారాలు కావ్యాన్ని మనోహరం చేస్తాయని అంటాడు. అలాంటి అలంకార, గుణాల సమూహాన్ని రీతి అన్నాడు.

4. ధ్వని సంప్రదాయం: ఆనందవర్ధనుడు ధ్వనిని కావ్యానికి ఆత్మగా ప్రతిపాదించాడు. కవి తన కవిత్వంలో పైకి వాచ్యంగా చెప్పిన దానికన్నా చెప్పకుండా వదిలేసిన విషయాన్ని వ్యంగ్యార్థం అనీ దాన్నే ధ్వని అని ఆనందవర్ధనుడు నిర్వచించాడు. కావ్యసిద్ధాంతాలలో ధ్వని సిద్ధాంతమే ఉత్తమమైనదిగా ప్రపంచవ్యాప్తంగా నేడు అలంకారికులు గుర్తించారు.

5. వక్రోక్తి సంప్రదాయం: కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతమును అందించాడు. ఇతడు భామహుని వక్రోక్తి భావనను తీసుకొని పెంపుచేసి, "వక్రోక్తితో కూడుకొన్న హృదయాహ్లాదకరమైన రచనే కావ్యము" అన్నాడు. వక్రోక్తి అంటే అలంకారములతో, నర్మగర్భముగా చెప్పటం. దీన్నే ధ్వని అని ఆనందవర్ధనుడు అన్నాడు.

6. ఔచిత్య సంప్రదాయం: ఏది దేనికి తగి ఉంటుందో దానినే ఔచిత్యం అంటారు. కావ్యంలో ఉండే రసం, అలంకారాలు, గుణాలకు ఔచిత్యం లేకపోతే సౌందర్యం, ఆనందం కలుగదని క్షేమేంద్రుడు తన ఔచిత్య సిద్ధాంతంలో తెలిపాడు.

ఈ సందర్భములో ప్రస్తావించుకోదగిన వారిలో విశ్వనాథుడు, జగన్నాథుడు ముఖ్యమైన వారు. "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నది విశ్వనాథుడు. దోషములున్నంత మాత్రాన కావ్యం కావ్యం కాకుండా పోదని, శబ్దదోషాలు దోషాలే కాదని, రసదోషాలే దోషాలని ఇతని అభిప్రాయం. "రమణీయార్థ ప్రతిపాదక శబ్ధమే కావ్యం" అని జగన్నాథ పండితరాయలు కావ్యాన్ని నిర్వచించాడు.

****

పాశ్చాత్య సాహిత్య తత్త్వవిచారణ అరిస్టాటిల్ కాలం నుంచే మొదలయ్యింది. భారతీయ అలంకారశాస్త్రం, కావ్యాన్ని ప్రాతిపదికగా చేసుకొని సాగగా, పాశ్చాత్యవిమర్శ కవిత్వరీతులను ప్రధానంగా చర్చించింది. పాశ్చాత్య సాహిత్య

దృక్పథం ఈ క్రింది రకాలుగా కనిపిస్తుంది.

అనుకరణ సిద్ధాంతం: అరిస్టాటిల్ ది పొయెటికా అన్న గ్రంథంలో "కళ ప్రకృతిని అనుకరిస్తుందని" ప్రతిపాదించాడు.

సంప్రదాయక సాహిత్యం: ప్రాచీన సంప్రదాయాలను అనుసరించి చందస్సుకు లోబడి కవిత్వం చెప్పటం. షేక్స్ పియర్, మిల్టన్ వంటి కవులు ఈ మార్గాన్ని అనుసరించారు.

కాల్పనిక సంప్రదాయం: ఈ పద్ధతిలో షెల్లీ, కీట్స్ లాంటి కవులు, ప్రకృతి సౌందర్యాన్ని, మానవానుభూతుల్ని గొప్ప ఊహలతో కవిత్వీకరించారు.

కళా సౌందర్య సంప్రదాయం: "కళ కళ కోసమే" అన్న భావన చాలాకాలం పాశ్చాత్య సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. ఆస్కార్ వైల్డ్, కోల్రిడ్జ్ వంటి కవులు ఈ పంథాన ప్రయాణించారు.

ఆధునిక, ఆధునికానంతర కవిత్వ సంప్రదాయాలు: అభ్యుదయ, సామాజిక స్పృహ, అస్థిత్వ, మనోవైజ్ఞానిక, కథనాత్మక పద్ధతులలో వస్తున్న ప్రస్తుత కవిత్వరీతి ఇది. నెరుడా, మాయా యాంజిలో, డిలాన్ థామస్ వంటి కవుల కవిత్వం ఈ కోవకు చెందుతుంది.

****

భారతీయ, పాశ్చాత్య అలంకార శాస్త్రాలు వేరు వేరు మార్గాలలో ప్రయాణించాయి. మనవారి కృషి కావ్యాన్ని ఉన్నతీకరించుకోవటానికి దోహదపడితే, వారి దృష్టి పటిష్టమైన భాషను నిర్మించుకొనే దిశగా ప్రయాణించింది. షేక్స్పియర్ నుంచి షెల్లీ వరకు ఉన్న కవిత్వంలో సుమారు 40 వరకూ వివిధ భారతీయ అలంకారాలను గుర్తించగలిగారు పరిశోధకులు. వాటికి సమానమైన ట్రోప్స్ లేకపోవటం గమనార్హం. దీనిని బట్టి మన లాక్షణికులు ఎంత నిశితంగా కవిత్వాన్ని అధ్యయనం చేసి నిర్వచించారో అర్థమౌతుంది.

దురదృష్టవశాత్తూ 17 వ శతాబ్దం నుంచి మన అలంకారశాస్త్రం update అవ్వలేదు. పాత సంప్రదాయాలను దుడ్డుకర్రల్తో చావగొట్టి ఆధునిక కవిత్వాన్ని

నిర్మించుకొన్నాం. అదొక చారిత్రిక అవసరం కూడా. మన లాక్షణికులు ఏర్పరచిన కవిత్వ పనిముట్లు, మరీ ముఖ్యంగా శబ్దాలంకారాలు, చందస్సు వంటివి నేడు వస్తున్న ఆధునిక కవిత్వానికి పనికిరాకుండా పోయాయి. ‘ఆధునిక కవిత్వాన్ని మదింపు చేయటానికి ప్రాచీన పనిముట్లు పనికిరావు’ అని ప్రముఖ విమర్శకులు శ్రీ నారాయణ శర్మ గారు అంటారు. మనకున్న ఈ పనిముట్లను ఆధునీకరించుకో గలిగితే, సమకాలీన కవిత్వాన్ని తూకం వేయటానికి కొన్ని తూనికరాళ్ళు లభించినట్లవుతుంది.

అస్పష్టత – సంక్లిష్టత

“కవిత్వమనేది
ఆత్మలోకంలో ఇద్దరి సంభాషణ
అది
స్వగతమూ కాదు
ఊదరగొట్టే ఉపన్యాసం
అంతకంటే కాదూ”

కవిత్వం ఒక సామాజిక వ్యవహారము. నా ఆత్మతృప్తికోసం వ్రాసుకొంటాను అనటం ఒక హిపొక్రిసి. ఒక ఊహకు అక్షరరూపమివ్వగానే అది రచన అయిపోదు. దాన్ని మరొకరు చదివినప్పుడే అవుతుంది. కవికి కలిగిన ఊహను అదే స్థాయిలో పాఠకునిలో ప్రవేశపెట్టినపుడు ఏ పేచీ ఉండదు. కవిచేసిన కల్పనను పాఠకులు అందుకోలేకపోతే ఆ కవిత అస్పష్టంగా (Obscurity) ఉందని అర్థం. అలా కాక పాఠకుడి కొంత శ్రమించి అందులో ఉన్న గూఢార్థాన్ని విప్పుకొని ఆనందించినపుడు ఆ కవిత సంక్లిష్టంగా (Difficulty/Complexity) ఉందని భావించాలి.

ఒక కవిత అర్థం కాకపోవటానికి అనేక కారణాలుంటాయి. “పాఠకులే నా స్థాయికి ఎదిగి కవితను అర్థం చేసుకోవాలని” కవి కోరుకోవటం సహజమైనా అదంత మర్యాదకరమైన వాదన కాదు. తన కవిత్వంలో తనకు తెలియకుండా దొర్లిన లోపాలను పరిశీలించుకోవటం అవసరం.

స్పష్టాస్పష్టంగా ఉండటం కూడా ఒక కవిత్వ లక్షణమే అయినప్పటికీ హద్దులు దాటకుండా చూడటం కవి బాధ్యత. కొన్ని కవితలు పూర్తిగా అర్థమవ్వకపోయినా ఏదో అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించటం చేస్తాయి.

దానికి కారణం ఆ కవితలలో కవి వాడిన ట్రోప్స్ చేసే మాయ అనుకోవచ్చు.

కవి భావం పాఠకునికి అందకపోవటాన్ని అస్పష్టతగా నిర్వచించుకొన వచ్చును.

రమణీయార్థ ప్రతిపాదనే కవిత్వం అన్నారు ప్రాచీనులు. వివిధ రకాలైన శబ్ద, అర్థ కావ్యదోషాలను ప్రతిపాదించి కావ్యం రమణీయంగా, స్పష్టమైన అర్థం కలిగి ఉండేలా శాసించారు. ఆధునిక కవిత్వం ఆ శృంఖలాలను ఛేదించుకొంది. ఇది యుగధర్మం.

ఒకప్పుడు కవిత్వం ఏదో ఒక కథతో ముడిపడి ఉండేది. నేడు కవిత్వం నుండి కథ వేరుపడి స్వతంత్రంగా ప్రయాణిస్తున్నది. కవిత్వం అనేది ఒక సంపూర్ణమైన కథను కాక భావాలను, అనుభూతులను మాత్రమే వ్యక్తీకరించే సాధనంగా మారింది.

ఈ నేపథ్యంలో– జీవితం నుంచి వస్తువును తీసుకొని మూర్త వర్ణణలతో వ్రాసిన కవిత్వం సులభంగా అర్థమౌతుంది. కుందుర్తి, తిలక్, శేషేంద్రశర్మ, శిఖామణి, శివారెడ్డి, ఇస్మాయిల్ లాంటి కవులు ఆ కోవకు చెందిన కవిత్వాన్ని వ్రాసారు. అలాకాక అమూర్త/నైరూప్య భావాలద్వారా కవిత్వం చెప్పినప్పుడు భావప్రసరణలో కొంత సంక్లిష్టత ఏర్పడుతుంది. ఎందుకంటే ఇక్కడ కవి వాడే ప్రతీకలు, ఉపమానాలు, భాష, చేసే ప్రయోగాల వల్ల అభివ్యక్తి జటిలమౌతుంది. ఆరుద్ర, మో, సిద్దార్థ, ఎమ్మెస్ నాయుడు, ఎమ్మెస్ సూర్యనారాయణ, అనంతు లాంటి కవుల కవిత్వం ఈ బాపతు.

కవిత్వంలో కనిపించే అస్పష్టతను – భాషాపరమైన అస్పష్టత, వస్తుపరమైన అస్పష్టత, భావపరమైన అస్పష్టతలుగా పరిశోధకులు విభజించారు.

నువ్వు దగ్గరుంటే
కోటినక్షత్రాల వెలుగునౌతాను
నువ్వు దూరమైతే
తోకచుక్కలా నేల రాల్తాను –– అంటూ తన ప్రేయసిని గురించి వర్ణించాడో యువకవి. ఇది చదివిన పాఠకుడు అయోమయానికి గురవుతాడు ఎందుకంటే తోకచుక్కలు నేల రాలవు, ఉల్కలు రాల్తాయి. పాపం ఆ యువకవికి తోకచుక్కలకు,

ఉల్కలకు భేధం తెలియక చక్కని అనుభూతిని పాడుచేసాడు. ఇది భాషాగతమైన అస్పష్టత.

కవిత్వంలో అస్పష్టతను గురించి మాట్లాడుకొనేపుడు వేగుంట మోహన ప్రసాద్ ప్రస్తావన రాక మానదు. మో అధివాస్తవిక కవిత్వానికి చిరునామ.

రెబెకా

ప్రజాపతి ఉరుముతాడు
ఐవీ శంపాలత క్రీపర్ మెరుస్తుంది
ఇసిరిస్ వినాయకుడు చెర్లో మునుగుతాడు
కప్పు తల్లి పెళ్ళి అయిపోతుంది
బతకమ్మ పండగ చేసుకుంటాం
నీ ప్రప్రధమ అధమాధమ ప్రేయసి
చాటల్ని పంచుతుంది
కదలని అకతా నదిలో
ఆత్మకు లంగరు వేస్తాం
అక్షరం క్షయమవుతుంది
ఆత్మ శరీరమవుతుంది (రహస్తంత్రి – వేగుంట మోహన ప్రసాద్)

ఇది ఒక పూర్తి కవిత. క్రింద ఇచ్చిన ఫుట్ నోట్సులో రెబెకా అంటే Daphne Du Maurier నవల అని, ఇసిరిస్ అంటే ఇలియట్ 'వేస్ట్ లాండ్' లో ఫెర్టిలిటీ గాడ్ అని ఇంకా ఇ.ఎం.ఫార్ స్టర్ తన నవలలో ఉపయోగించిన 'కనక్ట్' థీరీ ఈ కవితలో వాడాను అని చెప్తాడు కవి. ఇవేవీ కవితను అర్ధం చేసుకోవటానికి ఏమాత్రం సహాయపడవు సరికదా మరింత క్లిష్టతరం చేస్తాయి. కవితా వస్తువు అంతుచిక్కదు. కవితమొత్తం ఒక ఆత్మాశ్రయ అంతర్ముఖత్వ మేధావితన ప్రకటనలా అనిపిస్తుంది. వస్తుపరమైన అస్పష్టతకు రెబెకా ఉదాహరణగా నిలుస్తుంది. అయినప్పటికీ కవితలో మెరిసే విభ్రమ ఆకట్టుకొంటుంది. విభ్రమను కావ్యలక్షణంగా ప్రాచీనులు గుర్తించారు. "తిక్కగా ఉన్నా కవిత్వం ఉంటే క్షమిస్తాం" అని మో గురించి ఇందుకే అన్నాడేమో చేరా.

"To be or not to be" షేక్స్పియర్ హామ్లెట్ స్వగతం లోని ప్రసిద్ధ వాక్యం.

ఒక డోలాయమాన మానసిక స్థితిని అద్భుతంగా వ్యక్తీకరిస్తుంది.

ఆలూరి బైరాగి "హామ్లెట్ స్వగతం" కవిత ఇలా మొదలౌతుంది

తీగలు త్రెంచిన తుఫాను తగ్గిన తరువాత నేడు
తెలుస్తున్నది విధ్వంసపు టడుగుజాడల రాలుటాకుల పూల మధ్య
వేసిన ప్రశ్న ఒప్పైన ప్రత్యుత్తరం తప్పేనని
ప్రత్యుత్తరం తప్పైతే వేసిన ప్రశ్న తప్పేనని
వానకు తడిసి ఎండకెండి చేరుకొన్నది నావ నేడు తీరాన్ని
పగిలి చెదిరి ఛిద్రుపలై మునిగి దూరపారాన్ని
యిప్పుడింక పగమరచిన సెగలారిన చీకటిలో
నీడల నటన బాధించదు ఇంద్రియాలను
ఆవేశం అలసటగా, చైతన్యం వేడిలేని వెలుతురుగా,
కలగా, అలగా, ఒక తీయని జలగా మారిన ఈ వేళలందు
తెలుస్తున్నది చావు బ్రతుకులిక్కడ లెక్కకు రావని
లెక్కకు వచ్చేవిచ్చట ఒక చూపని,
ఒక నవ్వని, ఒక కిరణం, ఒక పూవని,
తెలుస్తున్నది//......... అంటూ ఒక ప్రవాహగతిలో సాగిపోతుంది కవిత. తీగలు తెంచిన తుఫాను అన్న ఊహే బుద్ధికి అందదు. ఏం ప్రశ్నో, ఎవరు వేశారో అర్థం కాదు. ఒక వేళ టుబి ఆర్ నాటుబి ప్రశ్నే అనుకొన్నా ఆ ప్రశ్నెందుకు తప్పో, జవాబెందుకు తప్పవుతుందో అర్థం కాదు. నీడల నటన, అలసట చెందే ఆవేశం, వేడిలేని వెలుతురు చైతన్యం, లెక్కకు వచ్చే చూపు – లాంటి అమూర్తభావనలు కవితను అర్థం చేసుకోవటంలో అడ్డుతగుల్తాయి. మొత్తం కవితలో వేదనలాంటి అనుభూతి స్పష్టాస్పష్టంగా తెలుస్తూంటుంది తప్ప విషయం అర్థం కాదు. దీన్ని భావపరమైన అస్పష్టతగా భావించవచ్చు.

ఎమ్మెస్ నాయుడు తెలుగు సాహిత్య రంగంలో పేర్గాంచిన కవి. "ఒక వెళ్లిపోయాను" కవితా సంకలనంతో అలజడి రేపి తనని తాను నిరూపించుకొన్న భావుకుడు. 'గాలి అద్దం' ఇతని రెండవ సంపుటి. నాయుడు కవిత్వంలో అద్భుతమైన పదచిత్రాలు ఉంటాయి. ఒక మత్తులోకి లాక్కెళ్తాయి. భావం కనపడీ కనపడకుండా దోబూచులాడి నేను చెప్పేది ఇంతవరకే ఆపై నీ ఊహకు పనిపెట్టుకో అంటూ

అదృశ్యమైపోతూంటుంది.

ఆధునిక జీవితంలో ఎన్ని అసంగతాలు, మార్మికతలు, అస్పష్టతలూ ఉన్నాయో అన్నీ ఇతని కవిత్వంలో ప్రతిబింబిస్తాయి. చెప్పేది ఎంతైతె ఉంటుందో చెప్పనిదీ రెట్టింపు ఉంటుంది.

((మరల తల))

ముఖమొహ్మాటే
చలామణి గారడి
చలనం చలచలన
మరో మర
మరల తల
తాటకతై
మోహ మొహాల దడబడ
నయన ఖార్ఖానాలో మకమక
దాటని కన్నీటి పొలిమేర
ఆలోచనల పశువు
చిద్విలాస సంఘర్షణలో
దిగంబరై -- (ఎమ్మెస్ నాయుడు).

కవితా శీర్షికే తిరకాసుగా ఉంది. ఇక లోపలకు వెళితే పదాలను ఓ డబ్బాలో వేసి తిప్పి తిప్పి పేపరుపై బోర్లించినట్లు అనిపిస్తుంది.

బి.ఎస్.ఎం కుమార్ కవిత్వం మరీ అరాచకంలా అనిపిస్తుంది. అస్పష్టతకు మించిన పేరేదైనా ఉంటే సరిగ్గా సరిపోతుంది. ఆయన ఒక కవితలో కొంతభాగం ఇది. (పూర్తికవితలు కూడా ఇలానే ఉన్నాయి)

//తరగని నడకల్ని వేలాడేసిన సమయాన్ని పీలుస్తూ
రాత్రి మెల్లగా కూల్చే సంభాషణ
ఇద్దరమూ ఎదురుగానే కూర్చున్నాం
తన గాజు బిందువుల్ని నా తలమీదుగా ఒదులుతూ

అరచేతులు కలగనే కన్నీళ్లు బయటపడని రోడ్డు పగులుతూ....
(పేజి.నం: 3 నిఘాలు, వృత్తాలూ, వెల్తురారిన కళ్లు)

కుమార్ మంచి ప్రతిభాశాలి భాషాపటిమా, నూత్నపదబంధాల్ని సృష్టించగలిగే శక్తి కలిగినవాడు. అయినప్పటికీ పదానికి పదానికి పొంతన కానీ, వాక్యానికి వాక్యానికీ మధ్య ఒక క్రమం కానీ, భావానికి భావానికి మధ్య ఒక అన్వయం కానీ ఉండదు ఇతని కవిత్వంలో. ప్రముఖ విమర్శకుడు శ్రీ తమ్మినేని యదుకుల భూషణ్ అన్నట్లు "కవిత వ్రాయటం పూర్తయింది, ఇక అర్థం చేసుకోవటమే మిగిలుంది" అనుకోవాలి.

నేడు వస్తువినిమయ ధోరణులు, ఉపాధులు విచ్ఛిన్నం కావటం, జీవికకోసం వలసలు తప్పని సరి అవ్వటం, రాజకీయ అవినీతి పెచ్చరిల్లటం లాంటి సాంస్కృతిక సామాజిక మార్పులు అనేకం చోటుచేసుకోవటం వల్ల జీవనం సంక్లిష్టమైపోయింది. ఆధునిక కవులు వైయక్తికమైన తమ విరక్తిని, అసంతృప్తిని, బాధను వ్యక్తీకరించటానికి చేసే ప్రయత్నంలో జీవితంలోని అస్పష్టత కవిత్వంలోకి వచ్చి చేరింది.

కవి మానసిక సంక్షోభం, అతి ప్రతీకాత్మకత, భావాలను నియంత్రించలేక పోవటం, మితిమీరిన నైరూప్య భావచిత్రణ మొదలగునవి కవిత్వంలో అస్పష్టతకు కారణాలుగా చెప్పుకోవచ్చు.

కవిత్వంలో అవిచ్ఛిన్నత, అసంబద్ధత పోస్ట్‌మోడర్న్ లక్షణాలుగా చెపుతారు. అలాంటి కవిత్వం సామాన్య పాఠకునికి అస్పష్టంగా ఉంటుందని యువకవులు గుర్తించాలి.

***

కొంతమంది పాఠకులు కవిత్వాన్ని అర్థం చేసుకోవటానికి ఏమాత్రం ప్రయత్నం చేయరు. కవిత్వం అంటే న్యూస్ పేపర్ కథనంలా సుబోధకంగా ఉండాలని భావిస్తారు. ఇలాంటి వారికి కవితలోని 'కవిత్వభాష' అర్థం కాక ఆ కవిత అస్పష్టంగా ఉందని ఆరోపిస్తారు. నిజానికి అది అస్పష్టత కాదు సంక్లిష్టత. ఒకే కవితలో విభిన్న ఆలోచనలను, కోణాలను, సన్నివేశాలను చొప్పించటం సంక్లిష్టతకు దారి తీస్తుంది. అలాంటి కవిత్వాన్ని పొరలు పొరలుగా విప్పుకొని చదువుకొన్నప్పుడు

రససిద్ధి కలుగుతుంది. వాక్యాల మధ్య అర్థాలను వెతుక్కొని, కలుపుకొని హృదయగతం చేసుకొన్నప్పుడు ఆ కవిత తాలూకు సంపూర్ణ చిత్రం ఏర్పడుతుంది. కవి ఉద్దేశించిన భావాలు అవగతమౌతాయి. ఒక పజిల్ ను విప్పుకొన్నప్పుడు కలిగినటువంటి ఆనందం కలుగుతుంది.

ఒక కవి ఎంతో శ్రమించి కవిత్వాన్ని సృజించినపుడు, పాఠకులు కూడా కొంత శ్రమించి ఆ కవితాఫలాన్ని అందుకోవటం వారి బాధ్యత. అలాంటి పాఠకులే కవిత్వానికి సహృదయులు. ఈ ప్రక్రియలో ఒక రచనలోని మంచి చెడ్డలను విశ్లేషించే విమర్శకుల పాత్రకూడా ముఖ్యమైనది.

కవి ఊహలను అందుకోవటానికి ఒక పాఠకుడు ఏమేరకు శ్రమించాలో, చెల్లి సురేంద్రదేవ్ వ్రాసిన " ఎంగిలి బిర్యాని చేతులు" అనే కవితను ఉదాహరణగా తీసుకొని పరిశీలిద్దాం.

ఈ కవిత కావేరి జలవివాదం గురించి. దీనిలో అతని సామాజిక దృక్పథం, రాజకీయ అవగాహన, కవిత్వతత్వం స్పష్టంగా వ్యక్తమవటం గమనించవచ్చు. కర్ణాటకలో పుట్టి తమిళనాడులో ప్రవహించే కావేరి జలాల పంపకం ఇరురాష్ట్రాల మధ్య వివాదంగా మారింది. తమిళనాడు దిగువ రాష్ట్రం కనుక కర్ణాటక విడుదల చేస్తేనే నీరు పొందే పరిస్థితి. దీన్ని నేపథ్యంగా తీసుకొని వ్రాసిన ఒక కవితలో, కావేరి నదికి తమిళులకు మధ్య ఉన్న చారిత్రిక, ఐతిహాసిక అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు సురేంద్ర.

ఎంగిలి బిర్యానీ చేతులు

ఎవడో గిట్టనివాడు
మన గడ్డివాములపైన
పూరిగుడెసెల పైన
లంకచుట్ట విసిరినట్లు

ఈ రెండు రాష్ట్రాల నడుమ
ఏ ఫారిన్ సిగరెట్ చిచ్చు పెట్టిందో
బెంగుళూరు నడిబొడ్డున తగలబడిపోయిన

వాహనాల అస్తికలను పశ్చిమవాహిని లో
ఎవరు కలుపుతారో?

ఎంగిలి బిర్యానీ చేతులు అనే కవితా శీర్షిక– కావేరి వివాదం కారణంగా కర్ణాటకలో తమిళులపై జరుగుతున్న దాడులు అన్నీ రాజకీయ ప్రేరేపితమని, కవి తీసుకొన్న స్టాండ్ ని ముందే బలంగా వ్యక్తీకరిస్తుంది.

తమిళనాడులోని శ్రీరంగపట్నం వద్ద ప్రవహించే కావేరినదిని పశ్చిమ వాహిని అంటారు. దీన్ని దక్షిణ గంగగా భావించి పితృదేవతలకు తర్పణం విడువడం అనాదిగా ఆ నాటలో ఒక ఆచారం. సురేంద్ర పై కవితా వాక్యాలలో బెంగళూరులో తగులబడిన అస్తికలు తమిళులవని అన్యాపదేశంగా చెపుతున్నాడు.

చోళరాజు కంతమందు నీటి కొరకు

అగస్త్య మహర్షిని ప్రార్థిస్తే
జంభాపతి దేవత
వెనవా తీర్థ విళక్కువా...!
అంటూ స్వాగతించిన కావేరి నది...

గుర్తుచేస్తున్నాడు కవి.

తన రాజ్యంలోని ప్రజలు నీరులేక కరువులతో అల్లాడుతున్నప్పుడు కంతమాన్ అనే తమిళ చోళ రాజు తన సమకాలీనుడైన అగస్త్య మహామునిని వేడుకొన్నాడట. అపుడు అగస్త్యుడు తన కమండలం నుంచి నీరును నేలపై చల్లగా కావేరి నది ఏర్పడిందని, ఆ నదిని జంభాపతి అనే దేవత “ఈ రాజ్య ప్రజల దాహాన్ని తీర్చే కాంతిపుంజం” గా ఆహ్వానించినట్లు – ఒక తమిళ ఇతిహాసం చెపుతుంది.

పై ఖండికల ద్వారా తమిళుల సంస్కృతి, చరిత్రలలో కావేరినది ఒక భాగంగా ఎప్పటినుంచి ఉన్నదో స్పష్టపరుస్తున్నాడు కవి.

/నాడు తైత్తరీయ ఉపనిషద్ లో “అన్నం బహు కుర్వీత”

అంటూ కావేరిని కీర్తించారు

నేడు

శ్రీరంగనాథలో ఎండిన కావేరినదిని చూడు
ఇప్పటికైనా సిగ్గేస్తుందా...?

భారతీయులకు నది అంటే దైవం. ఆవిషయాన్ని మన పూర్వీకులు ఏనాడో గుర్తించి తైత్తరీయ ఉపనిషద్ లో నదీ వనరుల్ని ప్రస్తావిస్తూ – let us share, let us produce and share"అన్నారు. కానీ ఈరోజు పంచుకోవటానికి ఇన్ని యుద్ధాలా అన్న సూటి ప్రశ్న ఆలోచింపచేస్తుంది.

కర్నాటిక్ సంగీత విద్వాంసులు
త్యాగరాజు... ముత్తుస్వామి దీక్షితార్..
శ్యామశాస్త్రి
ఈ నీళ్ళు త్రాగిన వాళ్ళే//
ఎక్కడో కొడగు కనుమలలో జన్మించి
తమిళుల దాహార్తిని తీరుస్తూ
పుదుచ్చేరి తీరానా పూమ్బుహార్ లో
కావేరి బంగాళాఖాతంలో కలిసిపోతుంది

పెట్రోల్ బాంబ్స్ వేసిన ఎంగిలి బిర్యానీ చేతులకు
కనీసం ఇదైనా తెలిసిందా!
'బిలగుండ్లు' భద్రంగా ఉండాలి. /

తమిళనాట స్థిరపడిన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిలను కర్ణాటక సంగీతానికి కావేరినది అందించిన కానుకలు. వీరు కావేరిఒడ్డున నివసిస్తూ, అనేక కీర్తనలలో కావేరిని స్తుతించారు.

కావేరి నది కర్ణాటకలో పుట్టి, తమిళనాడులో ప్రవహించి, పుదుచ్చేరి వద్ద సముద్రంలో కలుస్తోన్నదనే సంగతైనా కనీసం ఈ అలజడులు చేస్తున్న వారికి తెలుసా– ఇది మూడు రాష్ట్రాల ఉమ్మడి సొత్తని ప్రశ్నిస్తున్నాడు కవి.

తమిళుల పక్షాన నిలబడి ఇంత గొప్పగా చెప్పిన కవి చివరలో కర్ణాటకకు

ఒక హెచ్చరిక కూడా చేస్తాడు “బిలగుండ్లు భద్రం గా ఉండాలి” అని.

బిలగుండ్లు అనేది కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతం. అక్కడ తమిళనాడుకు ఎంతనీరు వస్తుందో నీటిపారుదల నిపుణులు బొట్టు బొట్టు లెక్కిస్తారు. బిలగుండ్లు జోలికి వస్తే ఊరుకోమన్న హెచ్చరిక ఆఖరి వాక్యంలో ధ్వనిస్తుంది.

అనేక మంది చారిత్రిక వ్యక్తులు, సంఘటనలు, ఉటంకింపులతో కవిత రాయాలంటే ఆయా అంశాలపట్ల కవి రీసెర్చ్ చేయాలి. చదవాలి, అవగాహన పెంచుకోవాలి. తనదైన వ్యాఖ్యానం చేయగలగాలి. ఇవన్నీ పై కవితలో కనిపిస్తాయి. యధాలాపంగా చదివితే ఇలాంటి కవితలు అర్ధం కావు. అలాగని అస్పష్టత ఉ ందని కాదు. ఇది సంక్లిష్టత. కవిత్వంలో సంక్లిష్టతను విప్పుకోవాలంటే పాఠకుడు కొంచెం శ్రమించాలి. కవి స్థాయిని అందుకోవటానికి ప్రయత్నించాలి.

పై కవితలో కవిత్వాంశ ఎక్కడ ఉంది అనే అనుమానం కలగవచ్చు. కావేరి అల్లర్లను “ఎంగిలి బిర్యాని చేతులు” అనటం లోనే ఉంది. నేడు సమాజంలో ఉ ండే రాజకీయ వ్యూహాలు, ఈ సమస్య పట్ల కవికి ఉన్న దృక్పధం సూటిగా స్పష్టంగా ఆవిష్కృతమై కవితను ఊహించని ఎత్తులకు తీసుకువెళ్ళింది. మిగిలిన వాక్యాలన్నీ ఆ దృక్పధానికి రక్తమాంసాలుగా మారిపోయి గొప్ప ఉద్వేగభరితమైన అనుభవాన్ని అందిస్తాయి.

(కవిత్వంలో ఉండే సంక్లిష్టతను వివరించటానికి పై కవితను ఉదాహరణగా తీసుకొన్నాను తప్ప కవిత్వపఠనం ఇంత శ్రమతో కూడుకున్నది అని భయపెట్టటానికి కాదు. కవి ఎంతో శ్రమించి ఒక సృజన చేస్తున్నపుడు పాఠకుడు కూడా కొంత శ్రమించాల్సిన భాధ్యత ఉండాలని చెప్పటానికి మాత్రమే. అదే లేకపోతే భాషపుట్టినపుడు పుట్టిన కవిత్వం ఇంతకాలం మనగలదా?)

రాత్రి హోరున వర్షం
ఉదయం లేచి చూస్తే
ఎదురింటాయనకు రెండు మేడలు. (ఇస్మాయిల్ హైకు)

యాధాలాపంగా చదివితే వర్షానికి రెండుమేడలకు సంబంధం తెలియదు. సాధారణంగా భారీ వర్షం వచ్చినపుడు రోడ్లపై నీళ్లు నిలబడటం సహజం. అలా

నీళ్లు నిలిచినపుడు ఎదురింటాయన మేడ ఆ నీళ్లలో ప్రతింబింబంగా ఏర్పడి రెండు గా కనిపిస్తున్నదనే చక్కని ఊహను ఈ హైకూ దృశ్యమానం చేస్తుంది.

***

కొన్ని కవితలు ఒకే అర్థాన్ని కాక భిన్న అర్థాలను ఊహించుకొనేలా ఉ ంటాయి. ఆలా ఉండటాన్ని అనిర్వచనీయత (Ambiguity) అని కొందరు నిర్వచించారు. కవిత్వం ప్రధానంగా అర్థకళ. బహుళార్థాలు వచ్చేలా రాయటం కవిత్వంలో సామాన్యమే. కవిత్వాన్ని ఎలా వ్రాసినా ఇస్మాయిల్ గారు అన్నట్లు "కవిత్వం చేసే పనల్లా చదువరి మనస్సులో దీపం వెలిగించడమే. దీని వల్ల అతని అవగాహన పరిధి విస్తరిస్తుంది. తన మనస్సులో వెలిగిన దీపం వెలుతురు తన దారి తను వెతుక్కోవడానికి సహాయపడుతుంది".

మామూలు భాషవేరు కవిత్వభాష వేరు. కప్పిచెప్పేది కవిత్వం అన్నారు. కవిత్వం కొంత గూఢతను సహజంగానే కలిగిఉంటుంది. పాఠకునిలో హృదయాన్ని కదిలించగలిగే ఉద్వేగాలను/అనుభూతులను ఇవ్వగలిగితే అది మంచి కవిత్వమౌతుంది. ఈ ప్రక్రియలో కవిత అర్థమైందా లేదా అనేది కొంత అప్రస్తుతం అయినప్పటికీ అస్పష్టకవిత్వం ఉత్తమ కవిత్వమనిపించుకోదు.

కవి, ఒక భావ వాహిక, పాఠకుడు ముగ్గురూ కలిసినపుడే రచన అవుతుంది. భావాలు కవి వద్దే ఆగిపోతే దాన్ని కవిత్వం అనలేం. కవిత్వంలో అస్పష్టతకు కవిని నిందించరాదు. అస్పష్టత అనేది భావప్రసార సంబంధమైన సమస్య. ఈ అంశానికి సంబంధించి ఆధునిక కవిత్వం మరిన్ని మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉంది.

కవిత్వంలో నిరలంకారత

అలంకరించబడిన వచనాన్ని కవిత్వం అంటారు. సిమిలీ, మెటఫర్, సింబల్, మెటనిమి, పెర్సొనిఫికేషన్, అల్లిగొరి, అల్యూజన్, పారడాక్స్, ఐరనీ, హైపర్‌బొలి వంటి వివిధ అలంకారాలు కవిత్వాన్ని వచనం నుండి వేరు చేస్తాయి. వీటిని పాశ్చాత్య పరిభాషలో Tropes అంటారు.

"కవితలో ఉండే వివిధ అలంకారాలను విశ్లేషించుకొని కవితకు కనక్ట్ కావటం కన్నా ఆ కవితావాక్యాలు నేరుగా ఇచ్చే ఉద్వేగాన్ని అనుభూతి చెందటం మంచి పద్ధతి" అంటాడు ప్రముఖ జర్మన్ కవి Paul Celan. కవిత్వంలో పలికే ఉద్వేగాన్ని మెటఫర్లు, ఇమేజెరీల ద్వారా కాక నిరలంకార వాక్యాల ద్వారా చెపితే, ఆ ఉద్వేగానికి పాఠకుడు తొందరగా కనెక్ట్ అవుతాడని సెలాన్ అభిప్రాయంగా భావించవచ్చు.

ఆధునిక కవిత్వంలో నేటి జీవితపు సమస్త అంశాలు కవిత్వీకరించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో చెప్పదలచుకొన్న అంశం సూటిగా స్పష్టంగా చెప్పటానికి కొన్ని సార్లు అలంకారాలు అడ్డుతగలవచ్చు. అలంకారాలు వస్తువును మరుగున పరచి కవి పొందిన ఉద్వేగాన్ని పాఠకునికి చేరనివ్వకుండా పక్కదారి పట్టించవచ్చు. ఒక కొత్త ఆలోచననో, బరువైన సంఘటననో, బలమైన ఉద్వేగాన్నో చెప్పదలచుకొన్నప్పుడు నిరలంకారంగా చెప్పటం కూడా ఒక మంచి కవిత్వ నిర్మాణ టెక్నిక్.

ప్రాంతం వాడే దోపిడి చేస్తే
దోపిడి చేసే ప్రాంతేతరులను
దూరం దాకా తన్ని తరుముతం

ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాణంతోనే పాతర వేస్తం
దోస్తుగ ఉండే వారితొ మేమును
దోస్తే చేస్తం – ప్రాణమిస్తం// (కాళోజి)

మహాకవి కాళోజీ వ్రాసిన పై వాక్యాలలో ఒక జాతి అంతరంగం ఆవిష్కృతమైంది. నిరలంకార వచనంలా సాగే ఆ కవితలో ఒక సమాజాన్ని ఏకం చేసేటంతటి ఉద్వేగం ఉంది. ఆ ప్రాంతప్రజలందరూ ఆ వాక్యాలను వారి మనోఫలకంపై శిలాక్షరాలుగా లిఖించుకొన్నారనటానికి సాక్ష్యం, వాటిని అనేకమంది పదే పదే తమ వ్యాసాలలో కోట్ చేసుకొంటూండటమే. భావోద్వేగాలను, మానవ సంవేదనను వ్యక్తీకరించే కవిత్వానికి అలంకారాలు అవసరం లేదనటానికి మహాకవి కాళోజీ కవిత్వమే నిదర్శనంగా నిలుస్తుంది. వాక్యాలలోని అనుభూతులకు నేరుగా కనక్ట్ అవ్వటం అని Paul Celan చెప్పింది ఇలాంటి వాక్యాలగురించే.

"వాణ్ని కన్న నేరానికి
నిన్ను తూలనాడుతున్నాను క్షమించుతల్లీ.//

అచ్చం నీలాగా – నీలాగ
ఒక అమ్మా బాబుకు పుట్టిన మనిషి
అక్షరాలా మనిషేరా
వాడు మలం తిన్నాడు
ఒరేయ్ నీ ఇరవై ఒకటో శతాబ్దం
ఆదిమ యుగం నాటి
అజ్ఞానపు గుహలో దాక్కుందా?//

నీ దేవుడికి ఎయిడ్స్ సోకిందా?
ఇప్పుడు చెప్పరా
మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాను
ఒరే! లంజా కొడకా
నీ పేరు మనిషా?" (వాడే అశుద్ధ మానవుడు– శిఖామణి)

ఆలయప్రవేశం చేసినందుకు 1989 లో కర్ణాటకలో ఒక దళితుడుని కొట్టి, బలవంతంగా మనిషి మలం తినిపించారన్న సంఘటనను ఖండిస్తూ వ్రాసిన కవిత ఇది. ఇందులో ఏ రకమైన అలంకారాలు ఉండవు. పూర్తిగా వాచ్యంగా ఉ ంటుంది. అయినప్పటికీ మానవత్వం ఉన్న ప్రతిఒక్కరిని కదిలిస్తుంది. సాటిమానవునికి జరిగిన అమానుషావమానాన్ని ఈ కవిత ఎంతో ఫెరోషియస్గా ఎత్తి చూపుతుంది. సమాజంలో తన సహచరునికి జరిగిన నీచమైన అవమానం పట్ల ఆగ్రహించి ఒక సామాజిక బాధ్యతతో వ్రాసిన కవిత ఇది. ఈ కవిత పైకి క్రోధ ప్రకటనలా అనిపిస్తున్నా, అంతర్లీనంగా కరుణ, మానవతలు కనిపిస్తాయి. నిరలంకారంగా ఉన్నప్పటికీ గొప్పదిగా నిలిచిపోవటానికి కారణం కవితలో రక్తాన్ని మరిగించేలా ప్రవహించిన బలమైన ఉద్వేగం.

I Met A Genius- Charles Bukowski

ఈరోజు రైల్లో
నేనో మేధావిని కలిసాను
ఆరేళ్ళ వయసుంటుందేమో
అతను నా పక్కనే కూర్చున్నాడు
రైలు సముద్రతీరం వెంబడి వెళుతోంది
సముద్రాన్ని చూస్తూ అన్నాడతను
పెద్ద అందంగా ఏం లేదని"

అవును నిజమే కదా అనిపించింది
మొదటిసారిగా -- (చార్లెస్ బుకొవ్ స్కీ)

నిరలంకార కవిత్వాన్ని విస్తారంగా వ్రాసిన కవులలో చార్లెస్ బుకొవ్ స్కీ ఒకరు. దైనందిన సంఘటనలు, సంభాషణలు, అనుభూతులు ఇతని కవిత్వంలో కథనాత్మక రీతిలో అలవోకగా ఒదిగిపోతాయి. పై కవితలో "సముద్రం పెద్ద అందంగా ఏం లేదని అనే పిల్లగాడిని మేధావి అని అనటం" లోతైన తాత్వికతను, కొత్త దృష్టిని సూచించి ఆశ్చర్యపరుస్తుంది. కవితలో కనిపించని ఏదో మిస్టిక్నెస్ ఆకట్టుకొంటుంది. ఒక మామూలు సంఘటనను ఊహించని మలుపుకు తిప్పి

పాఠకునికి ఒక షాక్ ను కలుగచేస్తాడు కవి. నిరలంకారత వల్ల కవిత చాలా లోతుగా గుండెల్ని తాకుతుంది.

అలంకార రహితంగా వ్రాసే కవిత్వాన్ని పాశ్చాత్యదేశాలలో Spoken Word Poetry, Slam Poetry అని పిలుస్తున్నారు. స్పోకెన్ వర్డ్ కవిత్వాన్ని ఒక ఏక పాత్రాభినయం లాగా ప్రదర్శిస్తూ చదవటాన్ని అక్కడి యువతరం గొప్ప చైతన్యంతో ముందుకు తీసుకువెళుతున్నారు. కవిత్వం చదవటం అనేది ఒక Performing Art అని ప్రముఖ కవి శ్రీ శివారెడ్డి అనేక సభలలో చెప్పింది దీనిగురించే కావొచ్చు.

కవి విమర్శకులు శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు తన ఫేస్ బుక్ లో పోస్ట్ చేసిన ఒక వ్యాసంలో– అమెరికాలో ఉంటోన్న "భావన" అనే అమ్మాయి "Chopping Onions" శీర్షికతో ఇంగ్లీషులో వ్రాసిన ఒక Spoken Word Poemను అనువదించి పరిచయం చేసారు. ఆ కవితలోంచి కొన్ని వాక్యాలు ఇవి

ఉల్లిపాయలు తరుగుతున్నప్పుడు

నాకు బాగా గుర్తుంది నా చిన్నప్పుడోసారి
మా అమ్మ కేసి చూసి అడిగాను
'నువ్వేం చేస్తుంటావు?'అని
నీళ్ళకళ్ళతో చిరునవ్వి చెప్పిందామె
'నేను చేసేదంతా మామూలుగా మనుషులు పట్టించుకోనిదే
ఏమంత ముఖ్యం కానిది,
నేను ఇస్తాను, లాలిస్తాను, పోషిస్తాను
నువ్వు స్కూలునుంచి వచ్చేటప్పటికి నేనిక్కడుంటాను
నీకేదన్నా పెట్టి నీ మీదే మనసుపెట్టుకుని ఉంటానిక్కడే.'

అప్పుడు నాకు తెలీదు
ఆ కళ్ళల్లో ఆ నీళ్ళు ఉల్లిపాయలు తరిగితే వచ్చినవి కావని.//
(Chopping Onions – Bhavana)

పై కవితలో ఎక్కడా ఏ విధమైన ట్రోప్స్ కనిపించవు. పదిహేడేళ్ల అమ్మాయి ప్రపంచాన్ని ఒక స్త్రీ దృక్కోణంలో ఆవిష్కరించిన తీరు అబ్బురపరుస్తుంది. కవిత ఆద్యంతం వాడుకభాషలో సాగుతుంది. పెద్ద పెద్ద బరువైన పదాలు ఉండవు. "స్వేచ్ఛగా ఇష్టంతో కావలసిన దానిని సాధించుకోవటమే స్త్రీ సాధికారత" అన్న విషయాన్ని సూటిగా, ఏ శషభిషలు లేకుండా చెప్పటం ఈ కవితా వస్తువు. ఇదే కవితను భావన ప్రదర్శిస్తూ చదివే వీడియోని కూడా యూట్యూబ్ లో చూడవచ్చు. ఇది నేటి తరపు కవిత్వ స్వరం, నడుస్తున్న మార్గం.

సిస్టర్ అనామిక

అతని
రెండు రెక్కల్లో చేతులు ఉంచి
టాయిలెట్ సీట్ నుంచి లేపి
పళ్ళుతోమి స్నానం చేయించి
ఒళ్ళుతుడిచి బట్టలు తొడిగి
జాగ్రత్తగా నడిపించి
మంచంపై పడుకోబెట్టి
"మీ అబ్బాయి రమ్మంటున్నాడని అన్నారుగా
వెళ్ళచ్చు కదా?" అందామె
మాత్రలు వెతుకుతో

నీటిపొర నిండిన కళ్ళతో
సీలింగ్ కేసి చూస్తూ ఉండిపోయాడతను
ఫోన్ కూడా చేయటం మానుకొన్న
బబ్లూ గాడిని గుర్తుచేసినందుకు.

వయసుపైబడిన తల్లితండ్రులను దగ్గర ఉండి చూసుకోలేక నర్సుల సంరక్షణలో పట్టించుకోని కొడుకు గౌరవం కాపాడటానికి, "నన్ను వచ్చేయమంటున్నాడని" చెప్పుకొంటున్న ఒక వృద్ధతండ్రి మూగ రోదన బలమైన ఉద్వేగమై పాఠకుని హృదయాల్ని తాకుతుంది.

****

అలంకారాలు లేకుండా కూడా మంచి కవిత్వం చెప్పగలుగుతున్నప్పుడు ఇక అలంకారాల ఉపయోగం ఏమిటి అన్న ప్రశ్న ఉదయించక మానదు. ఎంతో శక్తివంతమైన కవితా వస్తువు, లోతైన కొత్త ఊహ లేదా గుండెలను బలంగా మోదగలిగేటంతటి సత్తువ కలిగిన ఉద్వేగమూ లేకపోతే నిరలంకార కవిత్వం ఉత్త వచనంగా మిగిలిపోతుంది. త్రిపురనేని శ్రీనివాస్ “వచనమై తేలిపోతావ్” అని హెచ్చరించింది అలాంటి కవిత్వం గురించే. ఉత్తవచనానికి లైన్ బ్రేక్ లు ఇచ్చినంత మాత్రాన అది ఏనాటికీ కవిత్వం కాలేదు

“నోటిమాటలు హృదయానుభవపు చిహ్నాలు కాగా, లిఖిత పదాలు నోటిమాటల చిహ్నాలు” అంటాడు అరిస్టాటిల్. హృదయానుభవం మాటలద్వారా నేరుగా వ్యక్తీకరింపబడుతుంది. ఉచ్చారణలో ఎత్తు పల్లాలు, వివిధ ఉద్వేగాలను పలికించేటపుడు స్వరంలో మార్పులు, ముఖకవళికలు, హావభావాలు –ఆ హ్రుదయానుభవాన్ని స్పష్టంగా, యధాతధంగా అందించటానికి దోహదపడతాయి. కానీ అదే ఉద్వేగాన్ని లిఖిత రూపంలో చెప్పవలసివచ్చినపుడు పదాల శక్తి సరిపోదు. భాష విఫలమౌతుంది. కవి అనుభవించిన ఉద్వేగం పాఠకునికి అదే స్థాయిలో అందదు. ఈ సందర్భంలో ఉద్వేగాలను అదే స్థాయిలో అందించటానికి అలంకారాలు ఉపయోగపడతాయి.

“నొప్పిగా ఉంది” అన్నప్పుడు ఆ చెపుతున్న వ్యక్తి ప్రవర్తన, హావభావాలు, స్వరం లోని వణుకు అన్నీ కలిసి నొప్పి తీవ్రతను అర్థం చేయిస్తాయి. కానీ అదే మాటను వ్రాసినపుడు చదివేవారికి అతని నొప్పి తీవ్రత అనుభవానికి రాదు. “భరించలేని నొప్పిగా ఉంది” అన్నప్పుడు కొంత అర్ధమౌతుంది. “సూదులతో గుచ్చినట్లు నొప్పిగా ఉంది” అన్నప్పుడు మరికొంత అనుభూతికి వస్తుంది.

“కొన్ని వందల పీతలు దేహంలో సంచరిస్తూ

డెక్కలతో ఎముకల్ని కరకరలాడిస్తున్నట్లు నొప్పిగా ఉంది” అన్నప్పుడు పాఠకుడు ఆ దృశ్యాన్ని తన మస్తిష్కంలో కల్పన చేసుకొంటాడు. దేహంలో పీతలు తిరగడం, అవి ఎముకల్ని కొరకటం అనే నూత్న ఇమేజెస్‌ను నొప్పికి మెటఫర్ చేయటం ద్వారా పాఠకునిలో నొప్పి తీవ్రతను ఉద్వేగించగలుగుతాడు కవి. కవిత్వంలో ఉద్వేగాలను పలికించటానికి ఇక్కడ మెటఫర్ సహాయపడింది. ఉ

ద్వేగాలను పలికించటానికి భాషకు కవిత్వం మినహా వేరే దారి లేదు. సమాచారం కొరకు వచనం, ఉద్వేగాలను అందించటానికి కవిత్వం అనేది అందుకనే.

****

ట్రోప్స్ లేకుండా వ్రాసిన కవిత్వంలో తీవ్రమైన ఉద్వేగమో, కొత్త ఆలోచనో లేకపోతే వచనమై సోలిపోతుంది. నిరలంకార కవిత్వమనేది ఒక ప్రమాదకరమైన పొలిమేర. తగినంత శక్తి సామర్థ్యాలు లేకుండా అక్కడకు ప్రవేశించటం కవికి కవిగా ఆత్మహత్యా సదృశం. వచనాన్ని, కవిత్వాన్ని వేరు చేసేవి అలంకారాలే అన్న అభిప్రాయం ఏర్పడింది అందుకే.

అనువాద సాహిత్యం

ప్రపంచ గతిని మార్చిన పుస్తకాలలో రెండింటిని ప్రధానంగా పేర్కొంటారు. ఒకటి బైబిల్ రెండు మార్క్స్ రచించిన దాస్ కాపిటల్. వీటిలో బైబిల్ హిబ్రూ భాషలోను, దాస్ కాపిటల్ జర్మనీ భాషలోను వ్రాయబడ్డాయి. ఈ పుస్తకాలు ప్రపంచంలోని దాదాపు అన్ని భాషలలోకి అనువదింపబడటం వల్ల అవి యావత్ మానవాళిని ప్రభావితం చేయగలిగాయి. ప్రపంచపు నడకను శాసించగలిగాయి. చరిత్రలో అనువాదాల ప్రాధాన్యత అది.

ఏ భాషయినా దానిలో సృజింపబడిన సాహిత్యం వల్ల జీవిస్తుంది, విస్తరిస్తుంది. ఈనాటికీ సంస్కృతం మృతభాష కాకుండా జీవిస్తున్నదంటే అందులో ఉన్న సాహిత్యమే కారణం. భాషావికాసం అంటే ఒకరకంగా ఆ భాషయొక్క సాహిత్యవికాసం అని విస్తృతార్థం చెప్పుకోవచ్చు.

తెలుగువారు వాదించుకోవటం అనువదించుకోవటంలో సిద్ధహస్తులని ఒక నానుడి ఉంది. అనువాదాలకు సంబంధించి ఇది ఒక రకంగా నిజమే ఎందుకంటే సాహిత్య చరిత్రను గమనిస్తే తెలుగు భాషలో అనువాదాలు తప్ప సొంతరచనలు చాలా తక్కువ అన్న విషయం తెలుస్తుంది. రెండు వేల సంవత్సరాల నాటి "గాథాసప్త శతి" నుంచీ తెలుగు భాషామూలాలు కనిపిస్తున్నప్పటికీ తెలుగు భాషా వికాసం నన్నయ మహాభారత అనువాదం తోనే మొదలయ్యింది. నన్నయాదిగా అనేక సంస్కృత కావ్యాలు తెలుగులోకి పుంఖాను పుంఖాలుగా అనువదించబడ్డాయి. ఇవి తెలుగు భాషపై ఎంతెలా ప్రభావం చూపాయంటే ఈనాడు తెలుగు భాష తన ద్రావిడమూలాల్ని కోల్పోయి మూడు వంతులు సంస్కృతపదాలతో నిండిపోయేంతగా అని చెప్పుకోకతప్పదు. అలా జరగటం కూడా భాషావికాసమనే

భావించాలి ఎందుకంటే ఆనాడు సంస్కృతం ఈనాటి ఇంగ్లీషు లాగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన భాషగా ఉండేది.

అనువాద క్రియకు అనువాదం, స్వేచ్ఛానువాదం, అనుకరణ, అనుసృజన, అనుశీలన అని రకరకాల పేర్లు ఉన్నప్పటికీ, వేటిమధ్యా నిర్దిష్టమైన విభజన రేఖలు లేవు. పాశ్చాత్యులు అనువదించటాన్ని మెటాఫ్రేజ్, పరాఫ్రేజ్ (Metaphrase, Paraphrase) అని రెండురకాలుగా విభజించారు. మెటాఫ్రేజ్ అంటే మక్కికి మక్కి అనువదించటంబీ పారాఫ్రేజ్ అంటే సారాన్ని గ్రహించి సొంతంగా తిరిగి వ్రాయటం. మంచి అనువాదకుడు ఈ రెండు విధానాలను సమపాళ్లలో మేళవించి అనువదిస్తాడు. నన్నయాదులు అలానే చేసారు.

****

భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి అనువాదాల వలన కలిగే లాభాలను సౌలభ్యంకొరకు ఈ విధంగా విభజించుకోవచ్చును. అవి

1. అనువాదాలు భిన్న సంస్కృతుల మధ్య వంతెనలు
2. అనువాదాలు మొద్దుబారిన భాషను పునరుజ్జీవింపచేస్తాయి
3. అనువాదాలు పదసంపదను పునర్నిర్మిస్తాయి
4. అనువాదాలు ప్రపంచ సాహిత్యాన్ని ప్రజల ఉమ్మడి ఆస్తిగా చేస్తాయి

అనువాదాలు భిన్న సంస్కృతుల మధ్య వంతెనలు

సాహిత్య అనువాదాలు వంతెనలుగా పనిచేసి భిన్న సంస్కృతుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించుకోవటానికి దోహదపడతాయి. మానవజాతిని కలిపిఉంచే అంతస్సూత్రాలు అనువాదాలు.

సహవాసి అనువదించిన ఏడు తరాలు (Roots-Alex Haley) చదివినపుడు మనకు పరిచయంలేని ఆఫ్రికన్ ప్రజల సంస్కృతి, జీవనవిధానాలు ఎన్నో తెలుస్తాయి. ఏడు తరాలపాటు ఆ ఆచారాలను, సంప్రదాయాలను కాపాడుకొన్న వైనం ఆశ్చర్య పరుస్తుంది, ఉద్వేగపరుస్తుంది.

క్రొవ్విడి లింగరాజు అనువదించిన అమ్మ (Mother -Maxim Gorky) నవల ద్వారా – 1917 లో రష్యన్ విప్లవం రావటానికి ముందు జరిగిన ఆర్థిక సామాజిక పరిణామాలన్నీ కనిపిస్తాయి. ఆనాటి రష్యన్ సమాజంలో సామాన్యులు పడిన కష్టాలు వారందరూ విప్లవాన్ని ఎందుకు కోరుకోవలసివచ్చిందో విపులంగా ఉంటాయి ఈ నవలలో. నవలప్రారంభంలో భయవిహ్వలితగా , సామాన్య స్త్రీగా ఉండే ఒక మాత ృమూర్తి క్రమక్రమంగా విప్లవానికి అనుకూలంగా మారి రహస్యోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొనటంబీ ఆనాటి సమాజాన్ని ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తుంది

ప్రపంచవ్యాప్తంగా ఉన్న భిన్న సంస్కృతులలోని విశేషాలను, వివిధ ప్రజల అనుభవాలను ఒకరినుంచి మరొకరికి అందించటంలో అనువాదాల పాత్ర ఎనలేనిది ఎందుకంటే ఆపనిని అనువాదాలు మాత్రమే చేయగలవు.

2. అనువాదాలు మొద్దుబారిన భాషను పునరుజ్జీవింపచేస్తాయి

శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు గారు ఒక సభలో మాట్లాడుతూ "ఒక భాష లోని పదాలు కొంతకాలానికి మొద్దుబారి పోతాయి. అప్పుడు ఏదో ఒక బయట కవిత్వం ఆ భాషలోకి ప్రవహించకపోతే ఆ భాషకు మళ్ళా యవ్వనం సంప్రాప్తించదు" అంటారు. దీనికి ఉదాహరణ ఇస్తూబీ "జర్మన్ మహాకవి గోథే ద్వారా కాళిదాసు కవిత్వం ఇంగ్లీషు రొమాంటిక్ కవులను చేరి వారిని ప్రభావితం చేసింది. అలాంటి రొమాంటిక్ కవులైన షెల్లీ, కీట్స్, వర్డ్స్ వర్త్ ల కవిత్వంనుంచి మన దేవులపల్లి కృష్ణశాస్రి ప్రేరణ పొందాడు" అంటారు.

చాలా గొప్ప పరిశీలన అది. క ృష్ణశాస్త్రి ప్రాణంపోసిన భావకవిత్వానికి పొడిగింపుగా నండూరి ఎంకి, కిన్నెరసాని పాటలు వంటివి వచ్చిచేరాయి. అనువాదాల ద్వారా భాష ప్రతీతరంలోను కొత్త మోసులెత్తుతుంది. కవిత్వం అనేది నిరంతరం ప్రవహిస్తూఉంటుంది ఒక భాషలోంచి మరొక భాషలోకి. సాహిత్యం ఒక కొత్తరూపం కోసం ఎదురుచూసినప్పుడల్లా అనువాదాలు దారిచూపుతాయి.

అనువాదకులు వివిధ భాషల మధ్య సంధానకర్తలే కాదు వివిధ భావజాలాలకు రాయబారులు కూడా.

కమ్యూనిస్ట్ మానిఫెస్టో, మార్క్స్ రచనలు చదివిన శ్రీశ్రీ ఆ బావజాలాన్ని తన కవిత్వం లో ప్రవేశపెట్టాడు. గాండ్రించు రష్యా, గర్జించు రష్యా అని కవితలల్లాడు. కమ్యూనిస్ట్ కవితల్ని అనేకం అనువదించాడు. ఈ మార్క్సిష్ట్ భావజాలం తెలుగు సాహిత్యానికి చాన్నాళ్లు ఊపిరిపోసింది. తెలుగు భాషకు విప్లవం, అదనపు విలువ, గతితార్కికత, బూర్జువా, పెట్టుబడి, తుపాకిగొట్టం వంటి పదసంపదను సమకూర్చిపెట్టింది.

ఇమేజిస్ట్ కవిత్వం, జపనీయ హైకూ తత్వాన్ని చదివిన ఇస్మాయిల్ గారు ఆ భావజాలం కలిగిన కవిత్వాలను అనువదించారు. స్వయంగా అదే బాటలో కవిత్వాన్ని సృజించారు. కవిత్వంలో ఎక్కువగా రీతి సాంప్రదాయాన్ని పాటించే తెలుగు భాషలో ధ్వని ప్రాధాన్యతను మరలా ముందుకు తెచ్చారు. వీరి మార్గం ఒక విశిష్ట సంప్రదాయంగా తెలుగుసాహిత్యంలో నిలిచిపోయింది. తెలుగు భాషను తన కవిత్వం ద్వారా శుభ్రపరచానని చెప్పుకొన్న గొప్ప ధీశాలి ఇస్మాయిల్ గారు.

యాభైల తరువాత పోస్ట్ మోడర్న్ భావనలు ప్రపంచమంతటా విస్తరించాయి. చరిత్ర నిరాకరణ, అస్తిత్వ ప్రకటన పోస్ట్ మోడర్న్ దృక్పథపు ప్రధాన అంశాలు. వీటిని ప్రధానంగా లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ కవులు అందిపుచ్చుకొన్నారు. లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ కవుల కవిత్వ తత్వాన్ని తెలుగులో శ్రీ శివారెడ్డి, శివసాగర్, వరవరరావు సిధారెడ్డి వంటి కవులు గ్రహించారు. గొప్ప కవిత్వమల్లారు. పోస్ట్ మోడర్న్ భావాల ప్రభావంతో తెలుగులో వివిధ అస్థిత్వభావజాల కవిత్వం క్రమక్రమంగా వికసించి భిన్న పాయలుగా వృద్దినొందటం ఒక చారిత్రిక పరిణామం.

నేడు ప్రపంచవ్యాప్తంగా జలాలుద్దీన్ రూమి, అత్తర్, సనాయ్, కబీర్, గాలిబ్, టాగోర్, జిబ్రాన్, అక్కమహాదేవి వంటి కవుల కవిత్వం వివిధ భాషలలోకి విస్తృతంగా అనువాదమౌతోంది. ఈరోజు అమెరికాలో రూమీ కవిత్వానికి ఉన్నంత క్రేజ్ మరే ఇతర కవిత్వానికి లేదు. దీనికి తగినట్టుగా భాషలో చాలాకాలం విస్మృతంగా ఉండిపోయిన తాత్విక పదసంపద వాడకం పెరుగుతోంది. మనకళ్ళముందు భాష తనను తాను పునర్నిర్మించుకొంటున్న అపురూప దృశ్యమిది.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ పరిణామాలను గుర్తించి తదనుగుణంగా అనువాదాలు తీసుకొని వస్తున్న మన తెలుగు అనువాదకులలో- శ్రీ దీవి

సుబ్బారావు, శ్రీ వీరభద్రుడు, శ్రీ ముకుందరామారావు, శ్రీ ఎల్. ఆర్ స్వామి, శ్రీ నాగరాజు రామాస్వామి, స్వర్గీయ శ్రీ కలేకూరి ప్రసాద్, శ్రీ దేవరాజు మహారాజు, శ్రీ నలిమెల భాస్కర్, శ్రీ జొన్నలగడ్డ పతంజలి, శ్రీమతి శాంతసుందరి, శ్రీమతి పి. సత్యవతి, శ్రీమతి వై. వసంత, శ్రీమతి సి. మృణాలిని, శ్రీమతి కాత్యాయని, డా. మైథిలి అబ్బరాజు లను ప్రముఖంగా ప్రస్తావించుకోవాలి.

3. అనువాదాలు పదసంపదను పునర్నిర్మిస్తాయి

వివిధ భాషలనుంచి చేసిన అనువాదాలు భాషలోకి కొత్తపదాలను చేర్చటం ద్వారా కాని లేదా నిరుపయోగంగా పడిఉన్న పదాలను తిరిగి పైకి తీసుకురావటం చేస్తాయి. దీని ద్వారా ఆ భాషయొక్క పదసంపద పునర్నిర్మించబడుతుంది.

ప్రాచీన యుగంలో విస్తృతంగా చేసిన సంస్క ృత అనువాదాల వల్ల తెలుగు భాషలోకి ఎన్నో సంస్కృత పదాలు వచ్చి చేరాయి. అనువాదాలు చేసేటపుడు మూలంలోని పదానికి సమానమైన పదం దొరకనప్పుడు మూలంలోని పదాన్నే యథాతథంగా వాడటం జరుగుతుంది. అలా ఒక భాషలోకి వచ్చి చేరే పదాలను “Borrowed words' అంటారు. ఇవి భాషను పరిపుష్టం చేస్తాయి. తెలుగుభాషలో సంస్క ృతం, పర్షియన్, పోర్చుగీసు ఉర్దు, హింది, ఇంగ్లీషు భాషాపదాలు వేల సంఖ్యలో చేరి వాడుకలో కలిసిపోయాయి.

అనువాదాలు చేసేటపుడు కొన్ని సందర్భాలలో ఔచిత్యం కొరకు అప్పటికి వాడుకలో లేని పదాలను వాడవలసి వస్తుంది. తద్వారా చాలాకాలంగా మరుగున పడిన ఆ పదాలు మరలా పైకి రావటం జరుగుతుంది. ఉదాహరణకుబీ ప్రముఖ కవి సచ్చిదానందన్ కవితకు చేసిన తెలుగు అనువాదంలో, ఒక చోట “కొండ దేవర, కొమ్ము బూర” అనే పదాలను వాడాడు అనువాదకుడు. అక్కడ అవితప్ప మరో పదాలు అతకవు. ఆ పదాలను ఈ మధ్యకాలంలో ఎవరూ వాడినట్లు కనిపించదు. ఆ విధంగా ఆ పదాల వాడుక మరలా పైకి తీసుకురాబడింది. ఇలా జరగక పోతే అనేక పదాలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అన్నమయ్య పాటలలోని పదాలు ఈ రోజు మనకు నిఘంటువులలో మాత్రమే కనిపించే స్థితికి కారణం వాటి వాడకం తగ్గిపోవటమే.

4. అనువాదాలు ప్రపంచ సాహిత్యాన్ని ప్రజల ఉమ్మడి ఆస్థిగా చేస్తాయి

ఈ రోజు గ్లోబలైజేషన్ ప్రభావం వల్ల సరిహద్దులు చెరిగిపోతున్నాయి. ఒక భాషలో లేదా ప్రాంతంలో చేసిన ఒక గొప్ప ఊహ కానీ సృజన కాని ఆ ప్రాంతానికో లేక భాషకో పరిమితమై ఉండిపోవటం లేదు. అనువాదాల ద్వారా ఎల్లలు దాటి ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా చేరి ప్రపంచ ప్రజలకు ఉమ్మడి ఆస్థిగా మారుతోంది.

రవీంద్రనాథ్ టాగోర్, శరత్ బాబు, ప్రేమ్ చంద్ వంటి రచయితలు తెలుగు నాట వారు తెలుగు వారా అన్నంతగా స్థిరపడ్డారంటే కారణం వారి రచనలకు చేసిన సమర్ధవంతమైన అనువాదాలే.

రూమీ, పాబ్లొ నెరుడా, ఖలీల్ జిబ్రాన్ ల కవిత్వం ప్రపంచంలోని దాదాపు అన్ని భాషలలోకి అనువదింపబడింది. ఈ రోజు నెరుడా రూమీల కవిత్వం సమస్త మానవాళి ఉమ్మడి సొత్తు. రవీంద్రుని గీతాంజలిని తెలుగులో ఎంతో మంది చేసినా చలం అనువాదం చదివినపుడు, రవీంద్రుడే స్వయంగా తెలుగులో వ్రాసాడా అనిపించక మానదు. దీనికి కారణం అనువదించేటపుడు చలం వాడిన సజీవభాష.

సాహిత్యం ప్రజల జీవితాలకు ప్రతిబింబం. ప్రపంచంలో ఉన్న భిన్నసంస్కృతుల బహుళత్వాన్ని, అనాకానేక జీవితానుభవాలను అర్ధం చేసుకోవాలంటే అనువాదాలే శరణ్యం.

తెలుగు నుంచి ఇతరభాషలలోకి ఏమేరకు అనువాదాలు వస్తున్నాయని ప్రశ్నించుకొంటే నిరాశ కలగకమానదు. తెలుగుభాషనుండి ఇంగ్లీషులోకి చేసే అనువాదాలవల్ల తెలుగు సాహిత్యం ప్రపంచ వ్యాపితమౌతుంది. దురదృష్ట వశాత్తూ తెలుగు నించి ఇంగ్లీషులోకి ప్రస్తుతం అనువాదాలు చేస్తున్న వారు మనకు తక్కువగా ఉన్నారు. వీరిలో శ్రీ వెల్చేరు నారాయణరావు, శ్రీ అల్లాడి శ్రీధర్, శ్రీ రాయప్రోలు శ్రీనివాస్, శ్రీ సి.వి.ఎల్, శ్రీమతి జయప్రభ, శ్రీ రామతీర్ధ, శ్రీమతి జగద్దాత్రి, శ్రీ నౌడూరి మూర్తి, శ్రీ సి.వి. సురేష్, శ్రీ జి. శ్రీనివాసరావు వంటి వారు ప్రముఖంగా కనిపిస్తారు. ఈ రంగంలో మరింత ఎక్కువ కృషి జరిగితే తెలుగు సాహిత్యం ప్రపంచ సాహిత్యంగా గుర్తింపు తెచ్చుకొంటుంది. ఏ సాహిత్యాన్నైనా ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళేది అనువాదకులు మాత్రమే అనేది పరమ సత్యం.

కవిత్వము – సామాజికత

కవిత్వం అనేది అక్షర రూపం దాల్చిన ఒక ఊహ, కళాత్మక వ్యక్తీకరణ. కవి ఊహల్ని భాషలోకి అనువదిస్తాడు. ఒక అనుభవమో, దృశ్యమో ఊహలలోకి జారిపోయాకా, కవి దాన్ని తిరిగి మననం చేసుకొని భాషలోకి అనువదించి ప్రాణం పోస్తాడు. దాన్ని చదివిన పాఠకుడు తిరిగి అదే అనుభూతిని పొందుతాడు లేదా దృశ్యాన్ని తన మనో ఫలకంపై పునర్నిమించుకొంటాడు. ఒక దృశ్యమో లేక సంఘటనో నేరుగా కవిత్వంగా మారదు. దానిని కవిత్వభాషలోకి మార్చినపుడు కవిత్వమౌతుంది. కవిత్వభాష పనిముట్లు కవిత్వానికి శిల్పాన్నిస్తాయి. "సాహిత్యానికి జర్నలిజానికి తేడా సాహిత్య శిల్పమే"– అంటారు బాలగోపాల్

కొన్ని కవితలను చదివినప్పుడు కళ్ళల్లో నీటిపొరలు కదలాడవచ్చు, పిడికిళ్లు బిగుసుకోవచ్చు, రోమాలు నిక్కబొడుచుకోవచ్చు, పెదవులపై చిరునవ్వు విచ్చుకోవచ్చు– ఇవన్నీ ఉద్వేగ లక్షణాలు. కవిత్వానికి ఉద్వేగాన్ని/అనుభూతి కలిగించటం ప్రధానలక్షణం. డిటెక్టివ్ కథను రెండవసారి చదివినపుడు మునుపటి థ్రిల్ కలుగదు. మంచి కథను కొంతగాప్ ఇచ్చి మరలా చదివినపుడు మునుపటి అనుభూతి కలుగవచ్చు. ఒక కవితను పదే పదే చదువుకున్నా, కొత్త కొత్త అర్ధాలు స్ఫురించి మంచి పఠనానుభవం కలుగుతుంది. అది కవిత్వం గొప్పతనం.

ఎజ్రాపౌండ్ కవిత్వాన్ని మూడురకాలుగా నిర్వచించాడు. మామూలు పదాలు ప్రత్యేక అర్థాలతో, ఇంపైన లయతో కూడి ఉద్వేగాన్ని కలిగించే కవిత్వాన్ని Melopoeia అంటాడు. 'పదండి ముందుకు ... పదండి తోసుకు' అనే శ్రీశ్రీ కవిత దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చదువరి మనోఫలకంపై ఒక దృశ్యాన్ని ఆవిష్కరింపచేసే కవిత్వాన్ని Phanopoeia అంటాడు. 'కాకులు చింతచెట్టులో నల్లగా అస్తమించాయి' అన్న ఇస్మాయిల్ వాక్యం, చదువరి మనస్సులో చీకటి

పడ్డాక పక్షులు గూళ్లకు చేరటం అనే ద ృశ్యం రూపుదిద్దుకొంటుంది. దీన్నే పౌండ్ 'ఇమేజిజం 'అన్నాడు. మెలోపోయియా, ఫానోపోయియా పద్ధతుల ద్వారా 'పదాల మధ్య 'మేధ నాట్యమాడే' విధంగా కవిత్వం చెప్పటాన్ని Logopoeia అంటాడు. ఇలాంటి కవిత్వానికి లయ, ఉద్వేగము, పదచిత్ర విన్యాసము కలగలసి ఉంటాయని పౌండ్ అభిప్రాయం. 'నిప్పులు చిమ్ముకొంటూ నింగికి నేనెగిరిపోతే......' అనే శ్రీశ్రీ కవిత ఈ రకానికి ఉదాహరణగా నిలుస్తుంది.

ప్రతికవితా ఏదో ఓ టెక్నిక్ ద్వారా నిర్మితమౌతుంది. కవికి టెక్నిక్ గురించి తెలియటం మంచిది. కానీ కవిత్వం ఉత్తటెక్నిక్ వల్ల బతకదు. టెక్నిక్ తో పాటు కవి మేళవించే రంగు రుచి వాసనల వల్ల కవిత బతుకుతుంది. అలంకార శాస్త్రం దేన్నైనా అది ఎందుకు కవిత్వమయ్యిందో విశ్లేషించగలదు తప్ప కవిత్వాన్ని తయారు చెయ్యటానికి పనికిరాదు. కవిత్వాన్ని కవే స ృష్టించాలి. దానికి ప్రతిభ, అభ్యాసం తప్ప వేరే దగ్గర దారులుండవు.

కవి ప్రపంచాన్ని ఉద్ధరించే ప్రవక్త కాదు. అందమైన కథలల్లటం, ప్రజలకు భవిష్యత్తు పట్ల వాగ్ధానాలు ఇవ్వటం, గొప్ప ఊహాలోకాల్ని స ృష్టించి ప్రజల్ని యుద్ధోన్ముఖుల్ని చేయటం అతని పనులు కావు. గడచిన శతాబ్దంలో పైవన్నీ జరిగాయి.

ప్రజల గొంతుక వినిపించేది సాహిత్యంలో మాత్రమే. రాజకీయాలు మాట్లాడని, మాట్లాడటానికి ఇష్టపడని సత్యాలను సాహిత్యం ఆవిష్కరిస్తుంది. నారాయణ బాబు, బైరాగి లాంటి వారు సమాజాన్ని ఉద్ధరించి యుటోపియాని నిర్మిస్తామని వాగ్ధానాలు చేయలేదు తమ కవిత్వంలో. యధాతధంగా సమాజాన్ని చిత్రించారు. దీనికి భిన్నంగా కొందరు కవులు ప్రవక్తలు, రక్షకులులాగ వ్యవహరించారు.

కవిత్వం అనేది సమాజాన్ని విమర్శించటానికో, మార్చేయటానికో కాదని తనలోపల రూపుదిద్దుకొనే సత్యాలను ఆవిష్కరించటమే దాని విధి అని ఆధునిక కవి గుర్తించాడు. ఆ సత్యాలు రాజకీయ, సామాజిక, మానవీయ, ప్రకృతి వంటి వివిధ అంశాలకు సంబంధించినవై ఉంటాయి. లోపలి స్వరమే కవిత్వమైనప్పుడు– ఒక జాతి ఉత్పత్తి చేసే కవిత్వం ఆ జాతి సమిష్టి స్వరంగా మారుతుంది. లేకపోతే

ఆ జాతి వెలువరించే కవిత్వం దిగుమతి చేసుకొన్న ఇమిటేషన్ సరుకుగా మిగిలిపోతుంది. ఈ ప్రక్రియలో ఆ కవి సమూహంలో ఒంటిరిగా మిగిలిపోవచ్చు. అయినప్పటికీ అతని స్వరాన్ని సాహిత్య చరిత్ర రికార్డు చేసితీరుతుంది. అలా ఇస్మాయిల్, బైరాగి వంటి కవులు నేటికీ చిరస్మరణీయులుగా ఉన్నారు. కవి అనేవాడు తాను బ్రతుకుతున్న స్థలకాలాదులకు ప్రతినిధి.

సమూహాల చర్యలను చరిత్ర లిఖిస్తుంది. వ్యక్తుల జీవితాలను, ఉద్వేగాలను, ఆలోచనలను సాహిత్యం అక్షరబద్దం చేస్తుంది. ఆ రకంగా కవికి అపరితమైన స్వేచ్ఛ ఉంటుంది. కవి తనకున్న అపరిమితమైన స్వేచ్ఛను- వ్యక్తులకో, భావజాలానికో, రాజకీయాలకో ధారాదత్తం చేయటం క్షమార్హం కాదు.

సాహిత్యం ఒక అనంతమైన నదీప్రవాహం. ఆ నదిలో కవి ఒంటరిగా ప్రయాణం చేస్తూ, మానవజాతి భౌతిక మానసిక ప్రపంచాలను అన్వేషిస్తూ, తన స్థలకాలాదుల విశేషాలను లిఖించుకొంటూ సాగిపోతాడు. ప్రతీ తరపు రచనలూ కాలక్రమేణా ఈ ప్రవాహంలో కలిసిపోయి ఆ తరం జీవించిన జీవితాలను భవిష్యతరాలకు అందిస్తాయి. కవి ఒట్టి సాక్షి మాత్రమే కాక తన ఆలోచనలను కళాత్మకంగా వెలువరించే సృష్టికర్త కూడా. భక్తికవిత్వం, భావకవిత్వం, సంస్కరణోద్యమ కవిత్వం, దిగంబరకవిత్వం, విప్లవకవిత్వం, దళితకవిత్వం వంటివి ఆకాలపు రాజకీయ సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తాయి.

మానవజాతికి రెండు చరిత్రలుంటాయి. ఒకటి యుద్ధాలతో, తారీఖులతో, రాజకీయాలతోను మరొకటి సంస్కృతిక భావాలతోను నిండి ఉంటాయి. రెండో దాన్ని కవులు రచయితలు నిర్మిస్తారు. ఒక జాతి సంస్కృతిని కాపాడుకొనే లేదా నిర్మించే ప్రక్రియలో కవులు బహిష్కరణకో, నిషేదానికో గురవటం అనాదిగా జరిగేదే! అయినా సరే వారి అవసరం జాతికి ఎంతైనా ఉంది.

సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు

కవి చేసిన సృజనలోని గుణదోష విచారణ చేయటాన్ని విమర్శ అంటారు. “పుట్టిన బిడ్డకు బొడ్డుతాడు కోసి తల్లికి ఆడ మగా అన్నది చెప్పి, స్నానం చేయించి లోకానికి చూపే మంత్రసాని లాంటి వ్యక్తి విమర్శకుడు” అంటాడు ప్రఖ్యాత విమర్శకుడు నార్త్రోప్ ఫ్రయీ. కవిత్వంలో, వస్తువు, శిల్పము వాటివల్ల కలిగిన Aesthetic Pleasure అనే మూడు అంశాలుంటాయి. వీటిని విమర్సకుడు బయటకు తీసి విశ్లేషిస్తాడు. మంచి చెడ్డలను నిర్ణయిస్తాడు.

ఒక కవి కవిత్వంలో కనిపించే ఏకసూత్రతను పట్టుకొని పాఠకులకు విప్పిచెప్పాల్సింది విమర్శకులే. అలా చేసినపుడే ఆ కవి కవిత్వానికి సాహిత్యలోకంలో ఒక చిరునామా దొరుకుతుంది. సాహిత్య చరిత్రలో ఒక పేజీ దక్కుతుంది. విమర్శకులు విశ్లేషించి చెప్పని ప్రతిభావంతులెందరో ప్రజలకు పేరుకూడా తెలియకుండా పుష్పించి, పరిమళించి, రాలిపోయిన అడవిపూవుల్లా గతించిపోయారు. నేడు సాహిత్యవ్యాసాలు ఎక్కువగా సమీక్షలకు పరిమితమైపోతున్నాయి. రచనలపై లోతైన మూల్యాంకనం చేయటం చాలా అరుదుగా జరుగుతున్నది. ఉపరితల పరామర్శ కాక లోతైన విశ్లేషణ చేసే సమకాలీన విమర్శకులలో– శ్రీ జి. లక్ష్మి నరసయ్య, శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, శ్రీ నారాయణ శర్మ, శ్రీ సౌభాగ్య, శ్రీ రెంటాల వెంకటేశ్వరరావు, శ్రీ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, శ్రీ సీతారాం, శ్రీమతి కాత్యాయని విద్మహె, శ్రీమతి వొల్గా, శ్రీ కొండ్రె డ్డి, వెంకటేశ్వర రెడ్డి, డా. రాధేయ, శ్రీ కాసుల ప్రతాపరెడ్డి, శ్రీ కె.శ్రీనివాస్, శ్రీ మాకినీడి సూర్యభాస్కర్, శ్రీ అవధానుల మణిబాబు లను ప్రస్తావించుకోవాలి.

లిటరరీ క్రిటిసిజంలో విమర్శకులు ఈ క్రింది విధాలుగా తమ ఒక రచన బాగోగులను నిర్ణయిస్తారు

చరిత్ర ఆధారిత విమర్శ: రచించబడిన కాలాన్ని, ఆనాటి సాంఘిక కట్టుబాట్లను, ప్రజల జీవన విధానాన్ని, అప్పట్లో వచ్చిన ఇతర రచనలను దృష్టిలో ఉంచుకొని ఒక రచన విలువను నిర్ణయించటం జరుగుతుంది. ఏ రచనైనా స్థలకాలాదులకు లోబడి ఉంటుందన్న స్పృహతో విమర్శ చేయటం మంచి విమర్శకుని ఉండాల్సిన ప్రాధమిక లక్షణం. అలాకాక శ్రీశ్రీ దళితుల్ని పట్టించుకోలేదు, చలం స్త్రీ ఆర్ధిక స్వాతంత్ర్యం గురించి మాట్లాడలేదు అని విమర్శించటం ఆయా రచనల చారిత్రిక స్థలకాలాదులను విస్మరించటం క్రిందే వస్తుంది.

బయోగ్రాఫికల్ విమర్శ: రచయిత కుటుంబనేపథ్యము, వంశావళి, మిత్రులు, వృత్తి, వ్యక్తిగత జీవితము లాంటి భిన్న అంశాలను పరిగణలోకి తీసుకొని అతని రచనను మదింపు చేయటం జరుగుతుంది. ఇటీవల తెలుగు సాహిత్యంలో వైదిక-నియోగ శాఖలకు చెందిన వ్యక్తుల సాహిత్యం పై వచ్చిన విమర్శ ఇలాంటిదే.

తులనాత్మక విమర్శ: ఒకే అంశంపై వివిధ రచయితల రచనలను, వివిధ భాషలలో వచ్చిన రచనలను గుణవిశేషాలను పోల్చుతూ చేసే విమర తులనాత్మక విమర్శ అంటారు. మానవ మేధస్సు ఒక అంశాన్ని ఎన్నిరకాలుగా వ్యక్తీకరించిందో ఈ విమర్శ ద్వారా తెలుస్తుంది. "తెలుగు సాహిత్యంలో పాపాయి వర్ణణలు" అనే అంశంమీద శ్రీ శిఖామణి వ్రాసిన వ్యాసం తులనాత్మక విమర్శకు చక్కని ఉ దాహరణ.

వివరణాత్మక విమర్శ: ఒక రచనలోని లక్షణాలను, లక్ష్యాలను, పద్దతులను విశ్లేసిస్తూ చేసే విమర్శ. ఇలాంటి విమర్శ కవితత్వాన్ని, అతని కవిత్వంలోని సౌందర్యాన్ని పాఠకుడు అర్ధం చేసుకోవటానికి సహాయపడుతుంది. సోమసుందర్ వ్రాసిన "కృష్ణశాస్త్రి కవితాత్మ" ఈ కోవకుచెందుతుంది. ఒక్కో సారి కవే తన కవిత్వపు మూలాల్ని, ఉద్దేసాల్ని వివరణాత్మక వ్యాఖ్య చేసుకోవచ్చు. వజీర్ రెహ్మాన్ తన 'సాహసి" కవితాసంపుటి చివర్లో "సత్తు-చిత్తు" పేరుతో ఓ పాతిక పేజీల వివరణాత్మక నోట్స్ ఇచ్చుకొన్నాడు. అది కూడా ఈ కోవకే చెందుతుంది.

ఇంప్రెషనిస్ట్ విమర్శ: ఒక రచనను చదివినపుడు విమర్శకునిలో కలిగిన వైయక్తిక ఆలోచనలను వ్యక్తీకరించటాన్ని ఇంప్రెషనిస్ట్ విమర్శ అంటారు. ఇక్కడ విమర్శకుడు రచనను మంచి చెడుల మూల్యాంకనం చేయడు. తను ఆ రచనను చదివినపుడు ఏరకంగా ఆనందించింది, ఏ వాక్యాలు నచ్చాయి, ఆ రచన తనలో

ఏ ఏ ఉద్వేగాలను కలిగించింది– అనే అంశాలను మాత్రమే స్పృశిస్తాడు. ఈ రోజు సమీక్షల పేరిట వస్తున్న వ్యాసాలు ఎక్కువగా ఈ బాపతే. దీన్నే పాఠక ప్రతిక్రియా విమర్శ అనికూడా అంటారు.

మనోవైజ్ఞానిక విమర్శ: ఫ్రాయిడ్ తన మనోవిశ్లేషణా ఆవిష్కరణల అనంతరం, కళా విమర్శలో కూడా మనో విశ్లేషణ ప్రముఖమైన పాత్రగా మారింది. మనుషుల అంతశ్చేతనావస్థలో ఉన్న వివిధ మనో వైజ్ఞానిక అంశాలను పాత్రల ప్రవర్తనకు అన్వయిస్తూ విమర్శించటాన్ని మనోవైజ్ఞానిక విమర్శ అంటారు. కథలు నవలలకు పరిధి, పాత్రల చిత్రణకు అవకాశం ఎక్కువ ఉంటుంది కనుక ఇలాంటి విమర్శ ఎక్కువగా వాటికే వచ్చాయి. తెలుగు నవలల్లో మనో విశ్లేషణ పై శ్రీమతి కాత్యాయని విద్మహే, శ్రీ కోడూరి శ్రీరామ మూర్తి మంచి విమర్శ చేసారు.

ఫెమినిస్ట్ విమర్శ: స్త్రీలు సృజించే సాహిత్యం భిన్నంగా ఉంటుందన్న వాదన బలపడటంతో, స్త్రీ సాహిత్యానికి ప్రత్యేకమైన విమర్శనా పద్దతులుండాలన్న వాదన స్థిరపడింది. స్త్రీలు శారీరికంగా, మానసికంగా, సాంస్కృతికంగా, బాషాపరంగా (పురుషాధిక్య భాషను స్త్రీలు వాడలేరు అనే ప్రాతిపదికన) పురుషుల కన్నా వేరుగా ఉంటారు. స్త్రీ, పురుషుల రచనల మధ్య కూడా ఆ తేడాలు ఉంటాయని అందరూ అంగీకరించారు. దానికి అనుగుణంగా స్త్రీ రచనలను మూల్యాంకనం చెయటానికి ప్రత్యేకమైన విమర్శనా పద్దతి ఏర్పడింది. శ్రీమతి కాత్యాయని, శ్రీమతి ఎమ్.ఎమ్. వినోదినిలు, శ్రీమతి ఓల్గాలు ఈ కోణంలోంచి విమర్శ చేస్తున్న వారిలో ముఖ్యులు

మార్క్సిస్ట్ విమర్శ: ఇరవయ్యవ శతాబ్దపు సాహిత్య విమర్శను బాగా ప్రభావితం చేసిన విమర్శనా పద్దతి ఇది. ఒక రచన యొక్క సామాజిక ప్రయోజనాన్ని, ఆ రచనలో పలికిన సామాజిక స్పృహను ఈ తరహా విమర్శ పరిగణలోకి తీసుకొంటుంది. ఏ రచనైనా శూన్యంలోంచి పుట్టుకురాదని, సాహిత్యమనేది ఒక సాంఘిక కార్యక్రమమని, కవి సమాజానికి జవాబుదారిగా ఉండాలన్న ఆలోచనల ఆధారంగా మార్క్సిస్ట్ విమర్శ సాగుతుంది. బోధించటం, సమీకరించటం తద్వారా సామాజిక మార్పుకు దోహదపడటం సాహిత్య ప్రయోజనంగా గుర్తిస్తుంది. రారా "సారస్వత వివేచన" వ్యాసాలు ఈ మార్క్సిస్ట్ విమర్శకు అద్దం పడతాయి.

పాఠ్యాంతర/ఆంటొలాజికల్ విమర్శ: దీనిని న్యూ క్రిటిసిజం/ఫార్మలిస్ట్ సిద్ధాంతం అనికూడా వ్యవహరిస్తారు. కవిత పాఠంలోనే దానికి సంబంధించిన అన్ని అంశాలు ఉంటాయి, బయట కాదు అనే ప్రాతిపదికన ఈ రకపు విమర్శ ఉ

ంటుంది. ఒక కవితను విశ్లేషించేటపుడు, దాని రచయిత జీవితం, చరిత్ర, సామాజికత, మనస్తత్వశాస్త్రం లాంటి బయట అంశాలను పరిగణలోకి తీసుకోక– ఆ కవితలో ఉన్న వస్తువు, శిల్పం, స్వరం, లయ, భాష, ఉద్వేగం లాంటి విషయాలను మాత్రమే లెక్కలోకి తీసుకొని విమర్శ సాగుతుంది. ఈనాటి విమర్శ పేరిట వస్తున్న వ్యాసాలు ఎక్కువభాగం ఇలాంటివే. శ్రీ సౌభాగ్య వివిధ కవులపై వెలువరించిన పుస్తకాలలో ఈ రకపు విమర్శనా పద్దతి కనిపిస్తుంది. దీన్ని ఫార్మలిస్ట్ విమర్శ అంటారు.

ప్రిమోడర్నిజం, మోడర్నిజం, పోస్ట్ మోడర్నిజం

పారిశ్రామిక విప్లవానికి పూర్వకాలం అంటే పదిహేడవ శతాబ్దం వరకూ అంతా ప్రిమోడర్నిజంగా పరిగణిస్తారు సాహిత్య విమర్శకులు. ఈ కాలంలో జ్ఞానం దైవదత్తమని, ప్రతీ సంఘటనా దైవేచ్ఛఅని, రాజుని దైవప్రతినిధిఆని భావించి ఆ రీతిలో ఎక్కువగా రచనలు సాగేవి. రామాయణం కాలం నుండి త్యాగరాజు కృతుల కాలం వరకూ ప్రి మోడర్న్ యుగమే అవుతుంది.

పదిహేడవ శాతాబ్దంలో శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందటంతో ప్రతీ విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో తర్కించటం మొదలయ్యింది. అన్నింటికీ సమాధానం విజ్ఞానంలోనే ఉందని భావించారు. రాచరికవ్యవస్థ రద్దయి, ప్రజాస్వామిక, పెట్టుబడి దారీ వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ దశ ఇరవయ్యోశతాబ్దం మధ్య వరకూ కొనసాగింది

మానవులందరూ ఒకటే, వసుధైక కుటుంబం అనే భావనలు ఈ కాలంలో సాహిత్యంలో బలంగా ప్రతిబింబించాయి.

“పంజరంలో ఇమడలేని, విశ్వనరుడను నేను” అంటూ జాషువా

“భూమధ్యరేఖ నా గుండెలోంచి పోతోంది” అంటూ వసుధైక గీతంలో తిలక్

“తెలుగు జాతి ఒకటి/భరతజాతి ఒకటి/ప్రపంచమే ఒకటి” అని దాశరధి– తమ విశ్వమానవతా వాదాన్ని ఎలుగెత్తి చాటారు.

పాతవన్నీ ప్రగతికి ప్రతిబంధకాలుగా కనిపించాయి. పాతవిలువల్ని

సంప్రదాయాల్ని సాహిత్యపరంగా ధ్వంశం చేయటం మోడర్నిజంగా గుర్తింపబడింది. అప్పటి కవుల వాక్యాలు కొన్ని ఇవి.

నా ఈ వచన పద్యాలనే దుడ్డు కఱ్ఱల్తో/పద్యాల నడుముల్ విరగదంతాను – పఠాభి

ఏదేశ చరిత్రచూసినా ఏమున్నది గర్వకారణం – శ్రీశ్రీ

మానవ మేధస్సుకు సంకెళ్లను తగిలించిన/గత సాంఘిక శిలాశాసనం/ పడగొట్టను పగిలిన నా నిప్పుల కరం/పలికిన విప్లవ గీతం– 'నా గీతం' రామదాసు

ఆత్మాశ్రయత, వేదన, నిరీక్షణ, విరహం వంటి భావాలు కలిగిఉండటం కూడా మోడర్నిస్టిక్ పొయెట్రీ లక్షణం. కొన్ని ఉదాహరణలు

ఎవ్వరని యెంతురో నన్ను? ఏ ననంత/ శోక భీకరతిమిరలోకైక పతిని– (కృశా)

గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ/కూకుండ నీదురా కూసింతసేపు! (ముద్దుల నా యెంకి – నండూరి)

నాకు తెలుసు, నాకు తెలుసు/ప్రళయవేదనా పంకిల ప్రపంచపథం మధ్య/ ప్రేమలు పొసగవనీ/ఈ బండరాళ్ళపైన ఏ మొక్కలు ఎదగవనీ – బైరాగి

శాస్త్రవిజ్ఞానమే అన్నింటికీ సమాధానం, "మానవుడేమహనీయుడు" అంటూ మొదలైన ఆధునిక వాదం, ఇరవయ్యోశతాబ్దం మధ్యకు వచ్చేసరికి తన ప్రాసంగితను కోల్పోయింది. టెక్నాలజీ ఇచ్చిన అతివిశ్వాసంతో వల్ల రెండు ప్రపంచయుద్ధాలని చూడవలసి వచ్చింది. సమాజం అస్థవ్యస్తంగా మారింది. నిరుద్యోగం పెచ్చరిల్లింది. పెట్టుబడిదారి వ్యవస్థవల్ల పెరిపోతున్న అసమానతలు, పారిశ్రామికీకరణ వల్ల ఉ ద్యోగాలకోసం తమ మూలాలనుంచి అలియనేషన్ కి గురవ్వటం వంటి మార్పులు ప్రజల్నిఅప్పటి వ్యవస్థ పట్ల అసంతృప్తికి గురిచేసింది. ఈ అసంతృప్తిలోంచి పోస్ట్ మోడర్నిజం పుట్టుకొచ్చింది

****

పోస్ట్ మోడర్నిజానికి స్పష్టమైన నిర్వచనం లేకపోయినా, 1960 ల నుంచి వచ్చిన కవిత్వలక్షణాలే పోస్ట్ మోడర్నిజం లక్షణాలుగా స్వీకరించవచ్చు.

విలువల్ని ధ్వంశం చేయటం

అంతవరకూ ఉన్న సామాజిక, నైతిక విలువల్ని పోస్ట్ మోడర్న్ కవిత్వం ధ్వంశం చేయబూనింది. జీవితంలో ఏర్పడిన అసంబద్ధత, సంక్లిష్టతలపై నిరసనతో చేసిన తిరుగుబాటు ఇది. అరవైలలో వచ్చిన దిగంబర కవిత్వంలో ఈ లక్షణం కనిపిస్తుంది.

భూమి ముసలి వరిబీజములా వున్నది
భూమి ఆంధ్రుల జీవితములా వున్నది
భూమి వచన కవితోద్యమంలా వున్నది
భూమి కడగని పీతిముడ్డిలా వున్నది
భూమి అచ్చంగా ఇండియాలా వున్నది – (బ్రహ్మపదార్థం– నగ్నముని)

పాతవిలువలను ధ్వంశం చేసే ప్రక్రియలో భాగంగానే చూడాలి పై వాక్యాలను. ఆ పనిని బలమైన కిక్ తో స్టార్ట్ చేసిన దిగంబర కవిత్వం, తెలుగులో పోస్ట్ మోడర్న్ కవిత్వాన్ని ప్రారంభించటంలో చారిత్రక పాత్రను పోషించింది.

సాంప్రదాయ కవిత్వరూపాన్ని బ్రేక్ చేయటం

ఎత్తుగడ, నడక ముగింపు ఉండాలనే పాతనియమాల్ని పోస్ట్ మోడర్న్ కవిత్వం తోసిపుచ్చింది.

అట్లా అని పెద్ద బాధా ఉండదు, వెల్లవేసిన గోడలేమో తెల్లబోతూ ఉ ంటాయి విద్యుత్కాంతికి. (నిరీహ – మో)

పద పద/ గబ గబ గబాల్మని/ దుఃఖంలోకి కాకుండా/ పడకుండా/ చెడకుండా చేరు ఎక్కడికైనా (ఓ! LES MOTS –సీతారాం) లాంటి వ్యక్తీకరణలు వస్తు రూపాల నియమాల్ని బద్దలు గొట్టాయి.

చరిత్రను నిరాకరించి ఎద్దేవా చేయటం:

జరుక్ శాస్త్రి 1941 లో వ్రాసిన "ఆశ్వాసాంతం" కవితలో ఆనాటికి తెలుగు సాహిత్యంలో కనుమరుగైపోయిన – చెళ్ళపిళ్ళ పద్యాలు, ఎంకిపాట, చలం వ్యధా, దేశభక్తి, డాడాయిజం, ఇమేజిజం, లాంటి సాహిత్యవాసన ఉన్న అంశాలను అద్భుతంగా పొందుపరచాడు. చివర్లో అతి పూజిత, అతికామిత, అతి

వాస్తవికాకారం, ఆహారం, ఆచారం వచ్చేసాయొచ్చేసాయి అంటాడు. తెలుగు సాహిత్యంలో మోడర్నిజం క్రమక్రమంగా మసకబారుతున్న కాలాన్ని ఈ కవిత రికార్డు చేసినట్లు అనిపిస్తుంది. చరిత్ర నిరాకరణ మోడర్నిస్టిక్ కవిత్వంలో కూడా ఉంది. కానీ పోస్ట్ మోడర్నిజంలో చరిత్రను హేళనతో, ధిక్కారంతో నిరాకరించటం కనిపిస్తుంది. దిగంబరకవిత్వం తరువాత వచ్చిన దళితకవిత్వంలో ఈ చరిత్రనిరాకరణ పదును దేలింది.

"నన్నయను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీకనులిమి గోతిలోకి లాగుతాడు ('ఆత్మయోని' నిఖిలేశ్వర్)

నా ఎండిన గొంతులోనే
ఎన్నెన్నో ఉదయాస్తమయాలు
ఆపుతావా నీ దశావతారాల తిల్లానా
నీ ఉచ్ఛిష్టంలో నా దీపం వెలగదు
నా గుడిసె బూడిదయింది నీ శాంతి వెన్నెల్లోనే (ఎ. దుర్గాప్రసాద్) లాంటి

వ్యంగ్య, ధిక్కార వ్యక్తీకరణలతో పోస్ట్ మోడర్న్ యుగం చరిత్రనిరాకరణ చేసింది.

భిన్నత్వాన్ని అంగీకరించటం

సమాజాన్ని, మానవజీవితాన్ని పట్టిఉంచే ఏకసూత్రత ఏమీ ఉండదని, విచ్ఛిన్నతే దాని లక్షణమని– ఆ ఫ్రాగ్మెంటేషన్స్‌ను అంగీకరించటము, వాటిని సెలిబ్రేట్ చేయటము పోస్ట్ మోడర్న్ లక్షణాలలో ముఖ్యమైనది. దీనిలో భాగంగా ఎనభైలలో దళిత, స్త్రీవాద, బహుజన, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు తెలుగుకవిత్వంలో ఆవిర్భవించాయి. పోస్ట్ మోడర్న్ కవిత్వం ఆరంభదశలలో అస్పష్టంగా ఉందన్న నింద మోసినా, తొంభైలనాటికి అది స్పష్టపడి, వస్తు వైవిధ్యాన్ని, శిల్ప నైశిత్యాన్ని పొందింది. ఈ నేపథ్యంలో ప్రముఖ విమర్శకుడు శ్రీ జి. లక్ష్మినరసయ్య ''దేశీయ మార్క్సిజం'' పేరుతో దళిత,బహుజన వాదాన్ని మార్క్సిజంతో సమన్వయపరచటానికి చేసిన ప్రయత్నం చెప్పుకోదగినది.

సాహిత్యంలో కేంద్రబిందువును తిరస్కరించటం

భిన్నకాలాలలో వచ్చిన సాహిత్యాన్ని పరిశీలిస్తే – మొదట దైవం కేంద్రంగాను,

క్రమక్రమంగా పురుషార్ధాలు, విశ్వమానవుడు, సమాజము కేంద్రబిందువులుగా వుంటూ వచ్చాయి. ఏదో ఒక కేంద్రబిందువు ఉండాలన్న భావనను పోస్ట్ మోడర్న్ సాహిత్యం తృణీకరించింది. భిన్నత్వాన్ని ఆహ్వానించింది

నమూనాలను తిరస్కరించటం

లింగ, కుల, మతపరమైన వివక్ష, మతం చెప్పే కట్టుబాట్లు లాంటి నమూనాలను పోస్ట్ మోడర్నిజం తిరస్కరించింది. దీనివల్ల అమెరికాలోని నల్లజాతీయులు, ఫ్రాన్స్ లోని అల్జీరియన్లు, మనవద్ద దళిత, బహుజన, మైనారిటీలు తమ హక్కులను సాహిత్యం ద్వారా ఎలుగెత్తి చాటారు. వాళ్లు "వసుధైక కుటుంబ సభ్యులుగా" కాక ప్రత్యేక అస్తిత్వం కొరకు పోరాడారు. పౌరహక్కుల స్పృహ పెరిగింది. స్త్రీవాదులు సెక్స్ కి జెండర్ కి మధ్య తేడాలను స్పష్టపరిచారు. పోస్ట్ మోడర్నిజం అనేది ఒక ఆలోచనా సరళిగా స్థిరపడింది.

పోస్ట్ మోడర్న్ దృక్పథంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయటానికి Post Structuralism (పాఠంలోనే అన్ని అర్థాలు ఉంటాయి అనే వాదన. ఉదా. కన్యాశుల్కం పాత్రల నడవడిక ఆ పాత్రల సంభాషణల్లో వెతకటం) Post Structuralism

(పాఠం యొక్క అర్థం, పాఠం వెలుపల ఉండే సోషల్, పొలిటికల్, హిస్టారికల్, ఇతర సిద్ధాంతాలను బట్టి కూడా ఉంటాయి అనే వాదన. ఉదా. జయప్రభ రచనలను స్త్రీవాద సిద్దాంత ఆధారంగాను, జూపాక సుభద్ర రచనలను దళిత స్త్రీవాద దృక్పథం ఆధారంగాను విశ్లేషించటం) Deconstruction (రచనలో బహుళార్ధాలను వెతకటం) లాంటి పద్దతులను వినియోగిస్తారు.

కళ అర్థాన్ని కలిగి ఉండాలని, చరిత్రనుంచి సత్యాల్ని వెలికితీయాలని, భాష వాస్తవాన్ని ప్రతిబింబించాలనే బాధ్యతలను పోస్ట్ మోడర్నిజం విస్మరించిందని విమర్శకుల అభిప్రాయం.

****

మెటా మోడర్నిజం/పోస్ట్ పోస్ట్ మోడర్నిజం

గత రెండు దశాబ్దాలుగా పర్యావరణ స్పృహ, ఆర్థిక మాంద్యం, టెర్రరిస్ట్ ఎటాక్‌లు, డిజిటల్ విప్లవం లాంటివి ప్రజల ఆలోచనలలో పారాడిమ్ షిఫ్ట్ ని తీసుకొచ్చాయి. ఈ మార్పుని పోస్ట్ మోడర్నిజం నుంచి, మెట మోడర్నిజం దశగా

జరుగుతున్న ప్రయాణంగా సామాజిక శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

పోస్ట్‌మోడర్న్ సాహిత్యంలో సాగిన హేళన, తృణీకారం, విలువల ధ్వంసం, భిన్నత్వాన్ని సెలిబ్రేట్ చేయటం లాంటి అంశాలు వివిధ వర్గాలు ఏర్పడేలా చేసింది. ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గపు వ్యక్తులకు అనుమానాస్పదంగా కనిపించారు. ఏ గుంపుకూ చెందని కవి ఏకాకిలా నిలబడవలసి వచ్చింది. ఇదొక విచిత్ర పరిస్థితి. 1990ల్లోనే సాహిత్యంలో పారాడిమ్ షిఫ్ట్ మొదలయిందని గమనించినా 2000 నాటికి అది స్పష్టపడింది.

మెటామోడర్నిజం అంటే మోడర్నిజానికి, పోస్ట్ మోడర్నిజానికి మధ్య అటూ ఇటూ ఊగిసలాడుతున్న దశ అని గుర్తించారు.

పోస్ట్ మోడర్నిజం పీడితుల పక్షాన నిలిచింది. ఈ క్రమంలో సమాజాన్ని పీడితులు, పీడకులు అని రెండు వర్గాలుగా విభజించి, మధ్యే మార్గాన్ని పూర్తిగా విస్మరించటం వల్ల అల్టర్నేటివ్ నేరేటివ్స్" రాకుండా పోయాయి. మెటా మోడర్నిజం లో ఇలాంటి "అన్ కంఫర్టబుల్ నేరేటివ్స్" ని పట్టుకొనే ప్రయత్నాలకి ఆదరణ కలుగుతుంది. మెటామోడర్న్ రచనలుగా గుర్తింపు తెచ్చుకొన్నరచనలలో ఈ లక్షణం కనపడుతుంది.

J.M. Coetzee's, Disgrace నవలలో వర్ణ వివక్ష ఉద్యమం తరువాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో సాగుతుంది. నవలా నాయకుడు డేవిడ్ కూతురైన లూసీని ముగ్గురు నల్లజాతీయులు రేప్ చేసిన సందర్భంలో వారిమధ్య జరిగిన సంభాషణ మొత్తం పుస్తకం ఆత్మను పట్టిస్తుంది.

లూసి: నన్నెందుకు వారు (నల్లజాతీయులు) ద్వేషిస్తున్నారు? నేను ఎన్నడూ వారిని వేరేలా చూడలేదు.

డేవిడ్: వాళ్లలోంచి చరిత్ర మాట్లాడుతున్నది. చారిత్రిక తప్పిదాలు... ఆ కోణంలోంచి ఆలోచించు. అలా చేయటం వ్యక్తిగతమైన విషయంగా కనిపించవచ్చు. కానీ అది వ్యక్తిగతం కాదు.

జొనాథన్ లిట్టెల్ వ్రాసిన The Kind ones నవల హోలోకాస్ట్ లో పాల్గొన్న సైనికాధికారి పాయింట్ ఆఫ్ వ్యూకి అక్షరరూపం. నాజీ దురాగతాలగురించి చాలా నవలలే వచ్చాయి. కానీ ఒక ఆల్టర్నేటివ్ నేరేటివ్ ని ముందుకు తెచ్చిన ఈ

నవల ప్రపంచవ్యాప్త గుర్తింపును పొందింది.

చారిత్రాత్మక, వాస్తవిక (బయోపిక్ లు), కుటుంబనేపథ్యంతో (ఇంట్లో ఆటిజంతో ఉన్న పిల్లలు, అల్జిమర్స్‌తో భాదపడే వృద్దులగురించిన నవలలు/ సినిమాలు) కూడిన రచనలు రావటం మెటామోడర్నిజం మరో లక్షణం.

"వర్గం గొప్పా వ్యవస్థ గొప్పా అన్న ప్రశ్న వచ్చినపుడు పోస్ట్ మోడర్నిజం వర్గం వైపే మొగ్గు చూపటంతో వ్యవస్థ విచ్ఛిన్నమైంది. దీన్ని గుర్తించిన మెటామోడర్నిజం మెటనెరేటివ్స్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. మెటానెరేటివ్స్ అంటే వైయక్తికానుభవాలను వ్యక్తీకరించటం. వాటి ద్వారా స్థానిక కథనాలకు ప్రాధాన్యత వస్తుంది. తద్వారా మనుషులను గుంపులుగా కాక వ్యక్తులుగా గుర్తించటానికి వీలవుతుంది.

****

ప్రజల మారుతున్న అభిరుచులు సాహిత్యంలోకి ప్రవేశిస్తాయి. కవులు కళాకారులు ఎప్పటికప్పుడు యుగ లక్షణాలను అందిపుచ్చుకొంటారు. తమ సాహిత్యంలో పొందుపరుస్తారు. అలా వచ్చిన సాహిత్యాన్ని విశ్లేషించటం ద్వారా చరిత్ర నడకను విభజిస్తారు తప్ప అది విలోమంలో జరగదు.

మానవ గతిని, సాహిత్యాన్ని యుగాలుగా, సిద్ధాంతాలుగా విభజించు కోవటం విశ్వవిద్యాలయ ప్రొఫసర్లకు, విమర్శకులకు, కొద్దిమంది కళాకారులకు అవసరం కావొచ్చు. కానీ సామాన్యమానవునికి ఇవేమీ తెలియవు. తెలియాల్సిన అవసరం లేదు కూడా. కానీ అతనికి తెలియకుండానే ఆ లక్షణాలకు అణుగుణంగా జీవిస్తాడు. ఈనాడు టెలివిజన్ డిబేట్లలో ఒక అంశంపై జరిగే చర్చలో అనేక వాదనలు వినబడతాయి తప్ప ఏకాభిప్రాయం కుదరదు. ఇది పోస్ట్ మోడర్నిజం నేర్పిన– భిన్నత్వాలను అంగీకరించటం అనే లక్షణం. గత రెండు దశాబ్దాలుగా హిట్ అయిన సినిమాలలో– చారిత్రిక, దేశభక్తి, బయోపిక్‌లు, జెనిటిక్‌డిజార్డర్స్ పిల్లల, కుటుంబ నేపథ్యంతో కూడుకున్నవి ఉండటం యాధృచికం కాదు. అది మెటా మోడర్నిజపు లక్షణం. ఆల్టర్నేటివ్ నేరేటివ్స్ రావాల్సి ఉంది ఇంకా.

కవిత్వం కొన్ని మౌలిక భావనలు

ఆంధ్రదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు కవి అని శ్రీశ్రీ అన్నప్పటికీ కవిత్వం అంటే చాలమందికి అర్ధంకాదనే అపోహ ఉంటుంది. కథలు, నవలలు విపరీతంగా చదివే వారు కూడా ఇదే భావన వ్యక్తం చేస్తూంటారు. దీనికి కారణం పాఠకులలో ఉందా లేక కవిత్వంలో ఉందా? శాస్త్రీయ సంగీతాన్ని ఆస్వాదించటానికి కొంత సంగీత పరిజ్ఞానం అవసరమైనట్లే కవిత్వాన్ని ఆనందించటానికి ప్రత్యేకమైన అర్హతలు కావాలా? ఒకరికి నచ్చిన కవిత మరొకరికి చప్పగా ఎందుకు అనిపిస్తుంది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు పొందటం అంత సులభంకాదు.

నిజానికి ఈ రోజు కవిత్వానికి వచ్చిన ప్రమాదమేమీ లేదు. భాషను మనిషి కనిపెట్టినప్పటినుంచీ కవిత్వం ఉంది, భాష ఉన్నంతవరకూ కవిత్వం ఉంటుంది. కవిత్వం సామాజిక, రాజకీయ భాద్యతలను మోస్తున్నంతవరకూ ప్రతీతరానికి దాని అవసరం ఉంటూనే ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రతీరోజూ కొత్తకవులు వస్తున్నారు, కొత్త కవిత్వం పుట్టుకొస్తూనే ఉంది. రాసిందంతా కవిత్వం కాకపోవచ్చేమో కానీ, అక్కడక్కడా కవిత్వ వాక్యాలు తళుక్కుమంటూ మెరుస్తున్నాయనేది సత్యం.

ఆలోచనలు, అనుభవాలు, అనుభూతులకు అక్షరరూపం కవిత్వం. "ఒక కవిత తన అక్షరాల ద్వారా పాఠకునిలో "poetic state of mind" ని కలిగించే సాధనమని" పాల్ వెలెరీ అంటాడు. ఈ "poetic state of mind" అనే పదం చాలా ముఖ్యమైనది.

ఒక ఇంటర్వ్యూలో డైరక్టర్ కృష్ణ వంశీ మాట్లాడుతూ " సీన్లు, డైలాగులు, మ్యూజిక్కు కాదు, వాటన్నిటినీ కలిపి చూస్తున్నప్పుడు ప్రేక్షకుని మనసులో ఏం

జరుగుతుందో అదే సినిమా అంటే" అంటాడు. కవిత్వం కూడా అంతే. ఒక కవిత చదివినపుడు – దానిరూపం, వస్తువు, వివిధ కవిత్వభాషా పనిముట్ల సహాయంతో చెప్పిన విధానం (శిల్పం), అంతర్లీనంగా ధ్వనించే భిన్న అర్థాల వల్ల పాఠకుని మనసులో మెదిలే స్థితే "poetic state of mind".

కవిత్వమంటే క్లుప్తంగా, గుప్తంగా, ప్రతీకాత్మకంగా, సంక్లిష్టంగా, ధ్వన్యాత్మకంగా, అమూర్తభావాలతో, భిన్న పొరలలో అర్థం చేసుకొనేదిగా ఉండాలన్న అభిప్రాయం ఎక్కువమందిలో ఉంటుంది. ఇది మంచిదే కానీ ఈ ప్రయత్నం కావాలని చేసినపుడు కవిత్వం అస్పష్టతలోకి జారిపోయే ప్రమాదం ఉంది. దార్విష్ "Extreme clarity is a mystery" అని అన్నది దీని గురించే. కవిత తేటగా ఉంటూ, చదవగానే ఇట్టే అర్థమౌతూ, గొప్ప ఉద్వేగాన్ని కలిగించగలగాలి.

ఈ ప్రపంచం ...'This World' by Czeslaw Milosz

బహుశా ఇదంతా
ఒక అపార్థంలా అనిపిస్తోంది
ట్రయల్‌రన్ ను అందరూ నిజమనుకొన్నారు

నదులు ఇక తమ మూలాలకు వెళిపోతాయి
గాలులు సుడులు తిరగటం ఆపేస్తాయి
చెట్లు చిగురించటం బదులు వ్రేళ్ళలోకి దూరిపోతాయి
వృద్ధులు బంతివెనుక, అద్దం వెనుకా పడతారు
మరలా వారు చిన్నపిల్లలైపోతారు
మృతులు లేచి దిక్కులు చూస్తుంటారు
ఇంతవరకూ సంభవించినదంతా అసంభవిస్తుంది

పంటిబిగువున బాధను సహిస్తున్న వాడా
ఎంత ఉపశమనం!
ఇక ఊపిరి పీల్చుకో!

మిలోజ్ పోలిష్ బోర్న్ అమెరికన్ కవి. నోబుల్ గ్రహీత. పై కవితలో అర్ధంకాని అమూర్తభావాలు, సంక్లిష్ట పదబంధాలు లేకుండా తేటగా ఉంది. అలా ఉంటూనే దార్విష్ చెప్పిన లోతైన మిస్టరీని కలిగిఉంది. దాన్ని ఛేదించాలంటే, కవితను జాగ్రత్తగా పదం పదం, వాక్యం వాక్యం పట్టి చదవాలి.

మనందరమూ జరిగిపోయిన ఒక విషయాన్ని తలచుకొని అలా జరగకుండా ఉంటే బాగుండును అనుకొంటాము, కాలం వెనుకకు తిరిగితే/ఇదంతా కల అయితే ఎంతబాగుండును అని ఆలోచిస్తాము. కాలచక్రాన్ని వెనక్కి మరలించటం అనే ఊహను ఒక్కో పదచిత్రం ద్వారా సాధించగలిగాడు మిలోజ్. ఈ క్రమంలో ఎంత దూరం వెళ్ళాడంటే ఇదంతా "ట్రైయల్ రన్" అనేంతగా.... ఇక చివరిన వచ్చే "పంటిబిగువున బాధను సహిస్తున్న వాడా" అనే వర్ణణలో ఈ కవిత ఆత్మ దాగుంది. ప్రజలు (కనీసం శ్రీ శ్రీ అన్న బాధాసర్పదష్టులు) పంటిబిగువున బాధను ఓర్చుకొంటూ ఎంతెలా నలిగిపోతున్నారంటే, ఈ ప్రపంచం ఇంతవరకూ నడిచిన దారిని వెనక్కు తిప్పుకొంటే తప్ప వారికి ఉపశమనం దొరకదు అన్న సజెషన్ ఉంది. ఈ ప్రపంచపు నడక మొత్తాన్ని ప్రశ్నిస్తున్నాడు కవి.

****

వచనానికి వాడే పదాల్నే కవిత్వానికి వాడతాం. కానీ కవిత్వాన్ని వచనాన్ని విడదీసేది "Defamiliarization" (అపరచయీకరణ) అంటాడు రష్యన్ కవి విమర్శకుడు Shkolovsky. జీవితంలో రోజూ ఎదుర్కొనే అనుభవాలు, చేసే ఆలోచనలు పదే పదే పునరావృతం అవుతుంటాయి కనుక వాటికి మనం అలవాటు పడిపోతాం. ఒక యంత్రంలా మారిపోయి పట్టించుకోం. రోజూ చూసే సూర్యోదయంలో కొత్తవెలుగుల్ని దర్శించలేం. దాన్నే ఒక కవి *"సూర్యకిరణాల కిలకిలారావానికి/లిట్మస్ పేపర్ లా ఆకాశం రంగు మారింది."* అన్నప్పుడు ఒక్క క్షణం ఆలోచిస్తాం. ప్రాతఃకాల పక్షుల కిలకిల శబ్దాలు స్ఫురణకు వస్తాయి. చిన్నప్పుడెపుడో స్కూల్‌లో లిట్మస్‌పేపర్ కళ్లముందే ఎర్రగా మారటం గుర్తుకొస్తుంది. వాడికపడి సాధారణమైపోయిన ఒక దృశ్యం అసాధారణంగా మనస్సులో ఉదయిస్తుంది.

లెబనాన్ అంతర్యుద్ధాన్ని బలంగా కవిత్వీకరించిన Wadih Saadeh కవిత ఇది.

లేకపోవటం – Absence

ఆ రోజు
పార్కులో
ఒక ఓక్ చెట్టు క్రింద ఉన్న
రెండు రాతికుర్చీలు మాత్రమే
ఖాళీగా ఉన్నాయి
అవి మౌనంగా ఉన్నాయి
ఒకదాన్నొకటి
తేరిపార చూసుకొని
భోరున విలపించాయి

రోజూ పార్కుకు వచ్చి కూర్చొనే ఇద్దరు వ్యక్తులు యుద్ధంలో మరణించగా, వారు కూర్చొనే రాతికుర్చీలు విలపిస్తున్నాయట. పార్కులలో ఖాళీకుర్చీలుండటం ఒక సాధారణ దృశ్యం. పై కవితలో ఆ దృశ్యాన్ని పెర్సొనిఫికేషన్ టెక్నిక్ ద్వారా ఒక కొత్తకోణంలో ఆవిష్కరించి ఒక బలమైన ఉద్వేగాన్ని పాఠకునిలో కలిగిస్తాడు. డిఫెమిలియరైజ్ చేయటం అంటే ఇదే. మంచి కవిత్వానికి ఇది ఆయువుపట్టు.

****

కవితలో వాడిన పదాలు పాఠకుని పూర్వజ్ఞాపకాలలోంచి వివిధ అంశాలను స్ఫురణకు తెప్పించటం మంచి కవిత్వానికి ఉండే ఒక లక్షణం. ఈ జ్ఞాపకాలు కూడా ఒక లాజికల్ ఆర్డర్ లో తెప్పించగలగటం పరిణితి చెందిన కవి చేసే పని.

కవి గారు

వ్రాసిన మొదటి వాక్యాన్ని
పాలకుల తొత్తులకు భయపడి
కత్తిరించేసాను.

మరో వాక్యం వ్రాసి
ఉద్యమకారులకు భయపడి
కత్తిరించేసాను.

అలా
నా ప్రాణాలు నిలుపుకోవటానికై
అనేక వందల వాక్యాల్ని
వధించాను.

చంపబడ్డ నా వాక్యాలన్నీ
దెయ్యాలై నా చుట్టూ తిరుగుతూ
నన్ను ప్రశ్నిస్తున్నాయి

ఓ కవీ!
నువ్వు కవివేనా లేక
కవిత్వ కసాయివా?
(Mr. Poet) శ్రీ సుర్జీత్ పతర్, పంజాబీ కవి.

పై కవితను చదివినపుడు ఇటీవల అప్రియసత్యాలను చెప్పినందుకు రచయితలపై అతివాద శక్తులు చేస్తున్న దాడులు, దబోల్కర్, గౌరి లంకేష్, కల్బుర్గి, గోవింద్ పన్సారె ల దారుణ హత్యోదంతాలు స్ఫురణకు వస్తాయి. అలాంటి భీతావహ నేపథ్యంలో రచయితలు, కవులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయలేకపోవటాన్ని అద్భుతంగా వ్యక్తీకరింపబడింది. నువ్వు కసాయివా అన్న ప్రశ్నకు పైన ఉండే వాక్యాలలోని తర్కం చక్కని భూమికను ఏర్పరిచింది.

//నా పడవలను నీటిపై వదిలి అలా ఆకాశం వైపు చూస్తాను.
అక్కడ చిట్టి మేఘాలు తమ తెల్లటి తెరచాపల్ని విప్పుకొని కనిపిస్తాయి.
నా పడవలతో పోటీ పడటానికై వాటిని ఆకాశంలోకి ,
ఏ, నా చెలికాడు వదులుతున్నాడో నాకు తెలియదు//.
(PAPER BOATS క్రిసెంట్ మూన్ – రవీంద్రనాథ్ టాగోర్)

ఆకాశంలో మబ్బులనే కాగితపు పడవలను, నా పడవలతో పోటీ పడటానికై ఎవరో నాచెలికాడు వదులుతున్నట్లున్నారు అనే పై కవితావాక్యాలు చదివినపుడు – మన బాల్యం, ఆనాటి ఆనందాలు, పసి హృదయాల నిర్మలత్వం, వారి అనన్యసామాన్య ఊహాశాలితా మనసుతెరపై ఒక్కొక్కటిగా వచ్చిపోతుంటాయి. ఆ వాక్యాలు చదువుతూ, పరిపరివిషయాలను స్ఫురణకు తెచ్చుకొంటున్న స్థితే "Poetic state of mind". చదివక ముందు చదివిన తరువాత మనసులో కలిగే మార్ధవతే కవిత్వం మనకిచ్చే బహుమతి.

****

అనుభవాలు రెండు రకాలు. స్వీయానుభవాలు. ఎవరి ద్వారానో వినో, చదివో ఉద్వేగాలను కలిగించుకొన్న అనుభవాలు.స్వీయానుభవాల ఆధారంగా వ్రాసిన కవిత్వంలో నిజాయితీ ఉంటుంది. ఇతరుల అనుభవాలను కవిత్వీకరించటంలో కవికి ప్రతిభలేనట్లయితే– అభిప్రాయప్రకటనలు గా మిగిలిపోతాయి.

వైయక్తిక అనుభవాన్ని ఎంత స్పష్టంగా వ్యక్తీకరించగలిగితే అంత గొప్ప సార్వజనీనత ఏర్పడుతుంది. ఈ వాక్యం పారడాక్సికల్ గా అనిపించవచ్చు. ఇక్కడ సార్వజనీనత అంటే ఎక్కువమంది కనక్ట్ అవ్వటంగా అర్ధం చేసుకోవాలి. ఎందుకంటే ప్రతీ వ్యక్తీ సాహిత్యాన్ని తనవి కాని అనుభూతుల్ని/అనుభవాలని తెలుసుకోవటం కొరకే చదువుతారు ఎక్కువగా.

అంతర్జాతీయ, జాతీయ, స్థానిక వార్తాకథనాలే కాదు– మనజీవితమూ, మన చుట్టూ ఉన్న వారి జీవితాలు కూడా సామాజికమే. వాటిని విస్మరించటం కవిగా నిజాయితీ లేకపోవటమే. వాటిపట్ల మౌనం వహించి వార్తాకథనాల వెంటపడటం అంటే– మన పక్కింట్లో గృహహింసను గురించి మాట్లాడకుండా సిరియాలో నరమేధం గురించి కవిత్వాలల్లినట్లు ఉంటుంది. కవి తనచుట్టూ ఉన్న జీవితాలలోని విషయాలకు, తన అనుభూతులను మిళితం చేసి కవిత్వీకరించినపుడు అతని కవిత్వం విలువపెరుగుతుంది. ఎంగిలి అనుభవాలు కవిత్వానికి శోభనివ్వవు

****

విజ్ఞాన శాస్త్రం శాస్త్రీయ దృక్పధాన్ని, సాంఘిక శాస్త్రం సామాజిక

అవగాహనను కలిగించినట్లే సాహిత్యం కూడా మనిషికి సన్మార్గాన్ని చూపించి సౌశీల్యతను పెంపొందిస్తుంది. అన్ని విద్యల అంతిమ లక్ష్యం మంచి నడవడిక నివ్వటం. ఆ విషయంలో సాహిత్యానిదే పై చేయి. చదివితే వచ్చే రాంకుల్లాగ, మార్కుల్లాగ సాహిత్యం చేసే పని పైకి కనిపించదు. మరీ ముఖ్యంగా కవిత్వం చేసే పని.

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు

రచనలు **యానాం విమోచనోద్యమం** (2007)
ఆకుపచ్చని తడిగీతం (2009) కవితా సంపుటి
ఫ్రెంచిపాలనలో యానం (2012)
స్వేచ్ఛావిహంగాలు (2016) (రవీంద్రుని స్ట్రే బర్డ్స్ అనువాదం)
వెలుతురు తెర (2016) కవితా సంపుటి

ఇ.బుక్స్ **'ఎడారి అత్తరులు'** (ప్రముఖ సూఫీకవుల గీతాల అనువాదాలు)
ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం (Twenty Love Poems and a Song of Despair, Pablo Neruda , అనువాదం)
రవీంద్రుని క్రిసెంట్ మూన్ అనువాదం
గాథాసప్తశతి–కొన్ని అనువాదాలు
వివిధ పుస్తకాల పరిచయ వ్యాసాలు
(పై ఇ.బుక్కులు http://www.scribd.com/bollojubaba వద్ద లభ్యం)

బ్లాగు http://sahitheeyanam.blogspot.com/
ఎఫ్.బి. https://www.facebook.com/bolloju.baba

అవార్డులు *'ఆకుపచ్చని తడిగీతం'* కు శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం 2010
శ్రీ ర్యాలి ప్రసాద్ – డా. సోమసుందర్ స్మారక సాహితీ పురస్కారం 2016
ఇస్మాయిల్ సాహితీ పురస్కారం 2017

Kavithva Bhasha

The Language of Poetry

Bolloju Baba



బాబాగారు పాశ్చాత్య అలంకార శాస్త్రం నుంచి కొన్ని అలంకారాలను అభివ్యక్తి పద్ధతులను తీసుకుని సోదాహరణంగా వివరించారు. ఇటువంటి రచనల్లో ఒక క్లేశం ఉంటుంది. తగిన ఉదాహరణలను ఎన్నుకోవడం అంత తేలిక కాదు. కొన్ని సందర్భాలలో ఆయన ఇచ్చిన ఉదాహరణలు చూశాక ఆ అవగాహనలోని కచ్చితత్వానికి (ప్రెసిషన్‌కి)నాకు ముచ్చటేసింది.

– శ్రీ రెంటాల వెంకటేశ్వర రావు

‘కవిత్వం భాష యొక్క భాష’ అని వేగుంట మోహన ప్రసాద్ అంటారు. బొల్లోజు బాబా ‘కవిత్వ భాష’ అంటున్నాడు. మొదటిది కవిగా మో కవిత్వానికిచ్చిన నిర్వచనం. రెండోది విమర్శకుడిగా లేదా పరిశీలకుడిలా కాదంటే సహృదయ పాఠకుడిలా ‘కవిత్వ భాష’ ఎట్లా ఉంటుంది? ఏది కవిత్వ భాష, ఎందుకు కవిత్వ భాష సాధారణ భాషకాంటే భిన్నంగా ఉంటుంది? ఇంకా ఇట్లాంటి ప్రశ్నలకు సమాధానం లాంటి వివరణ ఈ వ్యాస సంపుటిలోని వ్యాసాలలో కనిపిస్తుంది.

– సీతారాం

కవిత్వ భాష వ్యాసాలు

బొల్లోజు బాబా